www.bharathasakthi.com

# భారత్ శక్తి®

VOICE OF INDIAN

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి : 21 | సంచిక : 17 | హైదరాబాద్ | ఆదివారం,జూన్ 21 , 2026 | పేజీలు : 12 | వెల : 1.00

## మహారాష్ట్రలో ఘోర ప్రమాదం

### ఆలయం పైకప్పు కూలి ఆరుగురి మృతి



2లో..

## భాగ్యనగరంలో భారీ వర్షం..

### - జలమయమైన రహదారులు, స్తంభించిన ట్రాఫిక్

హైదరాబాద్,(భారత శక్తి) : భాగ్యనగరంలో భారీ వర్షం కురుస్తుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వాన పడుతుండటంతో పలు ప్రాంతాలు నీటమునిగాయి. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లోతట్టు ప్రాంతాలు పూర్తిగా నీట మునిగిపోగా, ప్రధాన



2లో..

## భారత్ ధర్మసత్రం కాదు: అమిత్ షా వ్యాఖ్యలు

- చొరబాటుదారులను ఓటు బ్యాంకుగా మార్చుకుంటున్నారని విమర్శలు
- ప్రతి చొరబాటుదారుడినీ గుర్తించి దేశం నుంచి పంపిస్తామని స్పష్టీకరణ
- ఈ దేశానికి చెందిన వారు మాత్రమే ఇక్కడుంటారని ఉద్ఘాటన

2లో..



## హర్మ్యూజ్ జలసంధిని మళ్లీ మూసివేసిన ఇరాన్..

### చమురు సరఫరాపై తీవ్ర ఆందోళన!

- లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులకు ప్రతిగా హర్మ్యూజ్ జలసంధి మూసివేత
- కీలకమైన జలమార్గంపై మళ్లీ పూర్తి నియంత్రణ ప్రకటించిన ఇరాన్
- ప్రపంచ చమురు సరఫరాపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం
- ఇరాన్ చర్య ఆమోదయోగ్యం కాదన్న అమెరికా
- కాల్పుల విరమణ ఉల్లంఘన వల్లే ఈ నిర్ణయమన్న టెహ్రాన్

2లో..




## పీఎం కిసాన్ 23వ విడత నిధులను

# విడుదల చేసిన ప్రధాని మోదీ

- 9.44 కోట్ల మంది రైతుల ఖాతాల్లోకి రూ. 18,880 కోట్లు జమ
- ప్రతి లబ్ధిదారునికి రూ. 2,000 చొప్పున ఆర్థిక సాయం
- పశ్చిమ బెంగాల్‌లోని తారకేశ్వర్ నుంచి నిధుల బదిలీ కార్యక్రమం

**న్యూఢిల్లీ (భారత శక్తి)** ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం-కిసాన్) పథకంలో భాగంగా 23వ విడత నిధులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం విడుదల చేశారు. పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లా తారకేశ్వర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన బటన్ నొక్కి, ఈ నిధులను నేరుగా రైతుల ఖాతాల్లోకి బదిలీ చేశారు. ఈ విడత కింద దేశవ్యాప్తంగా 9.44 కోట్లకు పైగా అర్హులైన రైతు కుటుంబాల బ్యాంకు ఖాతాల్లోకి మొత్తం రూ. 18,880 కోట్లకు పైగా నగదు జమ అయింది. 'పీఎం కిసాన్ ఉత్సవ్ దివస్' సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంలో, ప్రతి లబ్ధిదారునికి రూ. 2,000 చొప్పున ఆర్థిక సాయం అందింది. వ్యవసాయ పనులతో పాటు ఇతర కుటుంబ అవసరాలకు ఈ మొత్తం రైతులకు సకాలంలో అండగా నిలుస్తుందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది.

2లో..



## హైదరాబాద్ మెట్రో ఫేజ్-2కు

# కేంద్రం సహకరించాలి



- ▶ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి సీ.ఎం మరోమారు లేఖ.
- ▶ కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో భేటీకి చొరవ చూపాలని విజ్ఞప్తి
- ▶ జూన్ 22, 23 తేదీల్లో ఢిల్లీ పర్యటన.. ప్రతిపాదనలతో సిద్ధమైన రాష్ట్ర ప్రభుత్వం
- ▶ మెట్రో టేకోవర్, ఐఆర్ఎఫ్‌సీ (ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్) రుణ ఒప్పందాలపై చర్చించడమే లక్ష్యం

**హైదరాబాద్ జూన్ 20 (భారత శక్తి బ్యూరో):** హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు రెండో దశ (ఫేజ్-2) పనులను త్వరితగతిన పట్టాలెక్కించేందుకు తెలంగాణ ప్రభుత్వం ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది.

ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పెండింగ్ అంశాల పరిష్కారమే ధ్యేయంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మరో అడుగు ముందుకు వేశారు. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డికి శనివారం (జూన్ 20) ఆయన రెండోసారి లేఖ రాశారు. కేంద్ర రైల్వేల శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ఈ లేఖ ద్వారా కోరారు.

### నాలుగు రోజుల వ్యవధిలోనే రెండో లేఖ!

మెట్రో విస్తరణపై రాష్ట్ర ప్రభుత్వం ఎంతటి ప్రాధాన్యత ఇస్తోందో తాజా పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ నెల 16న (జూన్ 16) రాసిన లేఖలోనే హైదరాబాద్ మెట్రో రైల్‌కు సంబంధించిన కీలక సమస్యలను ప్రస్తావించిన విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. ఆయా అంశాల త్వరితగతిన పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వ జోక్యం ఎంతో అవసరమని, అందుకే తాజా లేఖ రాస్తున్నట్లు పేర్కొన్నారు.

2లో..

## మైనారిటీల విద్యాభివృద్ధికి

# ప్రభుత్వం కట్టుబడి ఉంది

### మంత్రి మహమ్మద్ అజహరుద్దీన్

- బోయపల్లిలో తెలంగాణ మైనారిటీ నివాస విద్యా సంస్థల సంఘం (టీఎంఆర్ఈఐఎస్) నూతన పాఠశాల భవనం ప్రారంభం
- నాణ్యమైన విద్య, వసతులతో విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా
- హాజరైన పార్లమెంట్ సభ్యురాలు డి.కె. అరుణ, శాసనసభ్యులు యెన్నం శ్రీనివాస్ రెడ్డి



**హైదరాబాద్, జూన్ 20: భారత శక్తి** తెలంగాణ రాష్ట్రంలో మైనారిటీల విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలు, మైనారిటీల సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజహరుద్దీన్ స్పష్టం చేశారు.

మహబూబ్‌నగర్ జిల్లా బోయపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన తెలంగాణ మైనారిటీ నివాస విద్యా సంస్థల సంఘం (టీఎంఆర్ఈఐఎస్) పాఠశాల భవనాన్ని ఆయన శనివారం ఘనంగా ప్రారంభించారు.

### ఆధునిక వసతులతో కార్పొరేట్ స్థాయి విద్య

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మహమ్మద్ అజహరుద్దీన్ మాట్లాడుతూ, మైనారిటీ విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో

2లో..

## 27 లక్షల మంది విద్యార్థులకు విజయ పాలు అందిస్తాం

### - భట్టి విక్రమార్క



**హైదరాబాద్ (భారత శక్తి)** పాడి రైతుకు భరోసా కల్పిస్తామని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. విజయ డెయిరీకి ప్రభుత్వ అండగా ఉంటుందని మాటిచ్చారు. 27 లక్షల మంది విద్యార్థులకు 'విజయ' పాలు అందించేందుకు కసరత్తు చేస్తున్నామని వివరించారు. శనివారం సచివాలయంలో పాల సేకరణ, వినియోగంపై భట్టివిక్రమార్క ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో పాల ఉత్పత్తిపై సమగ్ర నివేదిక కోరారు. ఈ సందర్భంగా మీడియాతో భట్టివిక్రమార్క మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీలకు విజయ డెయిరీ పాలు అందజేస్తామని చెప్పుకొచ్చారు. పాడి రైతులకు బకాయిలు లేకుండా చెల్లింపులు చేస్తామని తెలిపారు. రైతులకు సమయానికి బిల్లులు చెల్లించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పాలిచ్చే పశువుల అసలు సంఖ్య గుర్తించాలని అధికారులకు మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు పాడి పరిశ్రమే వెన్నెముక అని వ్యాఖ్యానించారు. రైతులకు అదనపు ఆదాయ వనరుగా పాడి పరిశ్రమ అభివృద్ధి చెందుతోందని తెలిపారు. పాల ధరలపై స్పష్టమైన విధానం అవసరమని అన్నారు. సంక్షేమ శాఖల నుంచే నేరుగా బిల్లుల చెల్లింపులు చేయాలని ఆదేశించారు. రైతులకు బకాయిలు లేకుండా ప్రత్యేక కార్యాచరణ చేపట్టామని చెప్పారు. తెలంగాణలో పాల ఉత్పత్తి పెంపునకు ఆధునిక విధానాలు పాటిస్తామని వెల్లడించారు. పాడి పరిశ్రమను లాభసాటిగా మార్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. సీఎం రేవంత్‌రెడ్డి సూచనల మేరకు ఈ చర్యలు చేపడతామని మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

## సర్వే, ల్యాండ్ రికార్డ్స్ డిప్యూటీ డైరెక్టర్ నరహరిరావు లాకర్లలో గుట్టలుగా నోట్ల కట్టలు, కిలోల కొద్దీ బంగారం!





**హైదరాబాద్, భారత శక్తి ప్రతినిధి, జూన్ 29:** ప్రజాధనాన్ని నిలువునా దోచుకుంటూ, లంచాల మరిగిన అవినీతి తిమింగలాల అసలు రంగు ఒక్కొక్కటిగా బయటపడుతోంది. సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ డిప్యూటీ డైరెక్టర్ సుంకరి నరహరిరావు అక్రమాస్తుల కేసులో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు శనివారం జరిపిన సోదాలు విస్తుగొలిపే నిజాలను వెలుగులోకి తెచ్చాయి. కోర్టు వారెంట్లతో హైదరాబాద్ శాలిబండలోని కెనరా బ్యాంక్ బ్రాంచ్‌లో ఉన్న నరహరిరావు భార్య పేరు మీది రెండు బ్యాంక్ లాకర్లను అధికారులు

2లో..

## రూ.లక్షా పదివేల కోట్ల ఆస్తులు కాపాడాం

### మాపై దుష్ప్రచారం ఆపండి: హైడ్రా కమిషనర్ రంగనాథ్


- హైడ్రాకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారంటూ రంగనాథ్ ఆగ్రహం
- హైడ్రాను బద్నాం చేసేందుకు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపాటు
- సిటీలో ఇప్పటి వరకు 600 ఆపరేషన్స్ పూర్తి చేశామని వెల్లడి
- తమకు రాజకీయ పార్టీలతో సంబంధం లేదన్న రంగనాథ్
- హైడ్రా ఎప్పుడూ మౌనంగా ఉండదని స్పష్టీకరణ

**హైదరాబాద్ (భారత శక్తి)** హైదరాబాద్‌లో ఆక్రమణదారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్న 'హైడ్రా'పై గత కొన్ని రోజులుగా వ్యతిరేక ప్రచారం జరుగుతోందంటూ ఆ సంస్థ కమిషనర్ ఏవీ రంగనాథ్ తీవ్రంగా స్పందించారు. కొందరు పనిగట్టుకుని తమ సంస్థను బద్నాం చేయడానికి దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఈరోజు హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన హైడ్రా యాక్షన్ ప్లాన్, ఇప్పటివరకు సాధించిన విజయాలపై పక్కా లెక్కలతో క్లారిటీ ఇచ్చారు హైడ్రా కేవలం కూల్చివేతలకే పరిమితం కాలేదని,

2లో..



# భగీరథ్‌కు బెయిల్



**హైదరాబాద్ (భారత శక్తి)** తెలంగాణలో గత నెల రోజులుగా హాట్ టాపిక్‌గా ఉన్న కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. భగీరథ్‌కు ఎట్టకేలకు మల్కాజ్‌గిరి కోర్టులో ఊరట లభించింది. దాదాపు నెల రోజులుగా చర్లపల్లి జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న అతనికి న్యాయస్థానం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది.ఒక మైనర్ బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో భగీరథ్‌పై కఠినమైన పోక్సో కేసు నమోదైన సంగతి తెలిసిందే. కేంద్ర మంత్రి కొడుకు కావడం, పైగా సున్నితమైన కేసు కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ అంశం పెద్ద చర్చనీయాంశంగా మారింది. కొన్ని రోజులు అజ్ఞాతంలోకి వెళ్లిన భగీరథ్.. మే 17న పోలీసుల ముందుకు వచ్చి సరెండర్ అయ్యాడు.ఆ తర్వాత మేడ్చల్ కోర్టు 14 రోజుల రిమాండ్ విధించడంతో చర్లపల్లి జైలుకు తరలించారు. బెయిల్ పిటిషన్లు తిరస్కరణకు గురవడంతో నెల రోజులకు పైగా జైల్లోనే గడపాల్సి వచ్చింది. తాజాగా ఇంజినీరింగ్ పరీక్షల నేపథ్యంలో, భగీరథ్ కు కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. దీంతో,

2లో..

# మైనారిటీల విద్యాభివృద్ధికిప్రభుత్వం కట్టుబడి ఉంది

రాష్ట్ర ప్రభుత్వం ఆధునిక విద్యా సంస్థలను శరవేగంగా అభివృద్ధి చేస్తోందని తెలిపారు. ప్రభుత్వ నివాస పాఠశాలలు (రెసిడెన్షియల్ స్కూల్స్), విద్యార్థి వేతనాలు (స్కాలర్‌షిప్‌లు), ప్రత్యేక శిక్షణ (కోచింగ్) సౌకర్యాలు, ఉచిత పాఠ్యపుస్తకాలు, నైపుణ్యాభివృద్ధి (స్కిల్ డెవలప్‌మెంట్) కార్యక్రమాల ద్వారా విద్యార్థుల భవిష్యత్తును బలోపేతం చేస్తున్నామని వివరించారు.

### విద్యే ప్రగతికి మూలాధారం

"సమాజ ప్రగతికి, వ్యక్తిగత అభివృద్ధికి విద్యే మూలాధారం. ఎంత ఎక్కువగా చదువుకుంటే అంత మెరుగైన ఉపాధి, ఉన్నత అవకాశాలు లభిస్తాయి. విద్యార్థులు కష్టపడి చదివి తమ ప్రతిభను నిరూపించుకోవాలి. వారికి అవసరమైన ప్రతి సహకారం, వసతులు అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది" అని మంత్రి పిలుపునిచ్చారు. ప్రతి విద్యార్థి తనలోని అంతర్గత నైపుణ్యాలను గుర్తించి, క్రమశిక్షణ, అంకితభావం, కఠోర శ్రమతో జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ముందుచూపు (విజన్)కు అనుగుణంగా తెలంగాణను విద్యా రంగంలో దేశానికే ఒక దిక్సూచిలా, ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు.

### ప్రజాప్రతినిధులు, అధికారుల హర్షం

బోయపల్లిలో నిర్మించిన ఈ నూతన పాఠశాల భవనం విద్యార్థులకు ఆహ్లాదకరమైన, మెరుగైన విద్యా వాతావరణాన్ని కల్పిస్తుందని సభలో పాల్గొన్న పలువురు నేతలు ఆశాభావం వ్యక్తం చేశారు.




మైనారిటీల విద్యాభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వారు అభినందించారు.

### కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు:

ఈ ప్రారంభోత్సవంలో టిమ్రిస్ సంస్థ అధ్యక్షులు (చైర్మన్) ఫహీమ్ ఖురేషి, తెలంగాణ రాష్ట్ర మైనారిటీల ఆర్థిక సంస్థ అధ్యక్షులు (చైర్మన్) ఉబైదుల్లా కొత్వాల్, మైనారిటీల సంక్షేమ శాఖ కార్యదర్శి బి. షఫీయుల్లా, మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు (ఎంపీ) డి.కె. అరుణ, మహబూబ్‌నగర్ శాసనసభ్యులు (ఎమ్మెల్యే), ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, సంఘాల నాయకులు, పురపాలక సంఘ సభ్యులు (కార్పొరేటర్లు), స్థానిక నాయకులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహారాష్ట్రలో ఘోర ప్రమాదం

## ఆలయం పైకప్పు కూలి ఆరుగురి మృతి

మహారాష్ట్రలో ఘోర ప్రమాదం జరిగింది. పర్భణీ జిల్లాలోని ప్రసిద్ధ యశ్వాడి మారుతి ఆలయంలో నిర్మాణంలో ఉన్న సభా మండపం పైకప్పు కూలిపోవడంతో ఆరుగురు భక్తులు మరణించారు. మరో 40 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. శిథిలాల కింద ఇంకా చాలామంది చిక్కుకున్నారని, మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.వివరాల్లోకి వెళితే, శనివారం సాయంత్రం 3:30 గంటల సమయంలో ఆలయంలో కీర్తన కార్యక్రమం జరుగుతోంది. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అదే సమయంలో రాజస్థానీ పింక్ స్టోన్స్, కాంక్రీట్ స్లాబులతో నిర్మిస్తున్న సభా మండపం ఒక్కసారిగా కుప్పకూలింది. దీంతో భక్తులు శిథిలాల కింద చిక్కుకుపోయారు.సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, జిల్లా యంత్రాంగం సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. క్రేన్లు, ఇతర భారీ యంత్రాల సహాయంతో శిథిలాలను తొలగిస్తున్నారు. గాయపడిన వారిని అంబులెన్సుల ద్వారా సమీప ఆసుపత్రులకు తరలించారు. ప్రమాద స్థలానికి ప్రజలు గుంపులుగా రావొద్దని అధికారులు విజ్ఞప్తి చేశారు.ఈ దుర్ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున పరిహారం ప్రకటించింది. నిర్మాణంలో నాణ్యతా లోపాల వల్లే ఈ ప్రమాదం జరిగిందా అనే కోణంలో విచారణ జరిపే అవకాశం ఉంది.

# హర్మూజ్ జలసంధిని మళ్లీ మూసివేసిన ఇరాన్..

## చమురు సరఫరాపై తీవ్ర ఆందోళన!

మధ్యప్రాచ్యంలో మరోసారి తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరుపుతున్న దాడులకు ప్రతిస్పందనగా, ప్రపంచ చమురు రవాణాలో అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిని మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. ఈ నిర్ణయంతో అంతర్జాతీయ ఇంధన మార్కెట్లలో ఒక్కసారిగా ఆందోళన మొదలైంది. గత కొద్ది వారాల్లోనే ఇరాన్ ఇటువంటి చర్యకు పాల్పడటం ఇది రెండోసారి కావడం గమనార్హం.ఇటీవల కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి, ఇజ్రాయెల్ లెబనాన్‌పై నిరంతర దాడులకు పాల్పడుతోందని ఇరాన్ ఆరోపించింది. శనివారం తెల్లవారుజాము నుంచి ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో సుమారు 16 నుంచి 32 మంది వరకు మరణించినట్లు లెబనాన్ మీడియా వర్గాలు వెల్లడించాయి. ఈ దాడులకు నిరసనగానే హర్మూజ్ జలసంధిపై తాము పూర్తి నియంత్రణను తిరిగి చేపట్టినట్లు ఇరాన్ సైనిక కమాండ్ స్పష్టం చేసింది.ప్రపంచవ్యాప్తంగా సరఫరా అయ్యే చమురులో ఐదో వంతు, అలాగే భారీ మొత్తంలో సహజవాయువు రవాణా ఈ జలసంధి గుండానే సాగుతుంది. ఇరాన్‌పై ఆంక్షలను సడలించి, స్విట్జర్లాండ్‌లో అణు చర్చలు నిర్వహించాలని నిర్ణయించిన తరుణంలో ఇరాన్ తీసుకున్న ఈ నిర్ణయం ఆ చర్చలకు ఆటంకం కలిగించేలా ఉంది. ఇరాన్ చర్య ఆమోదయోగ్యం కాదని వైట్‌హౌస్ వ్యాఖ్యానించింది. అయినప్పటికీ, దౌత్యపరమైన చర్చలను కొనసాగించేందుకు ప్రయత్నిస్తామని అమెరికా వెల్లడించింది.

# భారత్ ధర్మసత్రం కాదు: అమిత్ షా వ్యాఖ్యలు

శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే, కాంగ్రెస్ పార్టీలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. భారత్ ధర్మసత్రం కాదని, ఈ దేశం పౌరులకు మాత్రమే ఇక్కడ నివసించే హక్కు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. దేశంలోని ప్రతి చొరబాటుదారుడినీ గుర్తించి, వారిని వెళ్లగొడతామని హెచ్చరించారు. శనివారం మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో మహాలక్ష్మి ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.చొరబాటుదారులను ఓటు బ్యాంకుగా మార్చుకుని రాజకీయ లబ్ధి పొందాలని కాంగ్రెస్, ఉద్ధవ్ ఠాక్రే ప్రయత్నిస్తున్నారని అమిత్ షా ఆరోపించారు. "ఈ దేశం ధర్మసత్రం కాదని వారికి స్పష్టంగా చెప్పదలుచుకున్నాను. ఈ దేశానికి చెందిన వారు మాత్రమే ఇక్కడ ఉంటారు. ప్రతి చొరబాటుదారుడినీ గుర్తించి, దేశం నుంచి తరిమికొడతాం" అని ఆయన పేర్కొన్నారు.

# భాగ్యనగరంలో భారీ వర్షం..

రహదారులపైకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. దీంతో వాహనదారులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.నగరంలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, మాదాపూర్, గచ్చిబౌలి, హైటెక్ సిటీ పంజాగుట్ట, బేగంపేట్, ఖైరతాబాద్, అమీర్‌పేట్, కూకట్‌పల్లి, దిల్?సుఖ్‌నగర్, మలక్‌పేట్, టోలిచౌకి వంటి పలు ప్రాంతాల్లో వర్షం కురుస్తోంది. జీహెచ్‌ఎంసీ సిబ్బంది రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టారు.

### స్తంభించిన ట్రాఫిక్..

భారీ వర్షం కారణంగా భాగ్యనగరంలో ట్రాఫిక్ వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోయింది. ఐటీ కారిడార్ పరిధిలోని మాదాపూర్, గచ్చిబౌలి, హైటెక్ సిటీ రోడ్లతో పాటు పంజాగుట్ట, అసెంబ్లీ పరిసర ప్రాంతాలు, సికింద్రాబాద్ పరిధిలో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ద్విచక్ర వాహనదారులు వర్షంలో తడుస్తూ తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆఫీసుల నుంచి ఇళ్లకు వెళ్లే ఉద్యోగులు గంటల తరబడి ట్రాఫిక్‌లోనే చిక్కుకుపోయారు. పరిస్థితిని సమీక్షించిన నగర పాలక సంస్థ, ట్రాఫిక్ పోలీసులు ప్రజలకు పలు సూచనలు చేశారు.అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని అధికారులు హెచ్చరించారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, విద్యుత్ స్తంభాలు, తెరిచి ఉన్న మ్యాన్‌హోల్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. ట్రాఫిక్ ఇబ్బందులను అధిగమించడానికి మెట్రో రైలు సేవలను వినియోగించుకోవాలని ప్రయాణికులకు విజ్ఞప్తి చేశారు. జీహెచ్‌ఎంసీ మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీమ్స్ రోడ్లపై నిలిచిన నీటిని తొలగించేందుకు నిరంతరం శ్రమిస్తున్నాయని అధికారులు పేర్కొన్నారు.

# పీఎం కిసాన్ 23వ విడత నిధులను విడుదల చేసిన ప్రధాని మోదీ

2019 ఫిబ్రవరిలో ప్రారంభమైన ఈ పథకం ద్వారా చిన్న, సన్నకారు రైతులకు ఏటా రూ. 6,000 చొప్పున మూడు విడతల్లో ఆర్థిక సహాయం అందజేస్తున్నారు. తాజా విడుదలతో కలిపి ఈ పథకం కింద ఇప్పటివరకు రూ. 4.46 లక్షల కోట్లకు పైగా నిధులను పంపిణీ చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ విడతలో పశ్చిమ బెంగాల్‌లోని 45.35 లక్షల మంది రైతులకు రూ. 907 కోట్లు, గుజరాత్‌లోని 51.28 లక్షల మంది రైతులకు రూ. 1,025 కోట్లు అందాయి. దేశవ్యాప్త లబ్ధిదారులలో 2.18 కోట్లకు పైగా మహిళా రైతులు ఉండటం గమనార్హం. పథకం ప్రయోజనాలను సక్రమంగా పొందేందుకు రైతులు తమ ఈ-కేవైసీ ప్రక్రియను తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని అధికారులు సూచించారు. లబ్ధిదారులు తమ పేరును జాబితాలో తనిఖీ చేసుకునేందుకు జూఎెఅయిఖఅ.స్త్రశీఙ.ఱఅ వెబ్‌సైట్‌లోని 'ఫార్మర్స్ కార్నర్'ను సందర్శించవచ్చు.

# హైదరాబాద్ మెట్రో ఫేజ్-2కు కేంద్రం సహకరించాలి

### ఢిల్లీ పర్యటనలోనే కీలక చర్చలు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూన్ 22, 23 తేదీల్లో దేశ రాజధాని ఢిల్లీలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలోనే కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో సమావేశం అయ్యేలా చొరవ చూపాలని కిషన్ రెడ్డిని కోరారు.

### ఆ ప్రతిపాదనలతోనే ఢిల్లీకి..

కేంద్ర మంత్రితో జరిగే భేటీకి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల కసరత్తులను పూర్తి చేసింది. మెట్రో టేకోవర్ (స్వాధీనం) ప్రక్రియ, ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్‌ఎఫ్‌సీ) ద్వారా నిధుల సమీకరణకు సంబంధించిన రుణ ఒప్పందాలు, అలాగే మెట్రో ఫేజ్-2 ప్రతిపాదనల సమగ్ర ప్రతులను (కాపీలను) ఈ పర్యటనలో స్వయంగా తీసుకెళ్లనున్నట్లు ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

### కేంద్ర సమాచారం కోసం ఎదురుచూపు

హైదరాబాద్ ప్రజా రవాణా వ్యవస్థను అంతర్జాతీయ స్థాయికి చేర్చే ఈ ప్రాజెక్టుపై కేంద్రం సానుకూలంగా స్పందిస్తుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.

కేంద్ర రైల్వే మంత్రితో సమావేశాన్ని ఖరారు చేసి, ఆ సమాచారాన్ని తనకు వీలైనంత త్వరగా తెలియజేయాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి రాసిన లేఖలో రేవంత్ రెడ్డి కోరారు. ఈ భేటీ గనుక సఫలమైతే, భాగ్యనగర మెట్రో ఫేజ్-2 పనులకు లైన్ క్లియర్ కానుంది.

# ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు రూ 12 వేల రూపాయల విరాళం



**రుద్రవరం (భారత శక్తి)**మండల కేంద్రం రుద్రవరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు దాతలు రూ 12 వేల రూపాయలను విరాళంగా అందజేశారు. రుద్రవరంలోని ఉన్నత పాఠశాలలో హెడ్మాస్టర్ గా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ చేసినఆర్ కొత్తపల్లి గ్రామానికి చెందిన విశ్రాంత హెడ్మాస్టర్ దివంగతగంధం రామిరెడ్డి మనవడు ఇండియన్ పెట్రోల్ ఆయిల్ బంక్ ప్రొప్రైటర్ గంధం బ్రహ్మానందరెడ్డి కుమారుడు గంధం యశస్వి రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఉన్నత పాఠశాలలో ఉన్న మెయిన్ గేటు మరమ్మతల కోసం రూ 12 వేల నగదును ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ వెంకటరమణకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి పరిచేందుకుతమ వంతు సహాయంగా ఈ విరాళాన్ని అందజేయ డం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

# బీజేపీలో చేరిన ఎల్ఐసీ నరసింహులు..!



**సి.బెళగల్, (భారత శక్తి):** భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, కోడుమూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, మాజీ టీటీడీ పాలక మండలి సభ్యులు పరిగెల మురళీకృష్ణ నాయకత్వంపై విశ్వాసం వ్యక్తం చేస్తూ, సి.బెళగల్ మండలం గుండ్రేవుల గ్రామానికి చెందిన ఎల్ఐసీ నరసింహులు శనివారం భారతీయ జనతా పార్టీ (బీజేపీ)లో చేరారు. ఈ సందర్భంగా ఆయనకు పరిగెల మురళీకృష్ణ పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పరిగెల మురళీకృష్ణ మాట్లాడుతూ, భారతీయ జనతా పార్టీ దేశాభివృద్ధి, జాతీయత, సుపరిపాలన లక్ష్యాలతో ముందుకు సాగుతోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు చేరువయ్యేలా పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఎల్ఐసీ నరసింహులు పార్టీ సిద్ధాంతాలు, ప్రధాని నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్న తీరు, అలాగే పరిగెల మురళీకృష్ణ ప్రజాసేవా దృక్పథం తనను ఆకర్షించాయని పేర్కొన్నారు. ప్రజాసేవే లక్ష్యంగా బీజేపీలో చేరానని, పార్టీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.అలాగే కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేయడానికి పార్టీ కార్యకర్తలతో కలిసి పనిచేస్తానని ఆయన స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో పార్టీని మరింత బలోపేతం చేయడానికి తన అనుభవాన్ని వినియోగిస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ఘనంగా భాష్యం పాఠశాలలో

# ముందస్తు ఫాదర్స్ డే వేడుకలు

**ఎమ్మిగనూరు (భారత శక్తి)**ఎమ్మిగనూరు పట్టణంలో భాష్యం విద్యాసంస్థల చైర్మన్ రామకృష్ణ వైస్ చైర్మన్ హనుమంతరావు , రాయలసీమ వన్ జెడిఈఓ కవిత ఆదేశాల మేరకు భాష్యం పాఠశాలలో ఘనంగా ఫాదర్స్ డే ను జరుపుకోవడం జరిగింది. ఈ సందర్భంగా జెడ్ ఈవో కవిత మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జూన్ నెలలో వచ్చే మూడవ ఆదివారాన్ని అంతర్జాతీయ పితృ దినోత్సవం గా జరుపుకుంటామని తెలియజేశారు. నాన్న.. కుటుంబానికి వెన్నెముకనీ సృష్టిలో అమ్మ ప్రేమ ఎంత స్వచ్ఛమైనదో నాన్న బాధ్యత, త్యాగం కూడా అంతే గొప్పవని ఉదయం లేచిన మొదలు రాత్రి వరకు కుటుంబ భవిష్యత్తు కోసం పిల్లల ఆనందం కోసం ఆయన పడే పోరాటం వర్ణనాతీతం కుటుంబంలో అందరి అవసరాలు తీరుస్తూ తన కోరికలను ఇష్టాలను త్యాగం చేసి ఏకైక వ్యక్తి నాన్న అని నాన్న యొక్క గొప్పతనాన్ని విద్యార్థినీ విద్యార్థులకు మరియు తల్లిదండ్రులకు తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఫాదర్స్ కు ఆటల పోటీలను నిర్వహించడం జరిగింది. గెలుపొందిన ఫాదర్స్ కు జెడిఓ కవిత మరియు ప్రిన్సిపల్ నాగరాజ్ చేతులమీదుగా బహుమతులను ప్రధానం చేయడం జరిగింది.

## రూ.లక్షా పదివేల కోట్ల

# ఆస్తులు కాపాడాం

ఇప్పటివరకు సిటీలో దాదాపు 600 ఆపరేషన్స్ పూర్తి చేసి, ఆక్రమణదారుల గుప్పిట్లో ఉన్న సుమారు లక్షా పదివేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ ఆస్తులను, చెరువులను, పార్కులను కాపాడామని రంగనాథ్ వెల్లడించారు. దోపిడీకి గురికాకుండా ఉండాలనే ఆకాంక్షతోనే ప్రత్యేక తెలంగాణ కోసం ఇక్కడి ప్రజలు కొట్లాడారని, ఆ ఆశయాలకు అనుగుణంగానే ప్రభుత్వ ఆస్తులను రక్షిస్తున్నామని చెప్పారు.

"రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చింది. మాకు రాజకీయ పార్టీలతో సంబంధం లేదు. ఎంఐఎం అయినా, అధికార కాంగ్రెస్ అయినా మాకు ఒకటే. ఫాతిమా కాలేజీ లాంటి విద్యాసంస్థలు భాగ్యనగరంలో చాలా ఉన్నాయి.

చట్టం అందరికీ సమానమే. హైడ్రా ఎప్పుడూ సైలెంట్‌గా ఉండదు. అలాగని రాత్రికి రాత్రి వచ్చి ఇళ్లను కూల్చేస్తుందనేది అవాస్తవం" అని స్పష్టం చేశారు. గుడిసెలు వేసుకున్న వారిలో నిజమైన పేదలు ఎవరు అనేది పరిశీలిస్తామని, వారికి ప్రభుత్వం తరఫున డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించిన తర్వాతే తదుపరి చర్యలు ఉంటాయని మానవీయ కోణంలో మాట్లాడారు. ఇటీవల హైదరాబాద్‌లో కురిసిన భారీ వర్షానికి నగరం అతలాకుతలం అయిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఆక్రమణల వల్లే నాలాలు పూడిపోయి ఈ పరిస్థితి వచ్చిందన్నారు. "లక్ష మంది ప్రజలకు మంచి చేయాలన్నప్పుడు.. కొంతమంది ఆక్రమణదారులకు చెడు జరగక తప్పదు. ఒకవేళ హైడ్రా వైపు ఏమైనా తప్పు ఉంటే క్షమాపణ చెప్పడానికి కూడా సిద్ధమే. తప్పులు జరిగితే సరిదిద్దుకుంటూ ముందుకెళతాం. హైడ్రా పొలిటికల్ సెటిల్‌మెంట్లకు అడ్డాగా మాత్రం మారదు" అని తేల్చిచెప్పారు.

## సర్వే, ల్యాండ్ రికార్డ్స్ డిప్యూటీ డైరెక్టర్ నరహరిరావు లాకర్లలో గుట్టలుగా నోట్ల కట్టలు, కిలోల కొద్దీ బంగారం!

తెరిచారు. అందులో దొరికిన సొమ్ము చూసి ఏసీబీ అధికారులే ముక్కున వేలేసుకున్నారు.

### లక్షలు కాదు.. ఏకంగా కోటిన్నర నగదు!

ఆ లాకర్లలో గుట్టలుగా పడి ఉన్న నోట్ల కట్టలను చూస్తే సామాన్యుడి గుండె ఆగుతుంది. అక్రమంగా ఆర్జించిన రూ. 1,50,00,000/- (కోటి యాభై లక్షల రూపాయల) కరకరలాడే నోట్ల నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇది చాలదన్నట్టు ఒక్కొక్కటి 100 గ్రాముల బరువున్న 12 బంగారు బిస్కెట్లు, రెండు కిలోల బరువు తూగే విలువైన బంగారు, వజ్రాభరణాలను ఏసీబీ సీజ్ చేసింది. ఇప్పటికే అక్రమాస్తుల కేసులో అరెస్టయి జుడీషియల్ కస్టడీలో చిప్పకూడు తింటున్న ఈ అవినీతి అధికారి గుట్టు, లాకర్ల సోదాతో పూర్తిగా రచ్చకెక్కింది.

### ప్రజాధనం దోచుకునే మీ బతుకులెందుకు?

సామాన్య ప్రజలు రెక్కలుముక్కలు చేసుకుని, చెమటోడ్చి సంపాదించే రూపాయి రూపాయిని లంచాల రూపంలో మింగేస్తూ ఇలా లాకర్లలో కోట్లకు కోట్లు దాచుకుంటున్న ఈ అవినీతి తిమింగలాల బతుకులను చూస్తే సమాజం అసహ్యించుకుంటోంది. "ఎందుకురా మీ బతుకులు?" అని జనం ఛీత్కరించుకునేలా ఉంది వీరి తీరు. ప్రజల సేవ చేయాల్సిన కుర్చీల్లో కూర్చుని, అధికార మదంతో కళ్లు మూసుకుపోయి, ఇలా అవినీతి సామ్రాజ్యాలను నిర్మించుకోవడం సిగ్గుచేటు. చట్టబద్ధంగా వచ్చే జీతాలు సరిపోకనా ఈ కక్కుర్తి, ఈ రాక్షసానందం? రేపో మాపో దొరికిపోతామన్న కనీస భయం లేకుండా, పాపపు సొమ్ముతో లాకర్లు నింపుకున్న ఇలాంటి వారి బతుకులు చివరికి జైలు గోడల మధ్యే ముగుస్తాయని ఈ ఘటన మరోసారి నిరూపించింది. ప్రస్తుతం నరహరిరావుకు సంబంధించిన మరిన్ని అక్రమాస్తుల వెలికితీతపై ఏసీబీ అధికారులు లోతుగా దర్యాప్తు జరుపుతున్నారు.

# భగీరథ్‌కు బెయిల్

భగీరథ్ జైలు నుంచి బయటకు రానున్నారు.ఈ హైప్రొఫైల్ కేసులో తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండ దేశవ్యాప్తంగా చర్చ దారి తీసింది. ఒక కేంద్రమంత్రి కుమారుడు నిందితుడిగా ఉండటం, కేసులో తీవ్రమైన పోక్సో చట్టం సెక్షన్లు నమోదు కావడంతో పోలీసులు కూడా దీనిని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. దాదాపు నెల రోజులపాటు జైలు జీవితం గడిపిన భగీరథ్, లీగల్ ప్రొసీడింగ్స్ పూర్తి చేసుకొని చర్లపల్లి జైలు నుంచి శనివారం సాయంత్రం అధికారికంగా విడుదలయ్యే ఛాన్స్ ఉంది. హైదరాబాద్ శివారులోని పేట్ బషీర్‌బాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో మే 8వ తేదీ రాత్రి పది గంటల సమయంలో బండి భగీరథ్‌పై తొలి ఎఫ్ఐఆర్ నమోదు అయ్యింది. ఒక మైనర్ తల్లి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితురాలి తల్లి తన ఫిర్యాదులో పేర్కొన్న వివరాలు ప్రకారం... 2025 డిసెంబర్ 31వ తేదీ రాత్రి న్యూ ఇయర్ వేడుకల సమయంలో బండి భగీరథ్, 17 ఏళ్ల తన కుమార్తెపై లైంగిక వేధింపులకు పాల్పడినట్టు ఆరోపించారు. తీవ్రమైన ఆరోపణలు రావడంతో పోలీసులు ఈ కేసును ప్రాథమిక దర్యాప్తు చేసి, నిందితుడిపై బీఎన్ఎస్‌లోని సెక్షన్ 74, సెక్షన్ 75తోపాటు పో??సో యాక్ట్ 2012లోని సెక్షన్ 11, 12 కింద కేసు నమోదు చేశారు.

### నెలరోజులకుపైగా జైల్లోనే...

కేసు నమోదు కాగానే రాష్ట్రవ్యాప్తంగా దుమారం రేగింది. ఈ కేసు విచారణ కోసం డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ తిరిరాజ్ నేతృత్వంలో ఒక ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు అయ్యింది. బాధితురాలి స్టేట్‌మెంట్ రికార్డు చేసిన అనంతరం పోలీసులు చట్టపరమైన చర్యలను తీసుకున్నారు. అప్పుడు భగీరథ్ ముందస్తు బెయిల్ కోసం తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. అయితే అక్కడ ఉపశమనం లభించలేదు. దీంతో మే 16వ తేదీన పేట్‌బషీరాబాద్ పోలీసులు భగీరథ్‌ను అరెస్టు చేసి మేడ్చల్ మల్కాజ్‌గిరి కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానం అతనికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించడంతో అధికారులు అతనిని చర్లపల్లి సెంట్రల్ జైలుకు పంపించారు. ఆ తర్వాత రిమాండ్‌ను మరింత పొడిగించంతో దాదాపు నెలరోజులకుపైగా అతను జైల్లో ఉండాల్సి వచ్చింది. ఇప్పుడు ఇంజినీరింగ్ పరీక్షలు ఉన్నాయని కోర్టుకు విన్నవించుకోవడంతో మధ్యంతర బెయిల్ ఇస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో జూన్ 26 వరకు బండి భగీరథ్ ఇంటి వద్ద ఉండనున్నారు. దీనికి సంబంధించి కోర్టు కొన్ని షరతులను విధించింది. అధికారిక ప్రక్రియ పూర్తి అయిన తర్వాత భగీరథ్‌ను అధికారులు విడుదల చేయనున్నారు.

# సంపాదకీయం

భారత శక్తి
VOICE OF INDIAN

## అపహాస్యమవుతున్న హాస్యం

ప్రస్తుత డిజిటల్ యుగంలో స్టాండప్ కామెడీ సంస్కృతి యువతను విపరీతంగా ఆకట్టుకుంటోంది. అయితే, ఈ మధ్యకాలంలో హాస్యం పండించడం కంటే వివాదాలు సృష్టించడమే దీని ప్రధాన లక్షణంగా మారిందా అనే అనుమానాలు బలపడుతున్నాయి. కామెడీ క్లబ్‌లలో లేదా సోషల్ మీడియా రీల్స్‌లో వ్యక్తమవుతున్న కొన్ని అభిప్రాయాలు, జోకులు నవ్వు తెప్పించకపోగా, వినేవారికి తీవ్ర అసహ్యం కలిగిస్తున్నాయి. హాస్యానికి , ఎగతాళికి, అవమానపర్చడానికి , అసభ్యతకు మధ్య ఉన్న లక్ష్మణ రేఖను కొందరు పూర్తిగా విస్మరిస్తుండటంతో ఈ సరిహద్దుల వివాదం ఇప్పుడు పోలీస్ స్టేషన్లు, కోర్టుల వరకు వెళ్తోంది.ఇలాంటి వివాదాల్లో చిక్కుకుంటున్న వారిలో ఎక్కువ మంది ప్రొఫెషనల్ కామిక్స్ కాకపోవడం గమనార్హం. ఐటీ రంగానికి చెందిన టెకీలు, వైద్య వృత్తిలో ఉన్న డాక్టర్లు, ఇతర రంగాల వారు కేవలం పార్ట్-టైమ్ క్రేజ్ కోసం మైక్ పట్టుకుని స్టేజ్ ఎక్కుతున్నారు. గతంలో ఒక ప్రదర్శనలో ఐదేళ్ల చిన్నారిపై అత్యంత అసహ్యకరమైన, లైంగిక కోణంలో జోకులు వేసిన ఉదంతం దేశవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తించింది. ఇటీవల ముంబై, గురుగ్రామ్‌లలో జరిగిన 370 రూపాయల బిర్యానీ వివాదం కూడా తీవ్ర చర్చకు దారితీసింది. మహిళల ఆత్మగౌరవాన్ని, సమ్మతిని కించపరిచేలా ప్రేక్షకులు మాట్లాడిన మాటలను సదరు కమెడియన్ అడ్డుకోకుండా ప్రోత్సహించడంపై జాతీయ మహిళా కమిషన్ తీవ్రంగా స్పందించింది. దీనివల్ల సదరు వ్యక్తులు తమ చేతులా కెరీర్లను పాడుచేసుకోవడమే కాకుండా, ఉద్యోగాలు కోల్పోయి చట్టపరమైన ఇబ్బందులు కొనితెచ్చుకుంటున్నారు.రాజకీయ విమర్శల పేరుతో నేతల వ్యక్తిగత, కుటుంబ జీవితాలను కించపరిచేలా మాట్లాడటం స్టాండప్ కామెడీ కాదు.. అది ముమ్మాటికీ వ్యక్తిత్వ హననమే. రాజకీయ నాయకులను టార్గెట్ చేస్తూ కామెడీ చేయడం ఈ రంగంలో ఒక సాధారణ అంశమే అయినప్పటికీ, ఇటీవల ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడులపై కొందరు కమెడియన్లు చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. హైదరాబాద్‌కు చెందిన కమెడియన్ అనుదీప్ కాటికాల పవన్ కల్యాణ్ వ్యక్తిగత జీవితాన్ని, కుటుంబ వ్యవహారాలను ఎగతాళి చేస్తూ చేసిన వ్యాఖ్యలపై జనసేన శ్రేణులు తీవ్రంగా మండిపడ్డాయి. ఫలితంగా ఏపీ పోలీసులు ఉత్తరప్రదేశ్‌కు వెళ్లి మరీ అతడిని అరెస్ట్ చేయాల్సి వచ్చింది. అలాగే మరో కమెడియన్ శరత్ ఉదయ్ గతంలో చంద్రబాబు నాయుడు, నారా లోకేశ్‌లను ఉద్దేశించి చేసిన పాత జోకులపై బెంగళూరులో జరుగుతున్న లైవ్ షోలో కొందరు అభిమానులు గొడవకు దిగి, బలవంతంగా క్షమాపణలు చెప్పించడం కూడా పెద్ద సంచలనంగా మారింది.రాజకీయ విమర్శలు, వ్యంగ్యం అనేది ప్రజాస్వామ్యంలో సహజం.

అమెరికా, యూరప్ దేశాల్లో అధ్యక్షులపైనే తీవ్రమైన జోకులు వేస్తుంటారు. కానీ, అక్కడ ఆ వ్యంగ్యం వారి విధానాలు, నిర్ణయాలపై ఉంటుంది తప్ప వారి వ్యక్తిగత జీవితాల మీద, భార్యాపిల్లల మీద ఉండదు. మన దగ్గర జరుగుతున్న పొరపాటు ఇదే. పవన్ కల్యాణ్ గత వైవాహిక జీవితాన్ని ప్రస్తావించడం, లేదా చంద్రబాబు నాయుడిపై జరిగిన పాత హత్యాయత్న ఉదంతాలను హాస్యాస్పదం చేయడం ఏమాత్రం ప్రొఫెషనలిజం అనిపించుకోదు. కామెడీ పేరుతో సినీ సెలెబ్రిటీల వ్యక్తిగత జీవితాలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన తెలుగు స్టాండప్ కమెడియన్ అనుదీప్ కటికాల అరెస్ట్ అయ్యారు. కాకినాడ పోలీసులు ఉత్తర ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో అతడిని అదుపులోకి తీసుకున్నారు. అనుదీప్ సినిమా సెలెబ్రిటీలను కించపరుస్తూ కామెడీ చేశారు.

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, నిహారిక, రామ్ చరణ్‌లపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.ఆ వీడియోలను చూసిన మెగా అభిమానులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. షో జరుగుతున్న చోటుకు వెళ్లారు. అయితే, ఈ విషయం తెలుసుకున్న అనుదీప్ అక్కడినుంచి పరారయ్యాడు.

రెండు రోజుల తర్వాత మెగా కుటుంబానికి క్షమాపణ చెబుతూ వీడియో రిలీజ్ చేశాడు. అయినా లాభం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలోనే జనసేన పార్టీ ఈస్ట్ గోదావరి జాయింట్ సెక్రటరీ బడే వెంకట కృష్ణ.. కాకినాడ పోలీస్ స్టేషన్‌లో అనుదీప్‌పై ఫిర్యాదు చేశారు. పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసుకున్న కాకినాడ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.నవ్వులు పూయించాల్సిన వేదికలు కాస్తా, రాజకీయ కక్షలకు, వ్యక్తిగత దూషణలకు సాధనాలుగా మారుతుండటంతోనే సమాజం నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తోందిఈ పరిణామాలన్నీ స్టాండప్ కామెడీ రంగంలో సెల్ఫ్ సెన్సార్‌షిప్ ఎంత అవసరమో గుర్తుచేస్తున్నాయి. కేవలం కొన్ని వ్యూస్ కోసం, చప్పట్ల కోసం , వైరల్ అవ్వాలనే తాపత్రయంతో సమాజం అంగీకరించని హద్దులను దాటడం వల్ల కెరీర్‌లు ముగిసిపోతాయి తప్ప గుర్తింపు రాదు. చట్టం తన పని తాను చేసుకుపోతున్న తరుణంలో.. హాస్యం అంటే ఎదుటివారిని నొప్పించడం కాదు, మెప్పించడం అనే కనీస ధర్మాన్ని కమెడియన్లు తెలుసుకోకపోతే ఈ వేదికల ఉనికికే ప్రమాదం ఏర్పడే అవకాశం ఉంది.

## ప్రభుత్వ ఖజానాకు కన్నం..

# అన్నదాతల 'ధాన్యం' మాయం!..

**భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల, జూన్ 20:** ప్రభుత్వ ధాన్యం కొనుగోలు ప్రక్రియలో భారీ అక్రమాలకు పాల్పడి, నకిలీ ట్రక్ చిట్టీలను సృష్టించి సుమారు రూ.91 లక్షల ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేసిన అంతర్-జిల్లా ముఠాను సిరిసిల్ల పట్టణ పోలీసులు చాకచక్యంగా ఛేదించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను జిల్లా ఎస్పీ మహేష్ బి. గిత్ సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈ కుంభకోణంలో పాల్గొన్న ఆరుగురు నిందితులను సిరిసిల్ల టౌన్ పోలీసులు అరెస్ట్ చేసినట్లు ఎస్పీ తెలిపారు.




### రూ.14.16 లక్షల నగదు స్వాధీనం
### - రూ.46.21 లక్షల బ్యాంక్ ఖాతాల ఫ్రీజ్.

నిందితుల నుంచి పోలీసులు రూ.14.16 లక్షల (ఖచ్చితంగా రూ.14,16,800) నగదును స్వాధీనం చేసుకున్నారు. అలాగే వారి వివిధ బ్యాంక్ ఖాతాలలో ఉన్న రూ.46.21 లక్షల (ఖచ్చితంగా రూ.46,21,358) నిధులను ఫ్రీజ్ చేసినట్లు ఎస్పీ వివరించారు. ఈ కేసులో ఇంకా దర్యాప్తు కొనసాగుతోందని, నిధుల దుర్వినియోగంపై మరింత లోతుగా విచారణ చేస్తున్నామని పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం పెద్దూర్ అపారెల్ పార్క్ గోదాంలో మేనేజర్‌గా పనిచేస్తున్న కరీంనగర్‌కు చెందిన ఉత్క్యం విజయ్ (ఏ 1), అతనితో కలిసి పనిచేస్తున్న వేములవాడ రూరల్ అర్చనపల్లి గ్రామానికి చెందిన వాసాల గణేష్ (ఏ 5) ప్రధాన సూత్రధారులుగా మారారు. వీరు ఐకేపీ కేంద్రాల నుండి ధాన్యం వచ్చినట్లు అక్రమంగా నకిలీ ట్రక్ చీటీలను తయారు చేశారు. ఈ మోసంలో భాగంగా రుద్రంగి ఐకేపీ కేంద్రం ఇన్-చార్జ్ గడ్డం స్వామి (ఏ 3) రెండు లారీలకు నకిలీ ట్రక్ చీటీలు జారీ చేయగా, వాటిని ఉత్క్యం విజయ్ సివిల్ సప్లై వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశాడు. అనంతరం ఆ నిధులను నిందితులు తమలో తాము పంచుకున్నారు.అదేవిధంగా, డి.ఎం.ఓ కార్యాలయంలో మండల స్థాయి కో-ఆర్డినేటర్‌గా పనిచేస్తున్న కమ్మరి రాజశేఖర్ (ఏ 2), బద్దెనపల్లి పీఏసీఎస్ కేంద్రం ఇన్-చార్జ్ గాజుల నవీన్ (ఏ 6)తో కలిసి ఒక లారీ ధాన్యానికి నకిలీ ట్రక్ చీటీని సృష్టించారు. దానిని ఉత్క్యం విజయ్‌కు అందించగా, అతను సివిల్ సప్లై వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశాడు. దీనికి రాజశేఖర్ ఆమోదం తెలిపాడు. ఆ తర్వాత విడుదలైన నిధులను ఈ ముగ్గురు పంచుకున్నారు.

### - గోదాముకు రాకుండానే మాయమైన 10 లారీల ధాన్యం.

ఇంకా పెద్ద ఎత్తున జరిగిన మరో మోసంలో వివిధ ఐకేపీ కేంద్రాల నుంచి అపారెల్ పార్క్ గోదాంకు వచ్చిన 10 లారీల ధాన్యానికి సంబంధించిన నిల్వలను గోదాంలో దించకుండానే, ఆన్‌లైన్‌లో మాత్రం దించినట్లు రికార్డుల్లో తప్పుగా నమోదు చేశారు. అనంతరం ఆ ధాన్యాన్ని గోదాంలో దించకుండా నేరుగా వేములవాడకు చెందిన చేపూరి మధుకర్ (ఏ 4)కు అప్పగించారు. మధుకర్ ఆ ధాన్యమును సిద్దిపేటకు చెందిన కమిషన్ ఏజెంట్ చిటుకుల శ్రీకాంత్ (ఏ 7) ద్వారా వివిధ రైస్ మిల్లులకు విక్రయించి, ఆ విధంగా వచ్చిన భారీ మొత్తాన్ని నిందితులంతా పరస్పరం పంచుకున్నారు. పై మోసాలను మరియు అక్రమాలను గుర్తించిన జిల్లా సివిల్ సప్లై మేనేజర్ ఎస్. నరసింహ సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, డీఎస్పీ నాగేంద్రచారి ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక పోలీస్ టీమ్‌ను ఏర్పాటు చేసి నిందితులను పట్టుకున్నారు. పోలీసులు ఈ కేసులో నిందితుల నుంచి రికవరీ చేసిన నగదు మరియు బ్యాంక్ నిధుల **వివరాలను ఈ క్రింది విధంగా వెల్లడించారు:**

ఏ 1. ఉత్క్యం విజయ్ తండ్రి: రాజమల్లయ్య, వయస్సు: 36 సంవత్సరాలు, కులం: గౌడ, నివాసం: విద్యానగర్, కరీంనగర్ టౌన్. (పెద్దూర్ అపారెల్ పార్క్ గోదాం మేనేజర్).
రికవరీ: ఇతని వద్ద నుండి రూ.2,85,400 నగదు స్వాధీనం, ఇతని ఖాతాలోని రూ.37,65,358 ఫ్రీజ్ చేయబడింది.

ఏ 2. కమ్మరి రాజశేఖర్ తండ్రి: నర్సయ్య, వయస్సు: 36 సంవత్సరాలు, వృత్తి: మండల స్థాయి కో-ఆర్డినేటర్ (డి ఎం ఓ కార్యాలయం), కులం: మాల, నివాసం: బై నగర్, సిరిసిల్ల టౌన్.
రికవరీ: ఇతని వద్ద నుండి రూ.1,50,000 నగదు స్వాధీనం.

ఏ 3. గడ్డం స్వామి (రుద్రంగి ఐకేపీ కేంద్రం ఇన్-చార్జ్).

ఏ 4. చేపూరి మధుకర్ ఏ మధుకర్ తండ్రి: ప్రసాద్, వయస్సు: 40 సంవత్సరాలు, వృత్తి: మల్లికార్జున రైస్ మిల్ ఓనర్, కులం: వైశ్య, నివాసం: సాయినగర్, వేములవాడ టౌన్.
రికవరీ: ఇతని వద్ద నుండి రూ.9,81,400 నగదు స్వాధీనం, ఇతని ఖాతాలోని రూ.4,68,555 ఫ్రీజ్ చేయబడింది.

ఏ 5. వాసాల గణేష్ తండ్రి: గంగయ్య, వయస్సు: 40 సంవత్సరాలు, కులం: పద్మశాలి, వృత్తి: సూపర్‌వైజర్ (ఎస్ డబ్ల్యూ సి గోదాం, అపారెల్ పార్క్, పెద్దూర్, సిరిసిల్ల), నివాసం: అర్చనపల్లి గ్రామం, వేములవాడ రూరల్.
రికవరీ: ఇతని ఖాతాలోని రూ.8,67,711 ఫ్రీజ్ చేయబడింది.

ఏ 6. గాజుల నవీన్ తండ్రి: లక్ష్మణ్, వయస్సు: 31 సంవత్సరాలు, కులం: పద్మశాలి, వృత్తి: పీఏసీఎస్ ఇన్-చార్జ్, నివాసం: పద్మనగర్, బద్దెనపల్లి గ్రామం, తంగళ్లపల్లి మండలం.

ఏ 7. చిటుకుల శ్రీకాంత్ తండ్రి: భూమయ్య, వయస్సు: 45 సంవత్సరాలు, కులం: వైశ్య, వృత్తి: వ్యాపారం, నివాసం: మోహినిపుర స్ట్రీట్, సిద్దిపేట టౌన్. (కమిషన్ ఏజెంట్).

ప్రస్తుతం నిందితులు ఏ 1 ఉత్క్యం విజయ్, ఏ 2 కమ్మరి రాజశేఖర్, ఏ 4 చేపూరి మధుకర్, ఏ 5 వాసాల గణేష్, ఏ 6 గాజుల నవీన్‌లను పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. ప్రభుత్వ ధాన్యం కొనుగోలు ప్రక్రియలో నకిలీ పత్రాలు సృష్టించి, ధాన్యాన్ని అక్రమంగా విక్రయిస్తూ ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేసిన ఈ కేసులో మరింత లోతైన దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

# జూన్ 30లోగా ఆస్తి పన్ను చెల్లించాల్సిందే!

## - నిర్లక్ష్యం వహిస్తే జప్తు తప్పదు: శంషాబాద్ జోనల్ కమిషనర్ హెచ్చరిక

**బడంగ్పేట్ జూన్ 20: భారతశక్తి** శంషాబాద్ జోన్ పరిధిలోని ఆస్తి పన్ను చెల్లింపుదారులు తమ ప్రస్తుత మొదటి అర్ధ సంవత్సర పన్నును ఈ నెల 30వ తేదీ లోగా చెల్లించాలని శంషాబాద్ జోనల్ కమిషనర్ చంద్రకళ ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. గడువు దాటితే చట్టపరమైన కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు.




### గడువు దాటితే పెనాల్టీల వాత!

ఆస్తి పన్ను చెల్లింపుల్లో అలసత్వాన్ని వీడి, సకాలంలో బాధ్యతను నెరవేర్చాలని అధికారులు సూచించారు. నిబంధనల ప్రకారం ముఖ్యమైన వివరాలు ఇలా ఉన్నాయి:

**ఆఖరి తేదీ:** మొదటి అర్ధ సంవత్సర ఆస్తి పన్ను చెల్లించడానికి 2026 జూన్ 30 చివరి గడువు.

**భారీ వడ్డీ:** వచ్చే నెల (01-07-2026) నుండి చెల్లించని ప్రస్తుత పన్నుపై నెలకు 2 శాతం చొప్పున వడ్డీ,అదనంగా పడుతుంది. పాత బకాయిలపై కూడా ఇదే పద్ధతిలో 2 శాతం సాధారణ వడ్డీ కొనసాగుతుంది. లికఠిన చర్యలు: గడువు ముగిసినా స్పందించని పన్ను ఎగవేతదారులపై మున్సిపల్ కార్పొరేషన్ చట్టంలోని సెక్షన్ 269 ప్రకారం చర్యలు తీసుకుంటారు. ఇందులో భాగంగా డిస్ట్రెస్ వారెంట్ జారీ చేయడం, ఆస్తులను జప్తు చేయడం, మరియు ఆయా ఆస్తులకు అందించే అవసరమైన సేవలను నిలిపివేయడం జరుగుతుంది.

### శంషాబాద్ జోన్ పరిధిలోని ప్రాంతాలు:

ఈ ఆదేశాలు శంషాబాద్ జోన్ పరిధిలోని క్రింది మున్సిపల్ సర్కిళ్లకు వర్తిస్తాయి:

1. ఆదిబట్ల (సర్కిల్-15)
2. బడంగ్‌పేట్ (సర్కిల్-16)
3. జల్పల్లి(సర్కిల్-17)
4. శంషాబాద్ (సర్కిల్-18)

### పన్ను చెల్లింపులు సులభం.. ఎన్నో మార్గాలు!

ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండా పన్ను చెల్లింపు ప్రక్రియను అధికారులు మరింత సులభతరం చేశారు.
- నగర పౌర సేవా కేంద్రాలు, ప్రభుత్వ డిజిటల్ సేవా కేంద్రాలు (మీ-సేవా).
- మున్సిపల్ కార్పొరేషన్ ద్వారా గుర్తింపు పొందిన బిల్లు వసూలుదారులు.
-డెబిట్ కార్డు లేదా క్రెడిట్ కార్డు ద్వారా ఆన్‌లైన్ చెల్లింపులు.
- మొబైల్ చెల్లింపు యాప్‌లు (గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం వంటివి).
-క్యూర్ (జఖ=జు) ప్రత్యేక మొబైల్ యాప్ (ఆండ్రాయిడ్ మరియు ఐఓఎస్ వెర్షన్లలో అందుబాటులో ఉంది).

### పన్ను సేవలతో పాటు ఇతర సేవలు కూడా..

డిజిటల్ సేవా కేంద్రాలు మరియు ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ఆస్తి పన్నుతో పాటు క్రింది సేవలను కూడా ప్రజలు పొందవచ్చు:
- ఆస్తి హక్కుల బదిలీ (మ్యుటేషన్), యజమాని పేరు సవరణ, తలుపు సంఖ్య (డోర్ నంబర్) సవరణ.
- కొత్త ఆస్తులకు యజమానుల స్వీయ పన్ను అంచనా మరియు అంచనా నమోదు ప్రక్రియ.
- ఖాళీగా ఉన్న ఆస్తులకు పన్ను మినహాయింపు మరియు ఆస్తి పన్ను సవరణ సేవలు.

### నగరాభివృద్ధికి సహకరించండి:

ప్రజలు సకాలంలో ఆస్తి పన్నులు చెల్లించి, నగరంలో రోడ్లు, పారిశుధ్యం, పార్కులు వంటి మౌలిక వసతుల కల్పనకు మరియు సర్వాంగీణ అభివృద్ధికి తోడ్పడాలని జోనల్ కమిషనర్ పిలుపునిచ్చారు.

# తాండూరులో ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల దోపిడీపై బిఆర్ఎస్‌ఎస్వి ఆగ్రహం

**తాండూరు జూన్ 20 భారత శక్తి** తాండూరు లోని ప్రైవేట్ పాఠశాలలు అధిక ఫీజులు వసూలు చేస్తూ పేద, మధ్యతరగతి కుటుంబాలపై ఆర్థిక భారం మోపుతున్నాయని భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం బీఆర్ఎస్వీ కమిటీ సభ్యులు ఆరోపించారు.ఈ నేపథ్యంలో శనివారం తాండూరు మండల విద్యాధికారి కార్యాలయంలో బీఆర్ఎస్వీ నాయకులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థి నాయకులు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా డొనేషన్లు, ఇతర పేర్లతో అదనపు ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో తరగతి గదులు, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, బెంచీలు, ప్రయోగశాలలు వంటి మౌలిక వసతులు సరిగా లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.ప్రైవేట్ స్కూళ్ల ఫీజులపై తక్షణ తనిఖీలు నిర్వహించి అధిక ఫీజులను నియంత్రించాలని, అదనంగా వసూలు చేసిన మొత్తాన్ని తల్లిదండ్రులకు తిరిగి ఇప్పించాలని డిమాండ్ చేశారు. అలగే ప్రభుత్వ పాఠశాలల్లో వెంటనే మౌలిక వసతులు కల్పించాలని బీఆర్ఎస్వీ నాయకులు డిమాండ్ చేశారు.అధికారులు తక్షణ చర్యలు తీసుకోకపోతే మండల వ్యాప్తంగా ఆందోళనలు, ధర్నాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ జిల్లా అధికార ప్రతినిధి దత్తాత్రేయ రావు, వినోద్ కుమార్, కొర్ర సందీప్ నాయక్, షోహెబ్, భాను, మజార్, తోఫిక్ తదితరులు పాల్గొన్నారు.



# స్వామి వారిని దర్శించుకున్న మంత్రి సీతక్క



**భారత శక్తి, జూన్ 20 (యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి):** తెలంగాణ రాష్ట్ర పంచాయతి రాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) శనివారం ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యతో కలిసి యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకులు వారికి పూర్ణకుంభ స్వాగతం పలకగా ప్రత్యేక పూజల అనంతరం పండితులు వేదాశీర్వచనం చేశారు. అనంతరం ఆలయ చైర్మన్ నరసింహమూర్తి మంత్రి సీతక్కకు స్వామి వారి లడ్డూ ప్రసాదం మరియు చిత్రపటాన్ని అందజేశారు. తర్వాత మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నానని, అదే విధంగా శుక్రవారం మా నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన సందర్భంగా వారు ఆయురారోగ్యాలతో ఉండాలని రాబోయే రోజుల్లో దేశానికి ప్రధానిగా ప్రజలకు మరెంతో సేవ చేయాలని కోరుకోవడం జరిగిందని తెలిపారు. ఆమె వెంట రాష్ట్ర మహిళా సంక్షేమ శాఖ చైర్మన్ బండ్రు శోభారాణి, ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ ఎరుకల చైతన్య మహేందర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్, వైస్ చైర్మన్ బరిగె రమ్య రాంచందర్, కౌన్సిలర్లు ముక్కర్ల మల్లేష్ యాదవ్, బూడిద మధు, బిట్టు సరోజ హరీష్, నాయకులు కానుగు బాలరాజు గౌడ్, గౌలికార్ రాజేష్, బందారపు బిక్షపతి, ఇంజ నరేష్, గుడ్ల నరేష్, ఎనగండ్ల సుధాకర్, నీల సునీల్, బింగి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ స్కూళ్లల్లో ఫీజులను నియంత్రించాలి



**ఆలమూరు, భారత శక్తి ప్రతినిధి, జూన్ 20:** ప్రైవేట్ స్కూళ్లల్లో ఫీజులను నియంత్రించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఆలమూరు మండల కేంద్రంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రొద్దోకు అజయ్ ఎంఈఓ-2 రాజుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అజయ్ మాట్లాడుతూ మధ్యతరగతి, పేద విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థిక ఉపశమనం కలిగించడమే లక్ష్యంగా ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణకు తమిళనాడు తరహాలో రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. కార్పొరేట్ పాఠశాలలలో అధిక ఫీజులతో పాటుగా బుక్స్, యూనిఫామ్ పేరుతో అధిక వసూలు చేస్తున్నారని, విద్యతో వ్యాపారాలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# ధర్మపురి నియోజకవర్గానికి రూ.13.25 కోట్ల అభివృద్ధి పనులు

**జగిత్యాల, జూన్ 20 (భారత శక్తి ప్రతినిధి):** ధర్మపురి నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంఎన్ఆర్ఈజీఎస్) 2026-27 కింద రూ.13.25 కోట్ల వ్యయంతో 245 సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు పరిపాలన అనుమతులు మంజూరు చేయడంపై ధర్మపురి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిలుముల లక్ష్మణ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఈ నిధులు ఉపయోగపడతాయని తెలిపారు. ధర్మపురి మండలానికి 40 పనులకు గాను రూ.273.80 లక్షలు, నియోజకవర్గ వ్యాప్తంగా 245 పనులకు గాను రూ.1325.80 లక్షలు మంజూరయ్యాయని పేర్కొన్నారు. గ్రామాల్లో మెరుగైన రహదారి సౌకర్యాలు, మురుగు నీటి పారుదల వ్యవస్థ, పరిశుభ్రత, ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు ఈ పనులు దోహదపడతాయని అన్నారు. ధర్మపురి నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తున్న రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు ఈ సందర్భంగా చిలుముల లక్ష్మణ్ కృతజ్ఞతలు తెలిపారు.

# రైతు సమస్యలు వెంటనే పరిష్కరించాలి
## బీఆర్ఎస్ నాయకుల డిమాండ్



**జగిత్యాల, జూన్ 20 (భారత శక్తి ప్రతినిధి):** రాష్ట్ర ప్రభుత్వం రైతుల పట్ల అవలంబిస్తున్న వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ధర్మపురి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌హెచ్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో శనివారం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అయ్యోరి రాజేష్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. 33 రకాల పంటలకు బోనస్ ఇస్తామని ప్రకటించి ప్రస్తుతం కేవలం 7 రకాల పంటలకు మాత్రమే పరిమితం చేయడం అన్యాయమన్నారు. యూరియా సరఫరాలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రైతు సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తెమ్మ, పట్టణ కన్వీనర్ బండారి రంజిత్, మాజీ మండల అధ్యక్షులు రాంచందర్ గౌడ్, మహేష్, సింహాచలం జగన్, రాచూరి శ్రీధర్, గొస్కుల జలంధర్, మాజీ జడ్పీటీసీలు, ఎంపీపీలు, వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేడు వీరశైవ సమాజం 2026-28 నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం

**సమాజ అభివృద్ధి, సేవా కార్యక్రమాలకు కొత్త దిశగా అడుగులు**

**వీరశైవ బంధువులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలి.**

**నూతన అధ్యక్షుడు తంబాకు చంద్రశేఖర్ పిలుపు**

తాండూరు జూన్ 20 భారత శక్తి తాండూర్ లోని అతి పెద్ద సమాజం అయిన వీరశైవ సమాజం 2026-28 నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని ఆదివారం ఘనంగానిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో శనివారం వీర శైవ కళ్యాణ మండపంలో ఏర్పాట్ల పై సమాజ ప్రతినిధులు సమావేశమై కార్యక్రమ విజయవంతానికి అవసరమైన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు తంబాకు చంద్రశేఖర్, కార్యదర్శి వాలి శ్రవణ్ కుమార్ , సహాయ కార్యదర్శి శశాంక్, ఉపాధ్యక్షులు శెట్టి భాస్కర్, గౌరవ అధ్యక్షులు గులి పరమేశ్వర్ మాట్లాడుతూ,.. పట్టణ సమీపంలోని వీరశైవ సమాజం కళ్యాణ మండపంలో ఆదివారం ప్రమాణ స్వీకారోత్సవానికి వీరశైవ బంధువులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు ఈ సందర్భంగా అధికారికంగా ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు తెలిపారు. సమాజ అభివృద్ధి, సంక్షేమం, సేవా



కార్యక్రమాల విస్తరణకు నూతన కార్యవర్గం ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమ ఏర్పాట్లను సమాజ ప్రతినిధులు పర్యవేక్షిస్తూ అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు




వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు గూళి పరమేశ్వర్‌స్వామి, అధ్యక్షుడు తంబాకు చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు శెట్టి భాస్కర్, కార్యదర్శి వాలి శ్రవణ్‌కుమార్, సహాయ కార్యదర్శి ఆడ్కి శశాంక్, కోశాధికారి కందనెల్లి ప్రకాశంతో పాటు కార్యవర్గ సభ్యులు గణాపూర్ శంకర్, వాలి శాంత్‌కుమార్, లింగదల్లి రవికుమార్, మద్రిక చంద్రకాంత్, ఆబుళం సంపత్‌కుమార్, గద్ది కిరణ్‌కుమార్, సద్గీ భద్రప్ప, ఆర్. బసవరాజ్, బిబ్బిళ్లి గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఆత్మబంధువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి..

**పటాన్‌చెరు నియోజకవర్గ చరిత్రలోనే మొట్టమొదటిసారి..**

**438 మంది 10వ తరగతి ప్రతిభావంతులకు సైకిళ్ల పంపిణీ.**

**35 లక్షల రూపాయల సొంత నిధులతో సైకిళ్ల కొనుగోలు..**





పటాన్‌చెరు జూన్ 20 భారత శక్తి పటాన్‌చెరు శాసనసభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి విద్యార్థుల కోసం మరో వినూత్న కార్యక్రమాన్ని ఆరంభించారు. పటాన్‌చెరు నియోజకవర్గ చరిత్రలోనే మొట్టమొదటిసారి 2025 - 2026 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ ఫలితాలు సాధించిన 438 విద్యార్థులకు 35 లక్షల రూపాయల సొంత నిధులతో సైకిళ్ల పంపిణీ చేపట్టారు. శనివారం ఉదయం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని మైత్రి మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని 48 ప్రభుత్వ పాఠశాలలు, 89 ప్రైవేటు పాఠశాలలో ఇటీవల జరిగిన పదో తరగతి పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన 438 మంది విద్యార్థులకు 35 లక్షల రూపాయల సొంత నిధులతో కొనుగోలు చేసిన సైకిళ్లను ఎమ్మెల్యే జీఎంఆర్ చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ.. విద్యార్థులను ప్రోత్సహించడం ద్వారా ఉన్నత లక్ష్యాల సాధనకు మరింత ఉత్సాహం కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం పదవ తరగతి విద్యార్థులకు మానసిక వికాస శిక్షణా తరగతులతో పాటు పరీక్షా సామాగ్రి పంపిణీ చేస్తూ వారికి అండగా నిలుస్తున్నామని తెలిపారు. అనంతరం ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు నగదు బహుమతులు సైతం పంపిణీ చేసినట్టు గుర్తు చేశారు.
ఈ విద్యా సంవత్సరం నుండి వినూత్నంగా సైకిల్లు పంపిణీ చేయాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఇందుకు అనుగుణంగా పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ ప్రైవేటు ఉన్నత పాఠశాలలో 10వ తరగతి ఫలితాల్లో ప్రథమ ద్వితీయ తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు సైకిళ్ళు కొనుగోలు చేసి అందించడం జరిగిందని తెలిపారు. విద్యార్థినీ, విద్యార్థులకు పదో తరగతి జీవితం మలుపు తిప్పే కీలక దశ అని శ్రీ శ్రీ పేర్కొన్నారు. పదో తరగతిలో సాధించే ఫలితాలే భవిష్యత్ విద్యాభ్యాసానికి బలమైన పునాది అవుతాయని, లక్ష్యాలను నిర్దేశించుకొని కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని సూచించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ప్రోత్సహించడం సమాజ బాధ్యత అని పేర్కొంటూ, విద్యార్థినీ, విద్యార్థుల భవిష్యత్ కోసం తమవంతు సహకారం అందిస్తూనే ఉంటామని తెలిపారు. విద్యారంగ అభివృద్ధికి ఎల్లప్పుడూ అండగా నిలుస్తూ, విద్యార్థులకు ఆత్మబంధువుగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సేవలు అందిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, ఆయా మండలాల విద్యాశాఖల అధికారులు, ప్రైవేటు పాఠశాలల ప్రిన్సిపాళ్లు, కరస్పాండెంట్లు సీనియర్ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# 12వ పిఆర్సీని తక్షణం అమలు చేయాలి

**- యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్.ప్రసాద్ డిమాండ్..**



**బద్వేలు(భారత శక్తి)** ఉద్యోగ, ఉపాధ్యాయులకు 12 వ పిఆర్సీని తక్షణమే అమలు చేయాలని, పెండింగ్ బకాయిలను, డిఏలను వెంటనే చెల్లించాలని యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్.ప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం ఉదయం ఆయన కడపకు విచ్చేసిన సందర్భంగా కడపలోని ఓంశాంతి నగర్ నందు గల హోం స్టే నందు ఆ సంఘ ముఖ్య కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా కె.ఎస్.ఎస్. ప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులు కూటమి ప్రభుత్వంపై అనేక ఆశలు పెట్టుకున్నారని, అయితే ప్రభుత్వం ఉద్యోగుల పట్ల వ్యవహరిస్తున్న తీరుతో ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్ర నిరుత్సాహంతో ఉన్నారన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను అమలు చేసి, సమస్యలను పరిష్కరించడాన్ని విస్మరిస్తున్నారన్నారు. 12వ పిఆర్సీ గడువు ముగిసి మూడేళ్లు అవుతున్నా పిఆర్సీని అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదన్నారు. 11వ పిఆర్సీని సైతం అప్పటి వైసిపి ప్రభుత్వం మూడున్నర ఏళ్లు ఆలస్యంగా అమలు చేయడంతో ఉద్యోగులు తీవ్రంగా నష్టపోయారన్నారు. పదవీ విరమణ పొందుతున్న ఉపాధ్యాయులు అలాగే సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులు ఉద్యోగులకు జరుగుతున్న నష్టాన్ని దృష్టిలో ఉంచుకొని కూటమి ప్రభుత్వం తక్షణం 12వ పిఆర్సీని ఏర్పాటు చేసి, పిఆర్సీ అమలయ్యే వరకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా 29 శాతం మధ్యంతర భృతిని చెల్లించాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలను కూటమి ప్రభుత్వం కొంతమేరకు చెల్లించినప్పటికీ, ఇంకా 25 వేల కోట్ల రూపాయల పైబడి బకాయిలు పేరుకపోయాయన్నారు. వీటి చెల్లింపులలో నిర్దిష్టమైన కాల వ్యవధి లేకపోవడం వల్ల పూర్తిస్థాయిలో బకాయిల చెల్లింపులు జరగడం లేదన్నారు. నాలుగు డిఏలు పెండింగ్ ఉన్నా పాలకులు కనీసం స్పందించడం లేదని విమర్శించారు. మూడు సంవత్సరాలుగా సరెండర్ లీవ్ చెల్లింపులు లేవని ఆయన పేర్కొన్నారు. ఉద్యోగులకు జీవన్మరణ సమస్యగా ఉన్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం రద్దు, పాత పెన్షన్ అమలు లాంటి విధానాలు అమలుకు నోచుకోవడం లేదన్నారు. 2004 కు ముందు నియామక ప్రక్రియ పూర్తయిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం వర్తింపచేయాలనే కేంద్ర ప్రభుత్వ మెమో 57 సైతం అమలుకు నోచుకోలేదన్నారు. ముఖ్యమంత్రి ఆమోదం పొందినప్పటికీ కాలయాపనలో ఆంతర్యం ఏమిటన్నారు. ఉద్యోగులకు ఇచ్చిన హెల్త్ కార్డులపై ఉద్యోగులకు వైద్యం అందడం లేదన్నారు. నగదు చెల్లించి వైద్యం పొందిన మెడికల్ బిల్లులు ఎన్టీఆర్ ట్రస్ట్ ఆమోదం పొందినప్పటికీ వాటి చెల్లింపుల్లో తీవ్ర జాప్యం జరుగుతున్నదని విమర్శించారు. దీనిపై కమిటీ నియమించినా ఎలాంటి పురోగతి లేదని పేర్కొన్నారు. కారుణ్య నియామకాలు చేపట్టడంలో ప్రభుత్వ అలసత్వం సరికాదన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలను కారణంగా చూపి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష నిర్వహించాలని కోవడం తగదన్నారు. విద్యా శాఖ మంత్రి కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి విద్యాహక చట్టం 23(1) సవరణకు కృషి చేయాలని కోరారు. చట్ట సవరణ జరిగే వరకూ ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు స్పెషల్ టెట్ పరీక్షను, ఆఫ్ లైన్ విధానంలో నిర్వహించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధి చెప్పకపోతే పోరాటానికి సన్నద్ధమవుతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మిరాజా, జిల్లా అధ్యక్షులు మాదన విజయకుమార్, సహాధ్యక్షులు వై.రవికుమార్, డి.సుజాత రాణి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డి.క్రిష్ణారెడ్డి, ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎం.ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

**ఆళ్లగడ్డ(భారత శక్తి)** పట్టణంలోని మార్కెట్ యార్డ్‌లో నిర్వహించిన అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పాల్గొన్నారు. రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై రైతులకు అవగాహన కల్పిస్తూ ఎమ్మెల్యే ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతే దేశానికి వెన్నెముక అని, రైతుల అభ్యున్నతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. రైతుల సంక్షేమం కోసం ఎన్డీఏ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, రైతులకు పెట్టుబడి సాయం, సాగునీరు, మద్దతు ధరలు, వ్యవసాయానికి అవసరమైన సౌకర్యాల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ గారు తెలిపారు. రైతుల కష్టాలను అర్థం చేసుకుని వారి ఆదాయాన్ని పెంచే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని, వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు అన్ని విధాలా సహకారం అందిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆకాంక్షించారు.



### నేడు నీట్ పరీక్ష అభ్యర్థులకు

# టీఎస్ఆర్టీసీ గుడ్ న్యూస్

**– డిపో మేనేజర్ జి. హరి ప్రసాద్.**




నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 20 (భారత శక్తి )భైంసా, జాతీయ అర్హత మరియు ప్రవేశ పరీక్ష (నీట్ ) రాయనున్న విద్యార్థులకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ శుభవార్త తెలిపింది. ఆదివారం, జూన్ 21, 2026న నిర్వహించనున్న నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టింది.పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు తమ హాల్ టికెట్ చూపించినట్లయితే, రాష్ట్రవ్యాప్తంగా నడిచే నాన్-ఏసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు టీఎస్ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఈ సౌకర్యం సూపర్ లగ్జరీ, డీలక్స్, ఎక్స్‌ప్రెస్ మరియు పల్లెవెలుగు బస్సులకు వర్తించనుంది.పరీక్షా కేంద్రాలకు సమయానికి చేరుకునేందుకు విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అధికారులు సూచించారు. అలాగే పరీక్ష ముగిసిన అనంతరం కూడా హాల్ టికెట్ ఆధారంగా తిరుగు ప్రయాణానికి ఈ సౌకర్యాన్ని ఉపయోగించుకోవచ్చని తెలిపారు.విద్యార్థులు ప్రయాణ సమయంలో తమ హాల్ టికెట్‌ను తప్పనిసరిగా వెంట తీసుకెళ్లాలని, బస్సు సిబ్బందికి చూపించి ఉచిత ప్రయాణాన్ని పొందవచ్చని పేర్కొన్నారు.నీట్ పరీక్ష రాసే విద్యార్థులకు టీఎస్ఆర్టీసీ అందిస్తున్న ఈ ఉచిత ప్రయాణ సౌకర్యం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### త్వరలోనే వేములవాడ బైపాస్ రోడ్డుకు

# సరికొత్త వెలుగులు.

- -ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చొరవతో వేములవాడ అభివృద్ధి
- - పనుల పురోగతిని కమీషనర్ లోకేష్ తో పరిశీలించిన చైర్మన్ పుల్కం రాజు
- - ప్రమాదాల నివారణకే బైపాస్ రోడ్డులో విద్యుత్ దీపాలు
- - పట్టణాభివృద్ధే లక్ష్యంగా మౌలిక వసతుల కల్పన..
- - నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్న మున్సిపల్ చైర్మన్



భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల, జూన్ 20: వేములవాడ పట్టణాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ఇందులో భాగంగానే రహదారుల ఆధునీకరణ, ప్రజలకు అవసరమైన సౌకర్యాల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు అన్నారు. ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవ, కృషితో పట్టణ బైపాస్ రోడ్డులో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సెంటర్ లైటింగ్ ఏర్పాటు పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ పనుల పురోగతిని మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, మున్సిపల్ కమిషనర్ లోకేష్‌తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బైపాస్ రోడ్డు పొడవునా జరుగుతున్న విద్యుత్ స్తంభాల ఏర్పాటు, వైరింగ్ పనులను వారు దగ్గరుండి వీక్షించారు. ఈ సందర్భంగా పనుల నాణ్యత, ఇప్పటివరకు పూర్తయిన పనుల వివరాలను అక్కడ ఉన్న ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. రాత్రి వేళల్లో ప్రయాణించే వాహనదారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాజెక్టును అత్యంత ప్రాధాన్యతతో పూర్తి చేయాలని మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఎక్కడా నాణ్యతా ప్రమాణాల్లో రాజీ పడకుండా, అత్యాధునిక సాంకేతికతతో, నిర్ణీత గడువులోగా పనులన్నీ ముగించి వెలుతురును అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. బైపాస్ రోడ్డులో సెంటర్ లైటింగ్ అందుబాటులోకి వస్తే చీకటి కారణంగా జరిగే రహదారి ప్రమాదాలు పూర్తిగా తగ్గుముఖం పడతాయని, వాహనదారులకు మెరుగైన వెలుతురు లభించి ప్రయాణం ఎంతో సురక్షితంగా మారుతుందని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు. పట్టణ ప్రజలతో పాటు వేములవాడ రాజన్న దర్శనానికి వచ్చే భక్తులకు సైతం ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ ప్రధాన ధ్యేయమని, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సహకారంతో త్వరలోనే ఈ పనులన్నింటినీ పూర్తి చేసి ప్రజలకు అంకితం చేస్తామని మున్సిపల్ చైర్మన్ వివరించారు.

# పోలీస్ బాస్ పెద్ద మనసు.

**వృద్ధాశ్రమానికి నిత్యావసరాలు పంపిణీ చేసిన ఎస్పీ మహేష్ బి.గితే.**





భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల, జూన్ 20: మానవతా సేవలో రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీసు శాఖ మరోసారి తన ప్రత్యేకతను చాటుకుంది. గంభీరావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని మా అభాగ్యుల వృద్ధాశ్రమాన్ని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే సందర్శించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో ఆశ్రయం పొందుతున్న వృద్ధులతో ఆయన ఆప్యాయంగా ముచ్చటించారు. వారి యోగక్షేమాలను, ఆరోగ్య పరిస్థితులను, ఆశ్రమంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వృద్ధులకు పండ్లు, బియ్యం, కిరాణా సరుకులతో పాటు పలు రకాల నిత్యావసర వస్తువులను జిల్లా ఎస్పీ స్వహస్తాలతో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సమాజంలో వృద్ధులు, నిరాశ్రయులు, అనాథల సంక్షేమం పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. వృద్ధులకు సేవ చేయడం అత్యున్నత మానవతా ధర్మమని, వారికి అండగా నిలవడం సమాజంలోని ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని స్పష్టం చేశారు. ఆపదలో ఉండి, అవసరమైన వారికి సేవలు అందించడంలో రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీసు శాఖ ఎల్లప్పుడూ అగ్రభాగాన ఉంటుందని ఈ సందర్భంగా ఆయన పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ వెంట డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ వెంకటేష్, ఎస్ఐ శ్రీకాంత్ మరియు వృద్ధాశ్రమ నిర్వాహకులు, సభ్యులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్య, వైద్య రంగాలను బలోపేతం చేయాలి.

**-ప్రైవేటు విద్యా, వైద్య సంస్థల ఫీజులను నియంత్రించాలి.**
**-రైతాంగాన్ని ఆదుకునేందుకు తక్షణ-చర్యలుచేపట్టాలి.**
**-సీపీఎం జనగామ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పోరు యాత్ర**
**సిపిఎం జనగామ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి**



జనగామ(భారత శక్తి )జూన్ 20: ప్రజల జీవితాలకు సంబంధించిన ప్రధాన సమస్యల పరిష్కారం కోసం సీపీఎం జనగామ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పోరుయాత్ర నిర్వహించనున్నట్లు సీపీఎం మోకు కనకా రెడ్డి తెలిపారు. శనివారం ఐదో వార్డులో జనగామ పట్టణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సిపిఎం జనగామ పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ అధ్యక్షత వహించగా మోకు కనకా రెడ్డి పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ విద్య, వైద్య రంగాలను పరిరక్షించడం, ప్రైవేటు విద్యా మరియు వైద్య సంస్థల ఫీజులను నియంత్రించడం, రైతాంగాన్ని ఆదుకోవడం వంటి డిమాండ్లతో ఈ పోరుయాత్ర చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, వైద్యం రాజ్యాంగబద్ధమైన హక్కులని, కానీ నేడు అవి వ్యాపార వస్తువులుగా మారిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేస్తూ ప్రైవేటు విద్యాసంస్థలకు ప్రోత్సాహం ఇవ్వడం వల్ల సాధారణ, మధ్యతరగతి కుటుంబాలపై తీవ్రమైన ఆర్థిక భారం పడుతోందన్నారు. ప్రతి సంవత్సరం ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచుతూ తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నాయని విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని, ప్రభుత్వ విద్యను బలోపేతం చేసి పేద మరియు మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్య అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు విద్యాసంస్థల ఫీజుల నియంత్రణకు ప్రత్యేక నియంత్రణ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా ప్రభుత్వ దవాఖానాల్లో వైద్యులు, నర్సులు, సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని, మందులు, పరీక్షా పరికరాలు లేక ప్రజలు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రైవేటు ఆసుపత్రులు లక్షల రూపాయల బిల్లులు వేస్తూ ప్రజల ప్రాణాలతో వ్యాపారం చేస్తున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ దవాఖానాలను ఆధునికీకరించి అన్ని రకాల వైద్య సేవలను ఉచితంగా అందించాలని, ప్రైవేటు ఆసుపత్రుల వైద్య ఫీజులపై నియంత్రణ విధించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రైతాంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని జోగు ప్రకాష్ తెలిపారు. వ్యవసాయ పెట్టుబడులు పెరుగుతుండగా పంటలకు గిట్టుబాటు ధరలు లభించడం లేదన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, అకాల వర్షాలు, మార్కెట్‌లో ధరల పతనం కారణంగా రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారని పేర్కొన్నారు. రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, పంట నష్టాలకు తగిన పరిహారం చెల్లించాలని, వ్యవసాయ రుణాలను మాఫీ చేయాలని, ఎరువులు, విత్తనాలను సబ్సిడీపై అందించాలని డిమాండ్ చేశారు. ఈ ప్రజా సమస్యలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడం, ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచడం కోసం సీపీఎం జనగామ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పోరుయాత్ర నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు, యువత, రైతులు, కార్మికులు, మహిళలు, మేధావులు అందరూ పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారమే సీపీఎం లక్ష్యం అని, ప్రజల హక్కుల కోసం పోరాటాలు మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు బూడిది గోపి, ఎండి అజారుద్దీన్, పట్టణ కమిటీ సభ్యులు బాల్నే వెంకట మల్లయ్య, బొట్ల శ్రావణ్, మంగ బీరయ్య, బూడిద ప్రశాంత్, పల్లెర్ల లలిత, పగిడిపాటి బాలమణి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ అనుమతి లేకుండా నడుపుతున్న విజేత మ్యాన్ పవర్ కన్సల్టెన్సీ నిర్వాహకుడు గంగాధర్ పై కేసు నమోదు



భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల, జూన్ 20:ఎల్లారెడ్డిపేటలో గంగాధర్ అను అతను ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా విజేత మ్యాన్ పవర్ కన్సల్టెన్సీ ని నడుపుతూ అమాయక ప్రజలను గల్ఫ్ పంపిస్తానని మోసం చేస్తున్నాడనిసమాచారం అందింది. ఇట్టి సమాచారంపై వెళ్లి తనిఖీ చేయగా కన్సల్టెన్సీ విస్టింగ్ కార్డ్స్, పాస్పోర్ట్ జిరాక్స్ కాపీలు, మరియు 02 నోట్ బుక్ లను స్వాధీనం చేసుకునట్లు పోలీసులు తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎల్లారెడ్డిపేట ఎస్సై కే. రాహుల్ రెడ్డి తెలిపినారు.

# పానీ పూరి విక్రయ దుకాణాల్లో తనిఖీలు

**సిరిసిల్ల, వేములవాడలో నిర్వాహకులకు అవగాహన**



భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల, జూన్ 20: ప్రభుత్వ ఆదేశాల మేరకు, సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, వైద్య శాఖ అధికారులు, ఆహార భద్రతా అధికారి సంయుక్తంగా పానీపూరి విక్రయ దుకాణాల్లో తనిఖీలు చేశారు. ఈ తనిఖీల సమయంలో, అపరిశుభ్రమైన పరిస్థితుల్లో తయారు చేసిన పూరీలు, పప్పు, నీరు అధికారులు గుర్తించారు. అపరిశుభ్రంగా ఉన్న వాటిని వెంటనే సిబ్బందితో తొలగింపజేశారు. ఆహార పదార్థాల తయారీ లో పాటించాల్సిన జాగ్రత్తలు, నియమాలను నియమాలపై అవగాహన కల్పించారు. పని సమయంలో తప్పనిసరిగా ఆప్రాన్లు, హెయిర్ క్యాప్స్ ధరించాలని వారికి ఆదేశాలు జారీ చేశారు. అలాగే, పానీ నమూనాలను కూడా సేకరించారు. తనిఖీలో వేములవాడ ఆర్డీఓ కే ఎస్ బీ కుమారి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నిఖితారెడ్డి, మున్సిపల్ కమిషనర్లు ఖాదర్ పాషా, లోకేష్, డిప్యూటీ డీ ఎంహెచ్ఓ ఏంజెలా ఆల్ఫ్రెడ్, ఫుడ్ ఇన్స్పెక్టర్ అనూష తదితరులు ఉన్నారు.?

### నర్సాపూర్ మండల్ లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో

# నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్

**రాజీయే రాజమార్గం... లోక్ అదాలత్ తీర్పు అంతిమ తీర్పు.**
**ఎం.హేమలత...జూనియర్ సివిల్ జడ్జ్ కం చైర్మన్, మండల్ లీగల్ సర్వీస్ కమిటీ, నర్సాపూర్**




మెదక్, భారత శక్తి న్యూస్, జూన్ 20:మెదక్ జిల్లా నర్సాపూర్ మండల్ లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో, జాతీయ, రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థల ఆదేశాల మేరకు, జాతీయ లోక్ అదాలత్ శనివారం జూనియర్ సివిల్ జడ్జ్ కోర్ట్ ఆవరణలో కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది,ఈ కార్యక్రమంలో న్యాయమూర్తి జూనియర్ సివిల్ జడ్జ్ కం చైర్మన్ మండల్ లీగల్ సర్వీస్ కమిటీ నర్సాపూర్ ఎం.హేమలత మాట్లాడుతూ, రాజీయే రాజమార్గమని, లోక్ అదాలత్ తీర్పు అంతిమ తీర్పుని, అన్నారు, అదేవిధంగా రాజీ చేయదగిన కేసుల్లో ఇరువర్గాలు పరస్పర సహకారంతో సమస్యలను పరిష్కరించుకొని స్నేహ పూరిత భావంతో కలిసిమెలిసి ఉండాలని ఆమె సూచించారు. లోక్ అదాలత్ ద్వారా వెలువడే తీర్పు అంతిమ తీర్పుగా పరిగణించబడుతుందని తెలియచేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో సెకండ్ క్లాస్ మ్యాజిస్ట్రేట్ పి.బాల్ రెడ్డి, నర్సాపూర్ కోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆర్.రాఘవేందర్, లోక్ అదాలత్ బెంచ్ మెంబర్ శాస్త్రుల,మధుశ్రీశర్మ, లీగల్ సర్వీస్ న్యాయవాది కాట్రోత్.రాజు నాయక్, సీనియర్ న్యాయవాది పి.సుధాకర్, సి.హెచ్.స్వరూప రాణి, న్యాయవాదులు కే.నాగరాజు, జాట్రోత్ రవినాయక్, ఏ.సాయిరాం, ఆజం అలీ బేగ్, కోర్టు సూపర్డెంట్ ఎం.ఎల్. సూర్య ప్రకాష్, లీగల్ సర్వీస్ టైపిస్ట్ కం అసిస్టెంట్ తలారి ఆంజనేయులు, కోర్టు సిబ్బంది, లీగల్ సర్వీస్ కోర్టుసిబ్బంది, కోర్టు పోలీస్ కానిస్టేబుల్స్, కక్షిదారులు పాల్గొనడం జరిగింది.

### మద్యం సేవించి వాహనం నడిపితే

# జైలు శిక్ష, జరిమానా తప్పదు.

**మద్యం సేవించి పట్టుబడిన 143 మంది**
**మందు బాబులకు జరిమానాలు.**
**వేములవాడ పట్టణ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్.**



భారత శక్తి న్యూస్,రాజన్న సిరిసిల్ల, జూన్ 20: వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే గారి ఆదేశాల మేరకే నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలలో పట్టుబడ్డ 143 మంది బాబులను ఈరోజు లోక్ అదాలత్ లో భాగంగా వేములవాడ కోర్టులో హాజరుపరచగా మేజిస్ట్రేట్ మేఘన జరిమానాలు విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు పట్టణ ఇన్స్పెక్టర్ తెలిపారు.

**విధించిన జరిమానాల వివరాలు.**

1.22 మందికి ఒక్కొక్కరికి రూ.4000,రూపాయల జరిమాన.
2.ఒక్కరికి రూ.5000 రూ. జరిమానా
3.53 మందికి ఒక్కొక్కరికి రూ.3000 జరిమానా.
4. 59 మందికి ఒక్కొక్కరికి 2,000/- రూపాయల జరిమాన.
5.05 గురికి ఒక్కొక్కరికి 2500-/ రూపాయల జరిమాన.
6.03 రికి ఒక్కొక్కరికి 3500/- రూపాయల జరిమాన.

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా నిర్వహిస్తున్న Arrive Alive కార్యక్రమంలో భాగంగా మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కలిగే ప్రమాదాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు గురై కుటుంబాలను రోడ్డున పడేయొద్దని, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం వల్ల తమతో పాటు ఎదురుగా వచ్చే వారి కుటుంబాల్లో కూడా విషాదం నింపవద్దని హెచ్చరించారు. మద్యం సేవించి కేసుల పలు అయితే భవిష్యత్తులో ఉద్యోగ మరియు ఉపాధి అవకాశాలపై ప్రభావం పడే అవకాశం ఉందని, పోలీస్ వెరిఫికేషన్ సమయంలో ఇబ్బందులు తలెత్తవచ్చని హెచ్చరించారు.అలాగే ట్రాఫిక్ మరియు రోడ్ భద్రత నియమ నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు,వాహన తనిఖీలు నిర్వహించాడం జరిగుతుందని, మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

# టిటిడి తెలంగాణ భవన నిర్మాణ చైర్మన్ గా ఎన్నికైన దోసపాట

**-ఘనంగా సన్మానించిన ఆర్యవైశ్య సంఘం**



మణుగూరు, జూన్ 20 (భారతశక్తి): తిరుమల తిరుమతి దేవస్థానం వెంకటేశ్వర స్వామి సన్నిధిలో నిర్మించనున్న తెలంగాణ భవన నిర్మాణ కమిటీ చైర్మన్ గా ఎన్నికైన సందర్భంగా ఎస్ కే టి గ్రూప్ చైర్మన్ దోసపాటి వెంకటేశ్వరరావును ఆర్యవైశ్య సంఘం, వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. శనివారం గుట్టమల్లారంలోని శ్రీ వెంకటేశ్వర ఆలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ మణుగూరులో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ గా ఎన్నో సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ ఉచితంగా అంతిమ రథయాత్ర, పుర ప్రజలకు సౌకర్యంగా ఉండేందుకు బల్లలు ఏర్పాటుతో పాటు మండలంలోని ప్రముఖ ఆలయాలకు ప్రధాన దాతగా ఉన్న దోసపాటి వెంకటేశ్వరరావుకు అవకాశం రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు వేద మంత్రోచ్ఛరణతో ఆశీర్వచనాలు అందించగా, పుర ప్రముఖులు, ఆర్యవైశ్య సంఘం మండల, పట్టణ నాయకులు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కడవెండి విశ్వనాథగుప్తా, దుగ్గి సతీష్, దోసపాటి నాగేశ్వరరావు, చిత్తలూరి రమేష్ బాబు, కత్తి రాము, బండారు నర్సింహారావు, చిట్టూరి శేషుకుమార్, బొగ్గవరపు మురహరి, మురళి, సంకా రాధాశ్యాం గుప్తా, సంకా శ్రీనివాసరావు, కందుకూరి సుబ్బారావు, బొడ్డు పుల్లారావు, వడియాల ప్రభాకరరావు, దింటకుర్తి బ్రహ్మయ్య, సుగ్గల భాను సంతోష్, సుగ్గల సూర్యం, కోటగిరి సందీప్, బచ్చు స్వరాజ్యరావు, వాసు, నరేందర్. కంకణాల వెంకటేశ్వరరావు, వాసవీ క్లబ్ ప్రెసిడెంట్ మిట్టపల్లి శ్యామ్, కొల్లూరి గౌరీ శంకర్, శ్రీరామ్ రాము, డాక్టర్ సమ్మయ్య, వెంకన్న తదితరులు ఉన్నారు.

## కుంజా వనజ మృతిపై డా. రవీందర్ నాయక్

# డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ఆరా.!

### -ప్రోగ్రాం అధికారులతో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష




భద్రాద్రి జిల్లా బ్యూరో, జూన్ 20 (భారతశక్తి): జిల్లాలో ఇటీవల చోటుచేసుకున్న కుంజ వనజ మృతి ఘటనపై డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డా. రవీందర్ నాయక్ జిల్లాకు విచ్చేసి కుంజా వనజ మృతి సంఘటనపై శనివారం సమగ్రంగా ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య అండ్ ఆరోగ్య అధికారి డా. తుకారాం రాథోడ్, డాక్టర్ రవిబాబు డిసిహెచ్ఎస్, సంబంధిత వైద్య అధికారులు, ఆరోగ్య సిబ్బందితో సమావేశమై గర్భిణికి అందించిన వైద్య సేవలు, చికిత్స వివరాలు, రిఫరల్ ప్రక్రియ, సంఘటనకు దారితీసిన పరిస్థితులు తదితర అంశాలపై పూర్తి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత రికార్డులను పరిశీలించి, విధుల నిర్వహణలో ఎలాంటి లోపాలు జరిగాయో సమగ్రంగా విచారణ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. విచారణ నివేదికను త్వరితగతిన ప్రభుత్వానికి సమర్పించాలని సూచించారు. డైరెక్టర్ డా. రవీందర్ నాయక్ జిల్లా వైద్య అండ్ ఆరోగ్య శాఖ ప్రోగ్రాం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలో అమలవుతున్న వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పురోగతి, మాతా-శిశు ఆరోగ్య సేవలు, కుటుంబ నియంత్రణ, వ్యాధి నియంత్రణ కార్యక్రమాలు, అసంక్రమిత వ్యాధుల (ఎన్.సి.డి) స్క్రీనింగ్, టీకా కార్యక్రమం, ఆయుష్మాన్ భారత్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ల పనితీరు, సికిల్ సెల్ అనీమియా నియంత్రణ కార్యక్రమం, క్షయవ్యాధి నిర్మూలన, కుష్ఠు నిర్మూలన, వెక్టర్ బోర్న్ వ్యాధుల నివారణ తదితర అంశాలపై కార్యక్రమాల వారీగా సమీక్ష నిర్వహించారు. ప్రతి కార్యక్రమంలో నిర్దేశించిన లక్ష్యాలను శాతానికి శాతం సాధించాలని, పెండింగ్ అంశాలను వెంటనే పూర్తి చేయాలని, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ వైద్య సంస్థల్లో గర్భిణులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, హైరిస్క్ గర్భిణులను ముందస్తుగా గుర్తించి ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచాలని, అత్యవసర పరిస్థితుల్లో రిఫరల్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. మాతా-శిశు మరణాల నివారణకు ప్రతి ఆరోగ్య కార్యకర్త బాధ్యతాయుతంగా పనిచేయాలని, వైద్య సేవల నాణ్యతను మరింత మెరుగుపరచాలని డైరెక్టర్ డా. రవీందర్ నాయక్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ప్రతాప్, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ దినేష్, మోహన్, రామ్ ప్రసాద్ , విప్లవ్ కుమార్, సలిత, శ్రీధర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# నీట్ అభ్యర్థులకు బస్సుల్లో ఉచిత ప్రయాణం ఆర్టీసీ డిఎం శ్యాంసుందర్



మణుగూరు, జూన్ 20 (భారతశక్తి) : నేడు నీట్ యూజీ రీఎగ్జామినేషన్ కు హాజరయ్యే అభ్యర్థులకు నాన్ ఏసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించనున్నట్లు మణుగూరు ఆర్టీసీ డిఎం శ్యాంసుందర్ శనివారం ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశానుసారం, ఆర్టీసీ ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు ఆదివారం పరీక్ష జరగనుండగా హాల్ టికెట్ చూపించి విద్యార్థులు ఈ సదుపాయాన్ని వినియోగించు కోవచ్చని తెలిపారు. దూరప్రాంతాలకు వెళ్లే విద్యార్థులు సూపర్ లగ్జరీ, డీలక్స్, ఎక్స్ప్రెస్, పల్లె వెలుగు ఏ బస్సుల్లో అయినా రేపు మొత్తం ఉచితంగా ప్రయాణించవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను రాష్ట్ర ప్రభుత్వం కొనాల్సిందే.!

### -బీఆర్ఎస్ నాయకులు డిమాండ్



మణుగూరు, జూన్ 20 (భారతశక్తి): రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మణుగూరులోని పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు కుంట లక్ష్మణ్ పాల్గొని మాట్లాడారు. ఎన్నికల సమయంలో రైతులకు అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు.

యాసంగి ధాన్యం కొనుగోళ్లలో రైతులకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయని, ధాన్యం సకాలంలో కొనుగోలు చేయకపోవడం, రవాణా సమస్యలు, మిల్లర్ల వద్ద ఎదురైన ఇబ్బందులతో రైతులు నష్టపోయారని ఆరోపించారు. రైతుబంధు, రైతు సంక్షేమ పథకాల అమలుపై ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి చేసిన వ్యాఖ్యలపై కూడా వారు అభ్యంతరం వ్యక్తం చేస్తూ, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వ్యవహరించాలని సూచించారు.

ఎన్నికల మేనిఫెస్టోలో రైతులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని, లేకపోతే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మాజీ జడ్పీటీసీ పోశం నరసింహారావు, ముత్యం బాబు, వట్టం రాంబాబు, అడపా అప్పారావు, ఎడ్ల శ్రీనివాస్, ముద్దంగుల కృష్ణ, అక్కి నరసింహారావు, తడికమల ప్రభుదాస్, వేల్పుల సురేష్, జావిద్ పాషా, తురక రామకోటి, వడ్లూరి రాంబాబు, వనమాల రాంబాబు, రావులపల్లి వెంకటేశ్వర్లు, బోసెట్టి రవి, గుర్రం సృజన్, జక్కం రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఫారెస్ట్-రెవెన్యూ జాయింట్ సర్వే, భూసేకరణ

# ప్రక్రియలను వేగవంతం చేయాలి

### -అక్కినేపల్లి, లింగంపల్లి ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించిన జిల్లా కలెక్టర్ అంకిత్

భద్రాద్రి జిల్లా బ్యూరో, జూన్ 20 (భారతశక్తి): జిల్లాలో ఫారెస్ట్--రెవెన్యూ జాయింట్ సర్వే, నాన్-క్యాడస్ట్రల్ సర్వే, నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియలను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. శనివారం దమ్మపేట మండలంలోని పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న సర్వే పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా దమ్మపేట మండలం అక్కినేపల్లి గ్రామంలో చేపడుతున్న నాన్-క్యాడస్ట్రల్ సర్వే పనులను కలెక్టర్ పరిశీలించారు. సర్వే ప్రక్రియ, భూముల హద్దుల గుర్తింపు, రికార్డుల నమోదు విధానాలను అడిగి తెలుసుకుని పనులను నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని సూచించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా సర్వే నిర్వహించాలని అధికారులకు సూచించారు. అనంతరం దమ్మపేట మండలం లింగంపల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 1458లో కొనసాగుతున్న ఫారెస్ట్--రెవెన్యూ జాయింట్ సర్వే పనుల పురోగతిని కలెక్టర్ పరిశీలించారు. అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు సంయుక్తంగా నిర్వహిస్తున్న సర్వే ప్రక్రియను పరిశీలించి, భూముల సరిహద్దుల నిర్ధారణలో ఖచ్చితత్వం పాటించాలని ఆదేశించారు. శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తూ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా అధికారులు కలెక్టర్‌కు వివరాలు అందిస్తూ అక్కినేపల్లి గ్రామ పరిధిలో సుమారు 4,400 ఎకరాల విస్తీర్ణంలో ఫారెస్ట్--రెవెన్యూ జాయింట్ సర్వే పనులు కొనసాగుతున్నాయని, ప్రస్తుతం పనులు ప్రణాళికాబద్ధంగా జరుగుతున్నాయని తెలిపారు. మరో రెండు నెలల్లో సర్వే ప్రక్రియను పూర్తిచేయనున్నట్లు వివరించారు. దమ్మపేట తహశీల్దార్ కార్యాలయంలో నీటిపారుదల శాఖ అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీతారామ ప్రాజెక్టు అలైన్‌మెంట్‌ను



మ్యాప్ ద్వారా పరిశీలించి, ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ, సర్వే, సరిహద్దుల నిర్ధారణ అంశాలపై అధికారులతో సమగ్రంగా చర్చించారు. ప్రాజెక్టు పనులకు ఎటువంటి అవరోధాలు తలెత్తకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని, పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఫారెస్ట్--రెవెన్యూ జాయింట్ సర్వే ద్వారా అటవీ, రెవెన్యూ భూముల సరిహద్దులు స్పష్టంగా నిర్ధారణ కావడంతో పాటు భవిష్యత్తులో తలెత్తే వివాదాలకు పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. సర్వే, భూసేకరణ ప్రక్రియలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రభుత్వ లక్ష్యాల సాధనకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట కొత్తగూడెం రెవెన్యూ డివిజనల్ అధికారి మధు, దమ్మపేట తహశీల్దార్ రామ్ నరేష్, ఫారెస్ట్ రేంజర్ శ్రీనివాస్ రావు, సర్వేయర్ నాగరాజు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# 23 న రాష్ట్ర వ్యాప్త పాఠశాలల బంద్

### - ఏబీవీపీ జిల్లా కన్వీనర్ లావుడియా అనిల్ కుమార్

మంచిర్యాల ప్రతినిధి, జూన్ 20 ( భారత శక్తి): ప్రైవేట్, కార్పొరేట్ విద్యా మాఫియాకు బ్రాండ్ అంబాసిడర్ లా ముఖమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నాడని శనివారం రోజు ఏర్పాటు విలేకరుల సమావేశంలో మంచిర్యాల జిల్లా కరీంనగర్ లావుడియా అనిల్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూబితెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాల విద్య నిర్వీర్యం అవుతున్నది.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా విద్యాశాఖ మంత్రిగా ఉండి ప్రైవేట్,కార్పొరేట్ పాఠశాలలకు బ్రాండ్ అంబాసిడర్ గా వ్యవహరిస్తున్నాడని, ప్రభుత్వ పాఠశాలల ఎత్తివేతకు కుట్ర చేస్తూ ప్రైవేట్,కార్పొరేట్ పాఠశాలల ఆర్థిక దోపిడీకి కొమ్ముకాస్తున్న రాష్ట్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా ఏబీవీపీ ఆధ్వర్యంలో జూన్ 23న రాష్ట్ర వ్యాప్త పాఠశాలల బంద్ కు పిలుపునిస్తున్నట్లుగా తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేద విద్యార్థులకు విద్యను దూరం చేయాలని కుట్ర చేస్తున్నాడని, అందుకే రేషనలైజేషన్ పేరుతో 23000 ల పాఠశాలలను మూసేందుకు కంకణం కట్టుకున్నాడని,ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలకు ఏజెంట్ లా వ్యవహరిస్తున్నాడని, విచ్చలవిడిగా ఫీజుల దోపిడీకి పాల్పడుతున్న ప్రైవేట్ పాఠశాలలకు ప్రభుత్వం రెడ్ కార్పెట్ పరిచిందని ఎద్దేవా చేశారు.వెంటనే ప్రభుత్వం ఫీజుల దోపిడీని అరికట్టి, ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు.ప్రైవేటు,కార్పొరేట్ స్కూళ్లలో పేద విద్యార్థులకు ఉచితంగా 25% సీట్లను అందించే విద్యాహక్కు చట్టాన్ని ప్రభుత్వం అటకెక్కించిందన్నారు. రాష్ట్రంలో పాఠశాలలు పర్యవేక్షణ లేకుండా నడుస్తున్నాయని కావున ఖాళీగా ఉన్న ఎంఈఓ,డిఈఓ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని ఆయన ప్రభుత్వాన్నిడిమాండ్ చేశారు. ఒక పర్మిషన్ పేరు మీద పలు బ్రాంచు లు నిర్వహిస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర నుంచి ఆర్థిక దోపిడీకి పాల్పడుతు సరస్వతి నిలయాలు లాంటి పాఠశాలలను వ్యాపార కేంద్రాలుగా మారుస్తున్నటువంటి ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించి ఖాళీగా ఉన్న టీచింగ్,నాన్ టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని,అదేవిధంగా గురుకుల పాఠశాలలకు పక్కా భవనాలు నిర్మించాలని, ఫుడ్ పాయిజన్ కి తావులేకుండా విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని,చీజూ 2020ని,విద్య హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.పాఠశాలలు రీ ఓపెన్ అయిన ఇంతవరకు విద్యార్థులకు స్కూలు యూనిఫామ్స్ ఇవ్వకపోవడం రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యా వ్యవస్థ పై చూపిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిదర్శనం అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో “బ్రేక్ ఫాస్ట్ స్కీమ్” ను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఇప్పటికైనా రాష్ట్ర




ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ విద్యా వ్యవస్థను గాడి పెట్టాలని, ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఆర్థిక దోపిడిని నియంత్రించి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.లేనిపక్షంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు.విద్యార్థి వ్యతిరేక విధానాలకు పాల్పడుతూ రాష్ట్రంలో విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నటువంటి రాష్ట్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా ఈ నెల 23న ఏబీవీపీ పాఠశాలల బందుకు పిలుపునిచ్చింది అని పేర్కొన్నారు. ఈ బంధు కు విద్యార్థులు,వారి తల్లిదండ్రులు బంద్ కు సహకరించి విజయవంతం చేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో నగర ఉపాధ్యక్షుడు చరణ్, ఈశ్వర్, శివ, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## 40వ ఒలింపిక్ డే రన్ ను ప్రారంభించిన

# జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జూన్ 20: అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కామారెడ్డి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 40వ ఒలింపిక్ డే రన్‌ను ఘనంగా నిర్వహించారు జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం జెండా ఊపి ఒలింపిక్ డే రన్‌ను ప్రారంభించారు. జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాల, కామారెడ్డి వద్ద ప్రారంభమైన రన్ కాకతీయ నగర్‌లోని సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాల వరకు కొనసాగింది. ఈ రన్‌లో విద్యార్థులు, క్రీడాకారులు, యువత, క్రీడాభిమానులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, క్రీడలు శారీరక, మానసిక వికాసానికి ఎంతో దోహదపడతాయని అన్నారు. యువత క్రీడల్లో చురుకుగా పాల్గొని ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. ఒలింపిక్ స్ఫూర్తి, క్రీడాస్ఫూర్తి, క్రమశిక్షణ, ఐక్యత



వంటి విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు విక్టర్, ఎన్ గిరి, సంబంధిత జిల్లా అధికారులు, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్




కన్వీనర్ డా. కె.పి. అనిల్ కుమార్, చైర్మన్ డా. ఎం. జైపాల్ రెడ్డి, క్రీడా సంఘాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు క్రీడాకారులు పాల్గొన్నారు.

# నీట్ రీ-పరీక్ష కేంద్రాల వద్ద నిషేధాజ్ఞలు అమలు

### - పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

మంచిర్యాల ప్రతినిధి, జూన్ 20 ( భారత శక్తి): నీట్ రీ-పరీక్ష నేపథ్యంలో, రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల జిల్లాలో ఉన్న పరీక్ష కేంద్రాల వద్ద శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా భారతీయ నాగరిక భద్రతా సంహిత (బీఎన్ఎస్ఎస్) సెక్షన్ 163 (పూర్వపు సెక్షన్ 144) ప్రకారం నిషేధాజ్ఞలను అమలు చేస్తూ రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులు 21-06-2026 ఆదివారం ఉదయం 6.00 గంటల నుంచి సాయంత్రం 6.00 గంటల వరకు అమలులో ఉంటాయని,వాటిని ఎవరైనా ఉల్లంఘించిన పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని పోలీస్ కమిషనర్ హెచ్చరించారు.మంచిర్యాల జోన్‌లోని మొత్తం ఐదు పరీక్ష కేంద్రాలు,అవి ప్రభుత్వ డిగ్రీ కళాశాల,ప్రభుత్వ ఉన్నత పాఠశాల, తెలంగాణ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, మంచిర్యాలలో ఆదివారం మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పోలీస్ కమిషనర్ తెలిపారు. పరీక్ష కేంద్రాల పరిసరాల్లో ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు గుమికూడరాదని, సభలు,సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు నిర్వహించడం నిషేధించబడిందని పేర్కొన్నారు.అదేవిధంగా, పరీక్ష కేంద్రాలకు 500 మీటర్ల పరిధిలో ఉన్న అన్ని జిరాక్స్ కేంద్రాలను 21-06-2026 ఉదయం 6.00 గంటల నుంచి సాయంత్రం 6.00 గంటల వరకు మూసివేయాలని ఆదేశించారు.పరీక్షల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగానే ఈ నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు.




## కామారెడ్డి ధూప దీప నైవేద్య అర్చక సంఘం ఆధ్వర్యంలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చిత్రపటానికి పాలాభిషేకం



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జూన్ 20: కామారెడ్డి మున్సిపల్ 13వ వార్డు టేక్రియాల్ శివాలయం దగ్గర డిడిఎన్ అధ్యక్షులు వాసుదేవరావు శర్మకు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన ధూప దీప నైవేద్య అర్చకులు ఈ కార్యక్రమం రాష్ట్ర నాయకులు సీర్ల వంచ కృష్ణమాచార్యులు జిల్లా అధ్యక్షులు అంజన్నప్ప మాట్లాడుతూ, మా పూజారులకు దేవాదాయ శాఖ మాత్యులు కొండ సురేఖమ్మ మహా ఆలయాలకు దర్శనార్థం వెళితే శీఘ్ర దర్శనం కొరకు జీవోను ఇవ్వడం శుభశోచకంగా భావిస్తున్నాం. అలాగే రానున్న రోజుల్లో మాజీవితాలు చాలీచాలని వేదనంగా ఉన్నాయి, కనుక 35 వేల వేతనాన్ని ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు, ఉద్యోగ భద్రత ఉదయాన్నే లేచి గుడికి వెళ్లి లేటుగా భోజన కార్యక్రమాలు చేయడం వలన రకరకాల ఆరోగ్య సమస్యలతో కూడా కొంతమంది ఆరోగ్య మెరుగు కొరకు మెడికల్ ట్రీట్మెంట్ ల కొరకు కొంత సానుకూలంగా ప్రభుత్వము మమ్మల్ని చూడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కార్యదర్శి రాజశేఖర్, క్యాషియర్ భాస్కర్, సేవాలాల్ మహారాజ్, పూజారులు శివ మహారాజ్, రామ్ మహరాజ్ సంగప్ప, వీరప్రసాద్ లింగం, శివ గురుమూర్తి, ఎస్ ఎస్ నగర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలల అధిక ఫీజులను నియంత్రించి, ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన మౌలిక వసతులు కల్పించాలి.



జనగామ(భారత శక్తి)జూన్ 20: బీ ఆర్ స్ వి దేవరుప్పుల మండల అధ్యక్షులు పందేనబోయిన మధు ముదిరాజ్పాలకుర్తి నియోజకవర్గంలో ప్రైవేట్ పాఠశాలలు విద్యార్థుల తల్లిదండ్రులపై అధిక ఫీజుల భారం మోపుతూ విద్యను వ్యాపారంగా మార్చుతున్నాయని భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. పేద మరియు మధ్యతరగతి కుటుంబాలు తమ పిల్లలకు మంచి విద్య అందించాలని ఆశపడుతున్నప్పటికీ, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా ఫీజులను పెంచి తల్లిదండ్రులను ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నాయని పేర్కొన్నారు. భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగ రాష్ట్ర అధ్యక్షులు గెలు శ్రీనివాస్ యాదవ్ సూచనల మేరకు,పాలకుర్తి నియోజకవర్గ కోఆర్డినేటర్ పోశాల పవన్ గౌడ్ ఆదేశానుసారం విద్యార్థి విభాగ నాయకులు మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) కి వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా పందేనబోయిన మధు మాట్లాడుతూ,విద్య అనేది ప్రతి ఒక్కరి హక్కు అని,కానీ ప్రస్తుతం కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు అధిక ఫీజుల పేరుతో విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుతున్నాయని అన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు, తరగతి గదులు, ఫర్నిచర్, క్రీడా మైదానాలు వంటి మౌలిక వసతులు సరిగా లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి,నాణ్యమైన విద్య అందేలా అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించాలని కోరారు. ప్రైవేట్ పాఠశాలల ఫీజుల నియంత్రణతో పాటు ప్రభుత్వ పాఠశాలల సమస్యల పరిష్కారానికి అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీ ఆర్ స్ పార్టీ యూత్ అధ్యక్షులు బానోతు నవీన్ నాయక్, మండల సోషల్ మీడియా అధ్యక్షులు దాసగాని భరత్,నలుగురి పరుశరాములు, సాయి కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

## బడిపంతులుగా మారిన ఎస్పీ- నరసింహ

### ధ్రువాల పాటలు ఆసక్తిగా తిలకించిన విద్యార్థులు, ఉపాధ్యాయులు



సూర్యాపేట(భారత శక్తి ప్రతినిధి) జూన్ 20: పూర్వపు వృత్తిని గుర్తుచేసుకుని విద్యార్థులకు పాఠాలు బోధించిన సూర్యాపేట జిల్లా సూర్యాపేట జిల్లా ఎస్పీ ఈరోజు సూర్యాపేట పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల ను సందర్శించి ఎనిమిదో తరగతి విద్యార్థులకు పాఠాలు బోధించారు. మరో మారు తన పూర్వపు ఉపాధ్యాయ వృత్తిని గుర్తుచేసుకొని ఉత్తరధ్రువం దక్షిణధ్రువం అంటూ సాంఘికశాస్త్రం పాఠాలను ఎనిమిదోవ తరగతి విద్యార్థులకు బోధించారు. ఎస్పీ చెప్తున్న పాఠాలను విద్యార్థులు ఆసక్తిగా విన్నారు. లిజూనియర్ అసిస్టెంట్ కు సన్మానంలి తాను పనిచేస్తున్న ప్రభుత్వ పాఠశాలనందే తన కుమారుడు రుత్విక్ ను చెప్పించిన జూనియర్ అసిస్టెంట్ హరితను అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన విద్యను అందరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ పాఠశాలలో నిష్ణాతులైన అనుభవిజ్ఞులైన నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు ఉంటారని పిల్లలకు అర్థమయ్యే రీతిలో సృజనాత్మకతతో కూడిన విద్యను అందిస్తారని తెలిపారు. కావున తల్లిదండ్రులు విద్యార్థులకు ఉన్నత విద్యను అందించడం కోసం ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదువుకోవాలని ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా విని భవిష్యత్తులో మంచి స్థాయికి ఎదగాలని కోరారు. చెడు అలవాటులకు దూరంగా ఉండాలని మంచి స్నేహితులను మంచి పుస్తకాలను ఎంచుకొని కష్టపడి చదువుకోవాలని అన్నారు. ఉపాధ్యాయులు నైపుణ్యంతో విద్యార్థులకు పాఠాలు బోధించాలని సర్కారు బడుల ప్రాముఖ్యతను సామర్థ్యాన్ని తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ వెంట అదనపు ఎస్పి రవీందర్ రెడ్డి, సూర్యాపేట డిఎస్పి ప్రసన్నకుమార్, పట్టణ సిఐ వెంకటయ్య, ఎస్ఐలు ఏడుకొండలు, సాయిరాం, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రులలో అత్యున్నత వైద్యం అందించేలా చర్యలు జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.

నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 20 (భారతశక్తి )జిల్లాలోని పేద ప్రజలందరికీ మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. శనివారం ఆయన నిర్మల్ పట్టణంలోని ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఆన్లైన్ విధానంలో జరుగుతున్న ఓపీ సేవల నమోదు ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజూ సగటున నమోదవుతున్న ఓపీ వివరాలతో పాటు, ఏ విభాగాలకు చెందిన చికిత్సల కోసం ఎక్కువ మంది రోగులు వస్తున్నారో ఆరా తీశారు. అనంతరం ఆసుపత్రిలోని ప్రతి విభాగాన్ని సందర్శించి, రోగులకు అవసరమైన వైద్య సేవలు సకాలంలో అందించాలని, అవసరమైన వారికి తక్షణమే రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. రోగుల సౌకర్యార్థం వివిధ విభాగాలను సూచించే సైన్ బోర్డులను ప్రజలకు సులభంగా అర్థమయ్యే రీతిలో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వైద్య




సేవలందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఆసుపత్రికి సంబంధించిన రికార్డులను పరిశీలించిన కలెక్టర్, ప్రతి రికార్డును పకడ్బందీగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆసుపత్రి ప్రాంగణాన్ని ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. నూతనంగా



నిర్మించిన క్రిటికల్ కేర్ విభాగాన్ని పరిశీలించిన ఆయన, ఇంకా పూర్తి కావాల్సిన పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలో ఆసుపత్రి పర్యవేక్షకులు గోపాల్ సింగ్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ శారద, వైద్య శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గోరి కొత్తపల్లి లో కాంగ్రెస్ పార్టీకి షాక్.

### టౌన్ యూత్ ఉపాధ్యక్షుడు తో పాటు వార్డు సభ్యురాలు BRS లో చేరిక



రేగొండ, జూన్ 20 (భారత శక్తి) జయశంకర్ భూపాలపల్లి జిల్లా గోరి కొత్తపల్లి మండల కేంద్రానికి చెందిన 9వ వార్డు కు చెందిన కాంగ్రెస్ సభ్యురాలు వార్డ్ మెంబర్ పసుల రమ్య అలాగే కాంగ్రెస్ పార్టీ యూత్ ఉపాధ్యక్షుడు పసుల రాకేష్ కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. గోరి కొత్తపల్లి మండల మాజీ అధ్యక్షుడు హమీద్, సర్పంచ్ నిమ్మల శంకర్, టౌన్ మాజీ అధ్యక్షుడు రఘుసాల తిరుపతి ఆధ్వర్యంలో నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణ రెడ్డి రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి చేతుల మీదుగా రాకేష్ - రమ్య లు గులాబీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా రాకేష్ - రమ్య లు మాట్లాడుతూ రానున్న రోజుల్లో భూపాలపల్లి గడ్డ మీద రమణ రెడ్డి గెలుపు తథ్యం అని, గోరి కొత్తపల్లి మండలం చేసి, అనేక అభివృద్ధి పనులతో ముందు నడిచిన రమణ రెడ్డి కోసం అహర్నిషలు కష్టపడుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కానుగంటి శ్రీనివాస్, ఉడుత కుమారస్వామి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక విస్తృత పునర్విమర్శ 2026 ఓటరు అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్




కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జూన్ 20: రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక విస్తృత పునర్విమర్శ 2026 కార్యక్రమంపై ఓటర్లలో అవగాహన కల్పించేందుకు నిర్వహించిన అవగాహన కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి ఆశిష్ సాంగ్వాన్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ 2కే రన్ను జెండా ఊపి ప్రారంభించి, ఎన్నికల ప్రక్రియలో ప్రతి అర్హుడైన ఓటరు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ఓటరు జాబితాలో ప్రతి అర్హుడి పేరు నమోదు కావడం ఎంతో ముఖ్యమని అన్నారు. ప్రత్యేక విస్తృత పునర్విమర్శ కార్యక్రమంలో భాగంగా జూన్ 25, 2026 నుంచి జూలై 24, 2026 వరకు బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరిస్తారని తెలిపారు. ఓటర్లు తమ వివరాలను సరిచూసుకుని అవసరమైన మార్పులు, చేర్పులు చేసుకోవాలని సూచించారు. జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించబడుతుందని, అభ్యంతరాలు దరఖాస్తుల పరిశీలన అనంతరం అక్టోబర్ 1, 2026న తుది ఓటరు జాబితా ప్రచురించబడుతుందని తెలిపారు. ఓటరు అవగాహన కార్యక్రమాలు జిల్లావ్యాప్తంగా విస్తృతంగా నిర్వహించనున్నట్లు పేర్కొంటూ, ప్రజలు ఈ ప్రక్రియలో చురుకుగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు విక్టర్, ఎన్ గిరి, జైపాల్ రెడ్డి ఎమ్మార్వో హిమబిందు, మున్సిపల్ ఛైర్పర్సన్ ఉమారాణి ఎన్నికల అధికారులు, బూత్ స్థాయి అధికారులు, విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ,ప్రజలు పాల్గొన్నారు.

## పీవీటి మార్కెట్ వద్ద ఫిట్స్ తో గుర్తు తెలియని వ్యక్తి మృతి



ఎల్బీనగర్, జూన్ 20 (భారత శక్తి): కొత్తపేట పరిధిలో పీవీటి మార్కెట్ వద్ద ఫిట్స్ వచ్చి 50 ఏండ్ల ఒక గుర్తు తెలియని వ్యక్తి పడిపోయి ఉన్నాడనే సమాచారం అందుకున్న సరూర్నగర్ పోలీస్ బ్లూ క్లోట్ సిబ్బంది సందీప్ మరియు శ్రీశైలం అతనిని ఉస్మానియా ఆసుపత్రిలో చేర్పించారు. రెండు రోజుల తరువాత చికిత్స పొందుతూ ఆ గుర్తు తెలియని వ్యక్తి మరణించాడని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ఈ విషయంపై సరూర్నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని సీఐ శ్రీశైలం తెలిపారు.

## గ్రేటర్ ఎన్నికలకు యువజన కాంగ్రెస్ సన్నద్ధం కావాలి

### - కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలి : జక్కిడి శివచరణ్ రెడ్డి



ఎల్బీనగర్, జూన్ 20 భారతశక్తి: రాబోయే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలకు యువజన కాంగ్రెస్ శ్రేణులు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి పిలుపునిచ్చారు. చైతన్యపురి డివిజన్ పరిధిలోని గణేష్ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన రంగారెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ కార్యవర్గ విస్తృత స్థాయి సమావేశానికి ఆయన రాష్ట్ర ఇన్చార్జ్ ఖాలీద్తో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా యువజన కాంగ్రెస్ చేపట్టిన కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించి, రాబోయే రోజుల్లో చేపట్టాల్సిన కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు.

**- ప్రజా సమస్యలపై పోరాటాలు**

అనంతరం శివచరణ్ రెడ్డి మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను యువజన కాంగ్రెస్ శ్రేణులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. లోక్సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సూచనలు, భారతీయ యువజన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఉదయభాను చిబ్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రజా సమస్యలపై నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.

**- ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి**

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు. గ్రేటర్ ఎన్నికల్లో టికెట్ల కేటాయింపులో యువజన కాంగ్రెస్కు తగిన ప్రాధాన్యం లభిస్తుందని, పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ శ్రమించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర సహ ఇంచార్జ్ కె.ఆర్. భవ్య, రంగారెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు నాగేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు యరమల రామచంద్రారెడ్డి, శ్యామ్ చరణ్ రెడ్డి, సాగర్, విద్యారెడ్డి, పాలడుగు నాగార్జున, శివకుమార్, సుభాన్ యాదవ్, దళపతి తదితరులు పాల్గొన్నారు.

## కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ ఉత్తమ మార్గం

### - జిల్లా ప్రధాన న్యాయమూర్తి, రంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ కర్ణ కుమార్



ఎల్బీనగర్, జూన్ 20 (భారత శక్తి): రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ వారి ఆదేశాల మేరకు రంగారెడ్డి జిల్లాలో గల అన్ని కోర్ట్ ప్రాంగణాలలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడమైనది. జిల్లా ప్రధాన న్యాయమూర్తి రంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ కర్ణ కుమార్ మాట్లాడుతూ, ఈ జాతీయ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ లోక్ అదాలత్ లో సెటిల్ చేసుకోవడం ద్వారా తాము సివిల్ కేసులలో చెల్లించిన కోర్ట్ ఫీజు కూడా తిరిగి పొందొచ్చని చెప్పారు. తమ కేసులను అనగా ఆస్తి పరమైన కేసులు మరియు కుటుంబ సమస్యల కేసులు పరిష్కారం చేసుకోవడానికి ఈ లోక్ అదాలత్ మరియు మధ్యవర్తిత్వం ఒక మంచి వేదిక అని చెప్పారు. లోక్ అదాలత్ లో కేసు రాజీ అవ్వడం ద్వారా ఇరు వర్గాలు గెలిచినట్టే అని అన్నారు.

**జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి / సీనియర్ సివిల్ జడ్జి**

శ్రీ మతి జి.అనూష మాట్లాడుతూ, రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్ట్ ప్రాంగణాలలో 25 లోక్ అదాలత్ బెంచిలు ఏర్పాటు చేశామని ఇందులో రాజీకి ఆమోద యోగ్యమైన క్రిమినల్ కేసులు, సివిల్ దావాలు, చెక్ బౌన్స్ కేసులు, మోటారు వాహన ప్రమాద బీమా కేసులు, కన్స్యూమర్ కోర్టు కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కరించుకొన్నారని చెప్పారు. ఈ లోక్ అదాలత్ నిర్వహించుటలో పోలీస్ వారు, ఇన్సూరెన్స్ అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, పానెల్ అడ్వొకేట్స్ మరియు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది తమ వంతు సహాయసహకారాలను అందించారు. కక్షిదారులు సంతోషం వ్యక్తపరిచారు. ఈ జాతీయ లోక్ అదాలత్ లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కక్షిదారులకు ఉచితంగా భోజనాన్ని అందించింది. ఇందులో రాజీకి ఆమోద యోగ్యమైన క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, మోటార్ వాహన ప్రమాద భీమా కేసులు, బ్యాంకు రికవరీ మరియు ప్రీటిగేషన్ కేసులు అన్ని కలిపి సుమారు 51,000 పై చిలుకు కేసులు పరిష్కరించబడ్డాయి. అలాగే అన్ని కేసులలో కలిపి రూ.7,54,43,179 రూపాయల వరకు నష్ట పరిహారాన్ని కక్షిదారులకు ఇప్పించడం జరిగిందని కోర్టు సిబ్బంది తెలిపారు.

భారత శక్తి
VOICE OF INDIAN
ఆదివారం, జూన్ 21, 2026

## ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి

**- ఎంపీ వల్లభనేని బాలశౌరి**

**మచిలీపట్నం(భారత శక్తి)** మచిలీపట్నం బస్టాండ్‌లో ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్లు బందరు పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి తెలిపారు. శనివారం ఆయన ఆకస్మికంగా మచిలీపట్నం బస్టాండ్‌ను సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఇటీవల బస్టాండ్ దుస్థితిపై మీడియాలో వచ్చిన కథనాల నేపథ్యంలో స్పందించిన ఎంపీ, వర్షాలు కురిసినప్పుడు బస్టాండ్ మొత్తం నీటమునిగిపోవడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. బస్టాండ్ ప్రాంగణంలో పేరుకుపోయిన నీరు, పారిశుద్ధ్య సమస్యలు, ప్రయాణికులకు అందుతున్న సౌకర్యాలపై ఆయన ఆరా తీశారు. ఈ సందర్భంగా బస్టాండ్‌ను ఆధునీకరించి సుందరీకరించేందుకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధులను వినియోగించేలా సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఎంపీ ఆదేశించారు. ప్రయాణికులకు పరిశుభ్రమైన వాతావరణం, మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. బస్టాండ్ సముదాయాన్ని ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచేందుకు అవసరమైన నిధుల సమీకరణకు తాను కృషి చేస్తానని ఎంపీ వల్లభనేని బాలశౌరి హామీ ఇచ్చారు. ప్రజలకు నాణ్యమైన రవాణా సేవలు అందించడమే లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. ఎంపీ పర్యటనతో బస్టాండ్ సమస్యల పరిష్కారానికి త్వరలోనే చర్యలు చేపట్టే అవకాశం ఉందని ప్రయాణికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు

## కృష్ణలంక స్వర్గపురి శ్మశానవాటికలో పోలీసుల విచారణ

**విజయవాడ (భారత శక్తి)**కృష్ణలంక స్వర్గపురి శ్మశానవాటికలో పోలీసుల విచారణ కొనసాగింది. గత నెలలో జరిగిన గుర్తుతెలియని మృతదేహాల ఖననంపై పటమట సీఐ పవన్ కిషోర్ విచారణ చేపట్టారు. స్వర్గపురి సిబ్బంది నుంచి వివరాలు తెలుసుకున్నారు. స్వర్గపురి ఎలక్ట్రిక్ ఫర్నస్ ఆపరేటర్ బాష ను అదుపులోకి తీసుకొని ప్రశ్నించారు. బాషా మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. అనాథ మృతదేహాలను దహనం చేయడానికి ప్రొసీజర్ ఫాలో అయ్యారా లేదా అనే కోణంలో విచారణ కొనసాగింది. మృతదేహాలను ఖననం చేసే ముందు రికార్డ్ మెయింటెయిన్ చేశారా అని ప్రశ్నించారు.

## కంబదహాల్ గ్రామంలో స్వర్ణాంధ్రబిస్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం




**సి. బెలగల్ (భారత శక్తి)** మండల పరిధిలోనికంభదహాల్ గ్రామంలో "స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర" కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు.. ఈ కార్యక్రమానికి మండల ప్రత్యేక అధికారి అశ్వినికుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అలాగే ఎంపీడీఓ రాణమ్మ డిప్యూటీ ఎంపీడీఓ మహేశ్వరి పీడీఓ , గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామస్థాయి ఉద్యోగులు, జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా అధికారులు గ్రామంలోని హౌసింగ్ లేఔట్‌ను సందర్శించి, నిర్మాణంలో ఉన్న ఇళ్ల పురోగతిని పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన చెత్త నుండి సంపద తయారీ కేంద్రం వేస్ట్ టు వెల్త్ సెంటర్ ను సందర్శించి అక్కడ జరుగుతున్న పనితీరును పరిశీలించారు. గ్రామ పరిశుభ్రతను మరింత మెరుగుపరచేందుకు అవసరమైన సూచనలు చేశారు. అదేవిధంగా గ్రామ సచివాలయంలో సచివాలయ సిబ్బంది మరియు గ్రామస్థాయి ఉద్యోగులతో సమావేశమై, ప్రభుత్వం చేపడుతున్న వివిధ సర్వేల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. సర్వేలు నిర్ణీత గడువులోగా పూర్తి చేసి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి అశ్విని కుమార్ మాట్లాడుతూ, "స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర" కార్యక్రమం ద్వారా గ్రామాలను పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామ ప్రజల సహకారంతో ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. గ్రామ ప్రజలు కూడా కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని, గ్రామాభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. గ్రామంలో అభివృద్ధి, పరిశుభ్రత మరియు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలుపై ప్రజల్లో అవగాహన పెంపొందించడంతో పాటు, సమాజంలో మరింత చైతన్యాన్ని కలిగించింది. అధికారులు, సిబ్బంది, ప్రజల సమిష్టి కృషితో కంభదహాల్ గ్రామం ఆదర్శ గ్రామంగా నిలవాలని ఆకాంక్షించారు.

## మాదకద్రవ్యాలను పూర్తిగా నిర్మూలిద్దాం




**కరీంనగర్(భారత శక్తి)** మత్తు పదార్థాలు మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పిలుపునిచ్చారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో పోలీస్ శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నార్కోటిక్ కోఆర్డినేషన్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. మాదకద్రవ్యాల నియంత్రణ సమాజంలోని ప్రతి ఒక్కరి సమిష్టి బాధ్యత అని పేర్కొన్నారు. యువతను మత్తు బారిన పడకుండా కాపాడేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. డ్రగ్స్ రహిత జిల్లాగా కరీంనగర్‌ను తీర్చిదిద్దేందుకు అందరూ కలిసి కృషి చేయాలని పిలుపునిచ్చారు. మత్తు పదార్థాల దుష్పరిణామాలపై విస్తృత అవగాహన కల్పించడం ద్వారా యువతను సరైన మార్గంలో నడిపించవచ్చని పేర్కొన్న ఆమె, మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు అందించాలని సూచించారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ. ఈ నెల 26న నిర్వహించే అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై విద్యాసంస్థల్లో విద్యార్థులకు, ప్రధాన కూడళ్ల వద్ద ప్రజలకు, గ్రామ సభల ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు వెల్లడించారు. జిల్లాలో మత్తు పదార్థాల నియంత్రణకు ప్రత్యేక దాడులు నిర్వహిస్తున్నామని, అక్రమ రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ నెల 22 నుంచి విద్యార్థులతో పోస్టర్ డ్రాయింగ్ పోటీలు నిర్వహించడం, విద్యాసంస్థలను సందర్శించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశాలు ఏర్పాటు చేయడం వంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. అలాగే ఈ నెల 26న ర్యాలీలు, గ్రామ సభలు, డ్రగ్ కమిటీ సమావేశాలు నిర్వహించనున్నట్లు వివరించారు. విద్యాసంస్థలకు 100 మీటర్ల పరిధిలో పాన్ షాపులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను అనంతరం నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు షర్మిల, జల కుమారి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు నార్కోటిక్స్ ఇన్స్పెక్టర్ రఫిక్ ఖాన్ పోలీస్, ఎక్సైజ్, మహిళా శిశు సంక్షేమ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### నంద్యాల జిల్లావ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్లు, పోలీస్ కార్యాలయాలలో
## స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం నిర్వహణ

- ప్రజలలో పరిశుభ్రతపై చైతన్యం తీసుకువచ్చేలా పోలీసులు సమాజానికి ఆదర్శంగా నిలవాలి
- మన ఇంటి లాగే మనం పనిచేసే చోట పరిశుభ్రమైన వాతావరణం ఏర్పాటు చేసుకోవాలి



**నంద్యాల(భారత శక్తి)** జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ ఆదేశాలమేరకు పరిశుభమైన,ఆరోగ్యకరమైన వాతావరనన్నీ ఏర్పాటు చెయ్యడమే లక్షంగా నేడు నంద్యాల జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ లు పోలీస్ కార్యాలయాలలో స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలోని స్పెషల్ బ్రాంచ్, పాస్పోర్ట్ కార్యాలయం, సైబర్ క్రైమ్ , ఫ్యాక్షన్ జోన్ కార్యాలయాలు, సాయుధ బలగాల కార్యాలయాలు, మోటార్ వెహికల్ కార్యాలయం, మరియు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లు పోలీస్ కార్యాలయాలలో జిల్లా పోలీసు అధికారులు మరియు సిబ్బంది తమ కార్యాలయాలు మరియు చుట్టు పక్కల ప్రాంగణాలను సమగ్రంగా పరిశుభ్రం చేశారు. పర్యావరణ పరిరక్షణకు అనుగుణంగా మొక్కలను నాటడం ద్వారా పచ్చదనాన్ని పెంపొందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ విధులు నిర్వహించే చోట వాతావరణాన్ని పరి శుభ్రంగా ఉంచుకోవడం సిబ్బంది ఆరోగ్యానికి మేలు చేస్తుంది. మన ఇంటిని ఏ విధంగా శుభ్రంగా ఉంచుకుంటామో అదేవిధంగా పనిచేసే చోటా పరిశుభ్రమైన వాతావరణాన్ని ఏర్పాటు చేసుకోవాలని తద్వారా అనారోగ్య సమస్యలు విషజ్వరాలు వ్యాప్తి చెందకుండా ఉంటాయని,ప్రజలలో పరిశుభ్రతపై చైతన్యం తీసుకొని రావడమే కాకుండా భవిష్యత్తులో ఇలాంటి సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తూ పోలీసులు సమాజానికి ఆదర్శంగా నిలవాలన్నారు.

## గ్రామీణ ప్రాంతాల్లోని రహదారుల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి

**- ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి**



**కరీంనగర్(భారత శక్తి)** కరీంనగర్ జిల్లా గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్టు మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. శనివారం బెజ్జంకి మండలం దేవక్కపల్లి, పోతారం, పెరుకబండ గ్రామాల్లో నూతనంగా చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి మెరుగైన రహదారులు ఎంతో అవసరమన్నారు. ప్రజలకు రాకపోకల సౌకర్యం కల్పించడంతో పాటు గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. ముఖ్యంగా గ్రామాల మధ్య కనెక్టివిటీ పెంచడంతో అభివృద్ధికి బాట వేయడమేనని ఆయన పేర్కొన్నారు. అందులో భాగంగానే ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమాల్లో దేవక్కపల్లి గ్రామ సర్పంచ్ నేరెళ్ల వెంకటలక్ష్మి-రాజయ్య,పోతారం గ్రామ సర్పంచ్ సింగిరెడ్డి రాజేందర్ రెడ్డి,పెరుకుబండ సర్పంచ్ కర్రావుల స్వప్న, ఆయా గ్రామాల పార్టీ ధ్యక్షులు గ్రామశాఖ అధ్యక్షులు పంజాల అజయ్, కె.బాబు,కె.తిరుపతి, బెజ్జంకి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్ రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్ రెడ్డితోపాటు పలువురు సర్పంచులు, పార్టీ గ్రామాధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. **పరామర్శలు** బెజ్జంకి మండలం పాపన్నపల్లి, బెజ్జంకి ఎక్స్ రోడ్డు, గాగిల్లాపూర్ గ్రామాల్లో ఇటీవల మరణించిన వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పరామర్శించారు. ఈ సందర్భంగా మృతులకు నివాళులర్పించడమే కాకుండా వారి కుటుంబ సభ్యులను ఆయన ఓదార్చారు.


## హోంమంత్రి అనిత తన పదవికి రాజీనామా చేయాలి

**- గాదె సాయికృష్ణ తల్లికి సంఘీభావంగా తిరుపతిలో వైసీపీ భారీ ర్యాలీ**

**తిరుపతి (భారత శక్తి)**సాయి కృష్ణ తల్లికి సంఘీభావండా తిరుపతిలో శనివారం నాడు వైకాపా నేతలు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంత వీధి నుంచి భారీ నిరసన ర్యాలీ గాంధీ రోడ్ పూల మఠం వరకు సాగింది. భూమన కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ సాయికృష్ణ లాక్ డెత్ ఘటనపై సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేసారు.

కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు ఏ విధంగా ఉన్నాయో ఈరోజు ప్రతి ఒక్కరికి తెలుస్తోంది. అనంతపురం జిల్లాలో ఒక దళిత మహిళ తల్లి లాకప్ డెత్ ఘటన తరువాత ఇలాంటి ఘటనలు ఎన్నో చోట్ల జరిగాయి . కృష్ణలంక పీఎస్లో జరుగుతున్న దారుణాలకు సీఐ ఒకరే బాధ్యుడు కాదు, వెనుక ఉండి నడిపించిన ప్రతి ఒక్కరికి శిక్షపడాలని అన్నారు.

## హాఫీజ్పేట్ కో-లివింగ్ హాస్టల్లో అగ్నిప్రమాదం



**రంగారెడ్డి(భారత శక్తి)** హాఫీజ్ పేటలో ఒక హాస్టల్ లో అగ్ని ప్రమాదం జరిగింది. మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హాఫీజ్పేట్ మార్తాండ నగర్లో ఘటన చోటు చేసుకుంది. కో-లివింగ్ హాస్టల్ భవనంలో మంటలు ఒక్కసారిగా చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఘటన సమయానికి హాస్టల్ నివాసితులు బయటకు పరుగులు తీసారు. అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రాణనష్టం లేదు. అగ్నిప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

## ఆగస్ట్, సెప్టెంబర్లో 'స్థానిక' ఎన్నికలు

**మంత్రి మండిపల్లి(భారత శక్తి)** ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఆగస్ట్, సెప్టెంబర్లో ఎలక్షన్స్ జరుగుతాయన్నారు. ప్రచారంలో ముందుండాలని, ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్య కర్తలకు సూచించారు. కాగా ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నామని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే హైకోర్టుకు తెలిపింది. దీంతో 2 నెలల్లో సర్పంచ్, ఓఖుఅ ఎలక్షన్స్ జరిగే అవకాశం ఉంది.

## చిట్టీల మాస్టర్‌పై సస్పెన్షన్

**వరంగల్ (భారత శక్తి)** బడిలో పిల్లలకు పాఠాలు చెప్పాల్సిన ఒక ప్రభుత్వ ఉపాధ్యాయుడు.. బయల పెద్ద ఎత్తున చిట్టీల వ్యాపారం చేస్తూ అడ్డంగా బుక్కయ్యాడు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ ప్రైవేట్ ఫైనాన్స్ దందా నడిపిస్తున్న మ్యాథ్స్ టీచర్‌ను విద్యాశాఖ సస్పెండ్ చేసింది. వివరాల్లోకి వెళితే, హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి జెడ్పీ హైస్కూల్‌లో కలువల ఎల్లయ్య అనే వ్యక్తి మ్యాథ్స్ టీచర్‌గా పని చేస్తున్నాడు. అయితే ఈయనగారు స్కూల్ టైమింగ్స్ దాటిన తర్వాత ప్రభుత్వ రూల్స్ కి పూర్తిగా విరుద్ధంగా ప్రైవేటుగా చిట్టీల వ్యాపారం నడిపిస్తున్నాడు. ఈ క్రమంలోనే చిట్టీల డబ్బుల విషయంలో పలువురిని మోసం చేశాడంటూ ఇటీవల ఎల్లయ్యపై బాధితులు ఫిర్యాదులు చేశారు. ప్రభుత్వ ఉద్యోగంలో ఉంటూ ఇలాంటి ప్రైవేట్ దందాలు చేయడంపై హనుమకొండ జిల్లా కలెక్టర్ సీరియస్ అయ్యారు. ఈ ఆరోపణల నిగ్గు తేల్చేందుకు ఒక ప్రత్యేక విచారణ కమిటీని రంగంలోకి దించారు. ఈ కమిటీ జరిపిన ప్రాథమిక విచారణలో ఎల్లయ్య రూల్స్ బ్రేక్ చేసి చిట్టీల దందా నడిపినట్లు, మోసాలకు పాల్పడినట్లు ఆధారాలతో సహా నిజమని తేలింది. దీంతో జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) గిరిరాజ్ సదరు ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## యోగా మతానికి లింక్ చేయవద్దు

**హైదరాబాద్ (భారత శక్తి)** అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్ వేదికగా భారీ యోగా ఉత్సవాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు... యోగా విశిష్టతపై అత్యంత స్పష్టమైన, కీలకమైన వ్యాఖ్యలు చేశారు. యోగాను ఒక మత కోణంలో చూసే వారిపై ఆయన తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. యోగా అనేది ఏ ఒక్క మతానికో, వర్గానికో పరిమితమైంది కాదని... దానికి మతాన్ని ఆపాదించి చూడటం ముమ్మాటికీ మూర్ఖత్వమే అవుతుందని వెంకయ్య నాయుడు స్పష్టం చేశారు. "ప్రపంచానికి భారతదేశం అందించిన అత్యంత గొప్ప అమూల్యమైన కానుక యోగా. ఇది కేవలం వ్యాయామం కాదు.. మనిషిని సమగ్ర మనిషిగా మార్చే అద్భుత సాధనం. మానవ చైతన్యానికి, సర్వమానవ సౌభ్రాతృత్వానికి ఇదొక నిదర్శనం. మానసిక ఒత్తిడిని దూరం చేసి, గుండె నిబ్బరాన్ని, ఆధ్యాత్మిక స్థైర్యాన్ని ఇచ్చే ఈ జీవన విధానాన్ని మన పూర్వీకులు మనకు అందించారు. ప్రకృతి ఒడిలో జీవిస్తూ ఆరోగ్యమే మహాభాగ్యం అనే మాటను ప్రతి ఒక్కరూ నిజం చేయాలి" అని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ మాట్లాడుతూ... విశ్వవ్యాప్తంగా యోగాకు వస్తున్న గుర్తింపు మన దేశానికి గర్వకారణమన్నారు. యోగా అనేది మన ప్రాచీన సంస్కృతిలో ఒక భాగమని, నేటి ఆధునిక కాలంలో ప్రతి ఒక్కరికీ శారీరక, ఆరోగ్య చింతన ఎంతో అవసరమని పేర్కొన్నారు. బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు మాట్లాడుతూ... ప్రధాని మోదీ చొరవతోనే 12 సంవత్సరాల క్రితం యోగాకు అంతర్జాతీయంగా గుర్తింపు లభించిందని, నేడు ప్రపంచ దేశాలన్నీ యోగాను అనుసరిస్తున్నాయని గుర్తు చేశారు. డిప్రెషన్ లాంటి సమస్యలను దూరం చేయడానికి యోగా అద్భుతంగా పనిచేస్తుందని, పిల్లల నుండి పెద్దల వరకు అందరూ దీనిని రోజువారీ జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు

## గురవారెడ్డిపై అట్రాసిటీ కేసు

**హైదరాబాద్,(భారత శక్తి)** హైదరాబాద్‌లో వైద్యసర్కిల్‌లో ఊహించని ప్రకంపనలు మొదలయ్యాయి. ఎంతో గౌరప్రదమైన స్థానంలో ఉంటూ లక్షల మందికి సుపరిచితులైన ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ గురువారెడ్డి చిక్కుల్లో పడ్డారు. ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదు అయ్యింది. తనను వేధిస్తున్నారని మరో వైద్యుడు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టారు. జూబ్లీహిల్స్‌లో క్లినిక్ నడుపుతున్న డాక్టర్ సుధీర్ దారా ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. తన వృత్తిపరమైన ప్రతిష్టను దెబ్బతీసేలా, సమాజంలో తనకున్న గౌరవాన్ని భంగపరిచేలా డాక్టర్ సుధీర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారెడ్డి, ఆయన సహచరులు సోషల్ మీడియా వేదికగా నిర్వహించారని, ఈ క్యారెక్టర్ అస్సాసినేషన్ కేవలం ఇంటర్నెట్‌కే పరిమితం కాకుండా తన ప్రాణాలకే ముప్పుగా మారిందని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు తనపై దాడి చేయడానికి వచ్చారని వెల్లడించారు. డాక్టర్ సుధీర్ ఇచ్చిన రాతపూర్వక ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 36పరిధిలో క్లినిక్ నడుపుతున్న డాక్టర్ సుధీర్, గత కొంతకాలంగా ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లలో తనపై జరుగుతున్న సైబర్ బుల్లీయింగ్ పూర్తిగా ఆధారాలతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారెడ్డి సోషల్ మీడియాలో తనకున్న ఫాలోయింగ్‌ను ఉపయోగించుకొని, సుధీర్ దారా క్లినిక్, వ్యక్తిగత సామర్థ్యంపై తప్పుడు ఆరోపణలు గుప్పించారని, దీని వెనుక పెద్ద ప్రొఫెషనల్ రైవల్రీ ఉందని అనుమానం వ్యక్తం చేశారు

## విద్యార్థులకు రుచికరమైన భోజనం పెట్టాలి






**సిద్దిపేట(భారత శక్తి)** ప్రభుత్వ విద్యా సంస్థలలో మెనూ పాటిస్తూ విద్యార్థులకు రుచికరమైన భోజనం పెట్టాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి సంబంధిత అధికారులను ఆదేశించారు. కొండపాక మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్న భోజన ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అన్నం, పప్పు, బెండకాయ, సాంబారు,రసం,గుడ్డులను పరిశీలిస్తూ రసం నాణ్యత మెరుగు పరచాలని పచ్చిపులుసు లాగా చెయ్యకూడదని వంట సిబ్బందిని హెచ్చరించారు. వంట గది పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, రోజు కామన్ డైట్ మెనూ పాటిస్తూ వంట రుచికరంగా పెట్టాలని, విద్యార్థులకు చదువుతో పాటు భోజనం, వసతిలో ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఎస్ఓ ను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఏంఈఓ శ్రీనివాస్ రెడ్డి,ఎస్ఓ, తదితరులు ఉన్నారు.

# భారీగా తగ్గిన రిజిస్ట్రేషన్లు

**కరీంనగర్(భారత శక్తి)** తెలంగాణ ప్రభుత్వం జూన్ 5 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసిన భూముల మార్కెట్ విలువల సవరణ ప్రభావం ద్వితీయ శ్రేణి నగరాలపై తీవ్రంగా పడింది. రాజధాని హైదరాబాద్ వెలుపల రియల్ ఎస్టేట్ రంగానికి ప్రధాన కేంద్రాలుగా ఉన్న ఖమ్మం, వరంగల్, కరీంనగర్ వంటి నగరాల్లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ప్రస్తుతం జనాలు లేక వెలవెలబోతున్నాయి. గతంలో మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగిన ఓపెన్ ప్లాట్లు, విల్లాలు, అపార్ట్‌మెంట్ల కొనుగోళ్లు.. ఈ ఆకస్మిక ఫీజుల పెంపుతో ఒక్కసారిగా చల్లబడ్డాయి. క్షేత్రస్థాయిలో పెరిగిన ధరల భారాన్ని భరించలేక అటు కొనుగోలుదారులు, ఇటు వెంచర్ల నిర్వాహకులు రిజిస్ట్రేషన్లకు దూరంగా ఉంటున్నారు.గత ఆరేడేళ్ల కాలంలో ఈ నగరాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం భారీ ఎత్తున ఊపందుకుంది. ప్రతి రోజూ వందలాది డాక్యుమెంట్లు, కొత్త వెంచర్ల రిజిస్ట్రేషన్లతో స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖకు కాసుల వర్షం కురిసేది. కానీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మార్కెట్ విలువను ఒకేసారి భారీగా పెంచడంతో సీన్ పూర్తిగా రివర్స్ అయింది. రిజిస్ట్రేషన్ల శాతం మారకపోయినా.. భూమి ప్రాథమిక ప్రభుత్వ ధర ను పెంచేయడం వల్ల డాక్యుమెంట్‌కు చెల్లించాల్సిన అసలు రుసుము కొండెక్కి కూర్చుంది. దీనివల్ల మధ్యతరగతి ప్రజలు తమ సొంతింటి కలలను తాత్కాలికంగా వాయిదా వేసుకుంటున్నారు.ఈ మార్కెట్ విలువ పెంపు ఏ స్థాయిలో ఉందో ఖమ్మం నగర పరిసరాల గణాంకాలను గమనిస్తే స్పష్టమవుతోంది. ఖమ్మం శివార్లలోని వేగంగా అభివృద్ధి చెందుతున్న కొన్ని ప్రధాన లేఅవుట్లలో గతంలో ప్రభుత్వ గజం ధర రూ. 4,100 గా ఉండేది. కానీ కొత్త సవరణల ప్రకారం.. ఆ ధరను ఒకేసారి ఏకంగా రూ. 6,200 కు పెంచేశారు. గజానికి రూ. 2,100 పైగా పెరగడంతో, ఒక సాధారణ 200 గజాల ప్లాట్ కొనే సామాన్యుడు కూడా ఇప్పుడు ప్రభుత్వం నిర్దేశించిన 7.5 శాతం చొప్పున వేల రూపాయల అదనపు భారాన్ని భరించాల్సి వస్తోంది. ఇదే పరిస్థితి వరంగల్, కరీంనగర్ స్మార్ట్ సిటీ పరిధిలోని ల్యాండ్ వాల్యూస్‌లోనూ కనిపిస్తోంది.ఈ రేట్ల పెంపు అమల్లోకి వచ్చిన మొదటి రోజే రాష్ట్రవ్యాప్తంగా రిజిస్ట్రేషన్ల ఆదాయం రూ. 73 కోట్ల నుండి రూ. 45 కోట్లకు పడిపోవడం రియల్ ఎస్టేట్ మందగమనానికి అద్దం పడుతోంది. ఖమ్మం, కరీంనగర్, వరంగల్ వంటి ప్రాంతాల్లో మార్కెట్ రేట్లకు, ప్రభుత్వ రేట్లకు మధ్య వ్యత్యాసం పెరిగిపోవడంతో చాలా చోట్ల ట్రేడింగ్ నిలిచిపోయింది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి నగరాల పరిధిలో పెంచిన గైడెన్స్ రేట్లను పునఃసమీక్షించాలని లేదా రియల్ ఎస్టేట్ అసోసియేషన్లు డిమాండ్ చేస్తున్నట్లు రిజిస్ట్రేషన్ ఛార్జీలను తగ్గించాలని స్థానిక బిల్డర్లు కోరుతున్నారు.

## రియల్ ఎస్టేట్‌లోఅవినీతి సొమ్ముతో

# కొంటున్న ఆనకొండలు

**హైదరాబాద్(భారత శక్తి)** దేశంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న మెట్రో నగరాల్లో ఒకటైన హైదరాబాద్ స్థిరాస్తి మార్కెట్, ముఖ్యంగా లగ్జరీ హౌసింగ్ విభాగం ప్రస్తుతం విస్మయపరిచే స్థాయి ధరలతో దూసుకుపోతోంది.

గచ్చిబౌలి, మాధాపూర్, కోకాపేట, రాయదుర్గం వంటి ప్రాంతాల్లో రూ. 10 కోట్ల నుండి రూ. 50 కోట్ల విలువైన విల్లాలు, సూపర్ లగ్జరీ అపార్ట్‌మెంట్‌లు హాట్ కేకుల్లా అమ్ముడవుతుండటం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. అయితే, ఈ అసాధారణ వృద్ధి వెనుక అసలు కొనుగోలుదారులు ఎవరు? అంత మొత్తం ఎక్కడి నుండి వస్తోంది? అనే అంశంపై ఆర్థిక, రాజకీయ వర్గాల్లో ఒక లోతైన చర్చ నడుస్తోంది. ఈ మార్కెట్‌ను నడిపిస్తున్నది కేవలం ప్రవాస భారతీయులు , నిజాయితీ గల వ్యాపారవేత్తలు మాత్రమే కాదని.. ఇందులో పెద్ద ఎత్తున అవినీతి సొమ్ము నిక్షిప్తమై ఉందని ఇటీవల ఏసీబీ దాడుల్లో దొరుకుతున్న ఆస్తుల వివరాలు వెల్లడిస్తున్నాయి.పక్కా బిజినెస్ మైండ్ ఉన్న ఏ నిజమైన వ్యాపారవేత్త కూడా యాభై కోట్ల రూపాయల భారీ నగదును తెచ్చి ఒకే ఒక లగ్జరీ ఇల్లు లేదా అపార్ట్‌మెంట్‌పై గుడ్డిగా పెట్టుబడి పెట్టడు. ఎందుకంటే, అంత పెద్ద మొత్తాన్ని తమ సొంత వ్యాపారాల్లోనో, స్టార్టప్‌లలోనో లేదా గ్లోబల్ ఈక్విటీ మార్కెట్లలోనో మళ్లిస్తే వచ్చే రాబడి చాలా రెట్లు ఎక్కువగా ఉంటుంది. వ్యాపారులు తమ నివాసం కోసం ఒక సారే లగ్జరీ ఇల్లు కొంటారు కానీ.. కేవలం నెలకు కొన్ని లక్షల రూపాయల అద్దె కోసం రూ. 20 కోట్ల నుండి రూ. 50 కోట్లు బ్లాక్ చేయరు. లగ్జరీ నివాస రంగంలో వార్షిక అద్దె రాబడి కేవలం 2 నుండి 3 శాతానికి మించి ఉండదు. ఇంత తక్కువ రాబడికి ఆశపడి ఏ అచ్చమైన వ్యాపారీ కోట్ల కొద్దీ సత్సంపాదనను ఇక్కడ స్తంభింపజేయడు.హైదరాబాద్ లగ్జరీ రియల్ మార్కెట్‌లో ఊహాజనితంగా పెరుగుతున్న ధరలకు ప్రధాన కారణం అవినీతి సొమ్ము , లెక్కల్లోకి రాని బ్లాక్ మనీ . పన్నుల పరిధిలోకి రాని నల్లధనాన్ని, అవినీతి ద్వారా ఆర్జించిన సొమ్మును సురక్షితంగా దాచుకోవడానికి బడా బాబులు, కొందరు రాజకీయ నేతలు, బ్యూరోక్రాట్లు రియల్ ఎస్టేట్ రంగాన్ని ఒక సేఫ్ హెవెన్ లా వాడుకుంటున్నారు.

బినామీల పేరిట, వివిధ అక్రమ మార్గాల ద్వారా ఈ నిధులు లగ్జరీ ప్రాజెక్టుల్లోకి ప్రవహిస్తున్నాయి. ఈ తరహా కృత్రిమ డిమాండ్ ల్లే సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఇళ్లు దొరకని పరిస్థితి ఏర్పడుతోంది. ఒకవేళ ఈ అవినీతి సొమ్ము ప్రవాహం గనుక ఆగిపోతే.. రియల్ ఎస్టేట్ మార్కెట్ ఒక్కసారిగా స్థిరపడి పూర్తిగా క్లీన్ అయ్యే అవకాశం ఉంది.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు , దర్యాప్తు సంస్థలు రంగంలోకి దిగాల్సిన అవసరం ఉంది. హైదరాబాద్ ఐటీ కారిడార్ చుట్టుపక్కల రూ. 10 కోట్లకు పైబడి జరుగుతున్న ప్రతి లగ్జరీ రియల్ ఎస్టేట్ లావాదేవీని, కొనుగోలుదారుల పూర్తి వివరాలను దర్యాప్తు సంస్థలు సేకరించి క్రాస్-వెరిఫై చేయాలి. సదరు కొనుగోలుదారుల అధికారిక వార్షిక ఆదాయం ఎంత? వారు చెల్లిస్తున్న పన్నులకు, కొనుగోలు చేసిన ఆస్తి విలువకు పొంతన ఉందా? లేదా? అని క్షుణ్ణంగా దర్యాప్తు చేస్తే అసలు నిజాలు, బినామీల గుట్టు రట్టవుతాయి. పారదర్శకమైన ఇటువంటి ఆడిటింగ్ వ్యవస్థను తీసుకువచ్చినప్పుడే, హైదరాబాద్ రియల్ రంగానికి పట్టిన అవినీతి చీడ వదిలి.. మార్కెట్ నిజమైన కొనుగోలుదారులకు అందుబాటులోకి వస్తుంది

# ఎస్ బీఐ వర్సెస్ ప్రభుత్వం

**హైదరాబాద్(భారత శక్తి)** రాయదుర్గం భూముల విషయంలో ఎస్‌బీఐ, రాష్ట్ర ప్రభుత్వం మధ్య వివాదం రోజురోజుకూ తీవ్రం అవుతోంది. ఆ భూమి తమదే అంటూ ఎస్‌బీఐ హైకోర్టును ఆశ్రయించగా.. ధర్మాసనం స్టే ఇచ్చింది. ఈ క్రమంలోనే ఎస్‌బీఐ తీరుపై రేవంత్ సర్కార్ తీవ్రంగా మండిపడింది. ఆ భూమిని తాము గతంలోనే కొన్నామని.. అందులో కొంత భాగం తమదేనని కోర్టును ఆశ్రయించింది. ఈ వివాదంతో ప్రభుత్వానికి ఎస్‌బీఐలో ఉన్న అకౌంట్లను ఇతర బ్యాంకులకు మార్చాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.

రాయదుర్గం భూముల వేలం ధరతో మాత్రమే కాకుండా.. వివాదాలతోనూ ఇప్పుడు దేశవ్యాప్తంగా వార్తల్లో నిలిచింది. వేలంలో ఎకరం ధర రూ.237 కోట్లు పలికి.. అందర్నీ ఆశ్చర్యానికి గురి చేసిన ఈ భూములపై స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) రంగంలోకి దిగింది. రాయదుర్గం నాలెడ్జ్ సిటీ పరిధిలో ఉన్న భూములను రాష్ట్ర ప్రభుత్వం వేలం వేయగా.. అది తమ భూమే అని పేర్కొంటూ.. తెలంగాణ హైకోర్టులో ఎస్‌బీఐ రిట్ పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు.. ఈ వేలం ప్రక్రియపై స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ).. ఇటీవల గత నెల 28వ తేదీన రాయదుర్గంలోని సర్వే నంబర్ 83/1లోని అత్యంత విలువైన 11.38 ఎకరాల భూమిని వేలం వేయగా.. రూ.2,529 కోట్లు రాష్ట్ర ఖజానాకు చేరాయి. అయితే అందులో 5.09 ఎకరాలు తమ భూమి ఉందంటూ ఇప్పుడు ఎస్‌బీఐ పేర్కొంటోంది. 2010లోనే ఆ భూమిని రూ.13.33 కోట్లకు తాము కొనుగోలు చేశామని ఎస్‌బీఐ వాదిస్తోంది. ఈ భూములను వేలంలో గౌరా వెంచర్స్ అనే సంస్థ ఎకరం భూమిని రూ.237 కోట్ల చొప్పున దక్కించుకుంది.ఈ నేపథ్యంలోనే ఎస్‌బీఐ వైఖరిపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం సీరియస్ అయింది.

రాయదుర్గం భూముల వేలంలో నిబంధనలు ఉల్లంఘించింది ఎస్‌బీఐ అని ఆరోపిస్తోంది. ఈ భూముల వేలంపై ఎస్‌బీఐ, రాష్ట్ర ప్రభుత్వం మధ్య తలెత్తిన వివాదం తీవ్ర పరిణామాలకు దారితీసేలా కనిపిస్తోంది. ఎస్‌బీఐతో రాష్ట్ర ప్రభుత్వానికి ముడిపడి ఉన్న ఆర్థిక సంబంధాలపై పునఃసమీక్ష చేయాలలని రేవంత్ సర్కార్ యోచిస్తోంది. ఎస్‌బీఓలో రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న డిపాజిట్లు, అకౌంట్ల వివరాల సేకరణ, ప్రభుత్వ అకౌంట్లను వేరే బ్యాంకులకు మార్చే అంశాలపై ప్రభుత్వం పునరాలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. అదే జరిగితే ఎస్‌బీఐకి భారీ షాక్ తగలనుందని నిపుణులు పేర్కొంటున్నారు.ఎస్‌బీఐ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను విచారించిన హైకోర్టు.. టీజీఐఐసీ నిర్వహించిన భూముల వేలం ప్రక్రియపై 3 వారాల పాటు స్టే విధిస్తూ తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఈ వివాదం వెనుక సుదీర్ఘ చరిత్ర ఉంది. గతంలో 2010లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాయదుర్గంలోని సర్వే నంబర్ 83/1లో గల 5 ఎకరాలను అప్పటి స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ (ఎస్‌బీహెచ్)కు కేటాయించింది. ఆ తర్వాత ఎస్‌బీహెచ్ కాస్తా ఎస్బీఐలో విలీనమైంది. ఆ భూమిని ఆఫీస్ కాంప్లెక్స్, ఐటీ భవనాల కోసం కేటాయించినప్పుడు.. బ్యాంక్ యాజమాన్యం అప్పట్లోనే రూ.13.33 కోట్లు, ఇతర ఫీజులను ఏపీఐఐసీకి అధికారికంగా చెల్లించింది. దీనికి 2011లోనే ఇరుపక్షాల మధ్య సేల్ అగ్రిమెంట్ కూడా పూర్తి అయింది. ఆ స్థలంలో ఒక ఎస్‌బీఐ బ్రాంచ్‌తోపాటు మూడు ఏటీఎంలను కూడా నిర్మించింది.

# గ్రేటర్‌లో ఎన్నికలకు జనసేన కసరత్తు

**హైదరాబాద్ (భారత శక్తి):** తెలంగాణలో పోటీ చేస్తామని ప్రకటించిన పవన్ కళ్యాణ్.. ఆ దిశగా చర్యలు చేపట్టారు. ఈ క్రమంలోనే ఇప్పటికే హైదరాబాద్‌లో జనసేన పార్టీ కార్యాలయం ఉండగా.. తాజాగా మరో కొత్త పార్టీ ఆఫీస్‌ను ప్రారంభించనున్నారు. తెలంగాణలో జనసేనను బలోపేతం చేయడంలో భాగంగా మణికొండలో నిర్మించిన పార్టీ కార్యాలయాన్ని నిర్మించారు. ఇక రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో జనసేన బరిలో ఉంటామని ప్రకటించిన పవన్.. కసరత్తు మొదలుపెట్టారు.ఆంధ్రప్రదేశ్‌లో జనసేన పార్టీ అధికార కూటమిలో భాగం కాగా.. ఆ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఉపముఖ్యమంత్రి పదవిలో ఉన్నారు. ఈ క్రమంలోనే ఇటీవలి కాలంలో తెలంగాణలో జనసేన పార్టీని బలోపేతం చేయడంపై దృష్టి పెట్టారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో జనసేన పార్టీ సభ నిర్వహణకు పోలీసులు, హైకోర్టు అనుమతులు ఇవ్వకపోవడం.. అధికార కాంగ్రెస్ నేతలు తీవ్ర విమర్శలు చేయడంతో.. వాటన్నింటికీ సమాధానంగా.. తెలంగాణలో జనసేన పార్టీ ఉంటుందని తేల్చి చెప్పిన పవన్ కళ్యాణ్.. ఏ పార్టీ కలిసి వచ్చినా, రాకపోయినా.. ఒంటరిగానైనా బరిలోకి దిగుతామని స్పష్టం చేసిన సంగతి తెలిసిందే.ఈ క్రమంలోనే తెలంగాణలోనూ జనసేన పార్టీకి క్షేత్రస్థాయిలో బలం పెంచేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే తెలంగాణపై జనసేన పార్టీ ఫుల్ ఫోకస్ పెట్టింది. ఇటీవలి కాలంలో పవన్ కళ్యాణ్ హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్ పెట్టడం, ఆ తర్వాత ఢిల్లీలో జరిగిన సేన ప్రస్థానం కార్యక్రమంలో తెలంగాణ గురించి ప్రస్తావించడం.. హనుమకొండలో తన అభిమాని నిరంజన్‌ను కలవడం వంటి వరుస సంఘటనలతో.. పవన్ కళ్యాణ్ తెలంగాణపై దృష్టి పెట్టినట్లు స్పష్టంగా అర్థం అవుతోంది. దీంతో తెలంగాణ జనసేన నేతల్లో సరికొత్త ఉత్సాహం నెలకొంది.ఇందులో భాగంగానే రాష్ట్రంలో జనసేన పార్టీని విస్తరించడంలో భాగంగా హైదరాబాద్ మణికొండలో కొత్తగా నిర్మించిన జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయం పనిచేయనుంది. రానున్న గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ఎన్నికల్లో పోటీ చేయడమే లక్ష్యంగా జనసేన పార్టీని బలోపేతం చేయడంతోపాటు.. పార్టీ సంస్థాగత నిర్మాణం కోసం ఈ కొత్త ఆఫీసును ప్రారంభించనున్నట్లు జనసేన వర్గాలు చెబుతున్నాయి.తెలంగాణలో జనసేన పార్టీని బలోపేతం చేసేందుకు తానే స్వయంగా రంగంలోకి దిగుతానని ఇప్పటికే పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే కొత్త ఆఫీస్ ప్రారంభోత్సవం సందర్భంగా పవన్ కళ్యాణ్ ఏం మాట్లాడనున్నారు అనేది ఇప్పుడు సర్వత్రా ఆసక్తికరంగా మారింది. ఇక ఇప్పటికే పవన్ కళ్యాణ్ చేస్తున్న వ్యాఖ్యలు, ఆయన పర్యటనలపై తెలంగాణ కాంగ్రెస్ నేతలు తీవ్ర విమర్శలు గుప్పిస్తుండగా.. తాజాగా జనసేన పార్టీ ఆఫీస్ ప్రారంభోత్సవం గురించి ఎలా స్పందిస్తారోననే ఉత్కంఠ నెలకొంది

**పక్కా ప్లాన్ తోజనసేనాని** : తెలంగాణ రాజకీయాల్లో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇటీవల ప్రకంపనలు సృష్టించారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం నాడు ఆయన తలపెట్టిన సభను కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకుంది. మరోవైపు కవితతో పాటు భారత రాష్ట్ర సమితి నేతలు సైతం టార్గెట్ చేసుకున్నారు. వారిలో ఒక రకమైన భయం కనిపించింది పవన్ కళ్యాణ్ ద్వారా. ఇప్పుడు అదే నిజం చేస్తున్నారు పవన్.

తెలంగాణ రాజకీయాల వైపు తొంగి చూస్తున్నారు. అక్కడే ఉండి రాజకీయాలు చేయనున్నారు. హైదరాబాదులో పార్టీ తెలంగాణ కార్యాలయాన్ని అందుబాటులోకి తెస్తున్నారు. ఈరోజు హైదరాబాద్ ఐటీ కారిడార్ మణికొండలో నూతనంగా నిర్మించిన జనసేన తెలంగాణ రాష్ట్ర కేంద్ర కార్యాలయాన్ని పవన్ కళ్యాణ్ ప్రారంభించనున్నారు. ఇప్పటివరకు పొత్తు ద్వారా, సోషల్ మీడియా ద్వారా తెలంగాణలో ప్రాభవాన్ని చాటుకున్న జనసేన.. పార్టీ కార్యాలయాన్ని అందుబాటులోకి తేవడం ద్వారా తెలంగాణ గడ్డపై సరికొత్త రాజకీయ ప్రస్తానానికి.. అధికారికంగా శ్రీకారం చుట్టబోతుందన్నమాట. × తెలంగాణ నేతల్లో ఆ భయం.. తెలంగాణ రాజకీయ పార్టీల నేతలకు పవన్ కళ్యాణ్ విషయంలో ఒక ఆందోళన ఉంది.. ఏపీలో సైతం పవన్ కళ్యాణ్ చాలా సుదీర్ఘంగా పోరాడి శత శాతం విజయం సాధించారు. ఇక్కడ కూడా అటువంటి ప్రణాళిక రూపొందిస్తే తమకు ఇబ్బందులు తప్పవు అని భయపడుతున్నారు. తెలంగాణ ఆవిర్భావ దినం నాడు హైదరాబాదులో ప్రెస్మీట్లో గట్టిగానే సంకేతాలు పంపారు పవన్. రాబోయే ఎన్నికల్లో జనసేన పూర్తిస్థాయిలో బరిలో దిగుతుందని.. ఇక్కడి క్యాడర్ క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేస్తామని అధికారికంగా ప్రకటించారు. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా.. ఇప్పుడు ఏకంగా పార్టీ రాష్ట్ర కార్యాలయాన్ని అందుబాటులోకి తీసుకురావడం ద్వారా తెలంగాణ రాజకీయాల్లో సీరియస్ గా దృష్టి పెట్టబోతున్నట్లు స్పష్టమైన సంకేతాలు పంపగలిగారు. × ప్రజల వైఖరిలో మార్పు.. గతం కంటే తెలంగాణ ప్రజల వైఖరిలో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. గతంలో ప్రత్యేక రాష్ట సెంటిమెంట్ ఎక్కువగా ఉండేది. కానీ ఇప్పుడు మాత్రం ప్రజలు అభివృద్ధికి, సమకాలిన అంశాలకు ఎక్కువగా ప్రాధాన్యమిస్తున్నారు. పైగా తెలంగాణలో ప్రస్తుతం రాజకీయ శూన్యత ఉంది. దానిని భర్తీ చేయడమే అజెండాగా జనసేన పని చేయనుంది.

భారత రాష్ట్ర సమితి వరుస అపజయాలతో ఇబ్బంది పడుతోంది. అధికార కాంగ్రెస్ పార్టీ పట్ల కొన్ని వర్గాల్లో అసంతృప్తి ఉంది. బిజెపి బలం పుంజుకున్నప్పటికీ నాయకత్వం సమస్య వెంటాడుతోంది. ఇటువంటి తరుణంలో ఏపీ మాదిరిగా తెలంగాణలో సైతం జనసేన ప్రత్యేక ఓటు బ్యాంకు కొల్లగొట్టాలని చూస్తోంది. ముఖ్యంగా గ్రేటర్ పరిధిలో సెటిలర్స్, ఉద్యోగులు ఉన్న ప్రాంతాల్లో జనసేన బలం పెంచుకోవాలని భావిస్తోంది. యువతతో పాటు విద్యార్థుల ఓట్లపై గురిపెడుతోంది. సమయం కేటాయింపు.. ప్రస్తుతం ఏపీ డిప్యూటీ సీఎం గా పవన్ కళ్యాణ్ ఉన్నారు. కీలక మంత్రిత్వ శాఖలను నిర్వహిస్తున్నారు. అయితే హైదరాబాదులో నివాసం ఉన్న దృష్ట్యా అక్కడి నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. అందుకే వారంలో ఒకరోజు తెలంగాణ కార్యకలాపాలకు కేటాయించే అవకాశం ఉంది. వారాంతంలో షెడ్యూల్ తెలంగాణ కార్యాలయానికి కేటాయిస్తారని సమాచారం. రాబోయే రోజుల్లో తెలంగాణలో ఒక బలమైన ప్రత్యామ్నాయ శక్తిగా జనసేన మారే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి. చూడాలి

## మూడేళ్లుగా ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వం

**మేడ్చల్ (భారత శక్తి)**చింతల్ లోని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కేపీ వివేకానంద మీడియా సమావేశం నిర్వహించారు. అమలు కానీ హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మూడేళ్లుగా మోసం చేస్తుందని మండి పడ్డారు. రాష్ట్ర నాయకుల మాట నమ్మకం లేక రాహుల్ గాంధీ ని రాష్ట్రానికి తీసుకొచ్చి రైతులకు డిక్లరేషన్ ఇస్తామని ..అధికారం లోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇవ్వాళ రైతుల ఉసురు తీస్తుంది అన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా వారి ప్రాణాలను తీస్తుంది. వ్యవసాయం కోసం బి ఆర్ ఎస్ ప్రభుత్వం చేపట్టిన పథకాలను రద్దు చేసి, రైతుల ను నిండా ముంచిన ఘనత ఈ కాంగ్రెస్ ప్రభుత్వానిది. రైతుబంధు వేయలేక,వ్యవసాయానికి అవసరమైన ఎరువులు ఇవ్వలేక రైతులను మోసం చేస్తుంది కాంగ్రెస్ ప్రభుత్వమని ఆరోపించారు.రైతు బీమా పథకాన్ని ప్రతి ఒక్కరికి అందేలా చేయాలి.లేదంటే రైతుల తరుపున బి ఆర్ ఎస్ పార్టీ పోరాటం చేస్తుందని అన్నారు.

## గుండ్ల సింగారంలో ఉద్రిక్తత..

# 360 గుడిసెల తొలగింపు

**హన్మకొండ (భారత శక్తి)**హనుమకొండ గుండ్ల సింగారంలో లిక్కర్ ప్లాంట్ సమీపంలో సర్వే నంబర్ 174లో ఐదేళ్లుగా సుమారు 360 కుటుంబాలు నివసిస్తున్నాయి.శనివారం తెల్లవారుజామున 5 గంటలకు జేసీబీ లతో గుడిసెలను అధికారులు నేలమట్టం చేసారు. ఆధార్, ఓటర్, రేషన్ కార్డులు పొంది ఇక్కడే జీవిస్తున్నామని బాధితులు ఆవేదన వ్యక్తం చేసారు. నిరసన తెలిపిన సుమారు 30 మందిని పోలీసులు కేయూ పోలీస్ స్టేషన్ కు తరలించినట్లు సమాచారం

## యోగా కార్యక్రమం ఏర్పాట్లను

# పరిశీలించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**సికింద్రాబాద్(భారత శక్తి)** ఆదివారం జరగబోయే యోగా దినోత్సవ 24గంటల కౌంట్ డౌన్ కు సంబంధించి కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి పరేడ్ మైదానంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు.రేపు ఉదయం 5:30 నిమిషాలకు ప్రారంభం కానున్న యోగ దినోత్సవానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, పలువురు సినీ, క్రీడా,రాజకీయ ప్రముఖులు హాజరుకానున్నట్లు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. 2014 లో ఐక్యరాజ్యసమితి జూన్ 21 రోజును అంతర్జాతీయ యోగా దినోత్సవం గా ప్రకటించినప్పటి నుండి ప్రపంచవ్యాప్తంగా యోగా దినోత్సవాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్రపంచవ్యాప్తంగా భారత విదేశాంగ శాఖ కార్యాలయాలు ఉన్న వివిధ దేశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. యోగ అనేది మానవ జీవితంలో అత్యంత ప్రాధాన్యతతో కూడుకున్న అంశమని ఆయన అన్నారు. భారతీయ అతి ప్రాచీన సంస్కృతిలో భాగంగా ఉన్న యోగాను ప్రధాని మోడీ ప్రపంచానికి పరిచయం చేశారని స్పష్టం చేశారు. మానసిక ప్రశాంతతకు శారీరక ఉల్లాసానికి యోగ ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ యోగా రోజున విధిగా యోగా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. యోగ దినోత్సవం కార్యక్రమానికి విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు సామాజిక కార్యకర్తలు ఆరోగ్య నిపుణులు హాజరుకానున్నట్లు వెల్లడించారు.

# ఆమె పదవి.. ఆయన పెత్తనం..

**ఖమ్మం (భారత శక్తి)** వైరా మున్సిపల్ కౌన్సిల్ సమావే శానికి భార్యల వెంట భర్తలు వచ్చారు. ఐదుగురు మునిసిపల్ కౌన్సిలర్ భర్తలు చైర్మన్ భర్త సమావేశంకు హాజరు అయ్యారు. కమిషనర్ రామచంద్రరావు సమావేశంలో చూసి చూడనట్లు వ్యవహరించడం విశేషం.

చైర్మన్ కాప చంద్రకళ, కమిషనర్ రామచంద్రరావు ఆధ్వర్యంలో 89 అంశాలపై ఎజెండా ప్రవేశ పెట్టగా అందులో అధికార పార్టీ వివక్ష తో 79 అంశాలను సానుకూల స్పందనతో 11 అంశాలను తిరస్కరించారు.

రెండవ సాధారణ సమావేశం నిర్వహించడంతో తమ వార్డులకు నిధులు ఇవ్వడం లేదని మహిళా కౌన్సిలర్ నిలదీసారు. చైర్మన్ భర్త కాప మురళీకృష్ణ జోక్యం చేసుకొని మహిళ కౌన్సిలర్ కు వేలు చూపించి వ్యవహరించడంతో రగడ మొదలయింది. ఆపై వచ్చిన మిగతా కాంగ్రెస్ మహిళకౌన్సిల్ భర్తలు మండిపడడంతో సమావేశాన్ని ముగించారు

## తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా

# స్తంభించిన యూరియా యాప్

**- ఆందోళనలో అన్నదాతలు**

**హైదరాబాద్ (భారత శక్తి)**శనివారం నాడు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా యూరియా యాప్ స్థంభించింది. ఎన్నిసార్లు ఓపెన్ చేసినా నాట్ ఫౌండ్, ఎర్రర్ అంటూ యూరియా బుకింగ్ యాప్ మొరాయించింది. యాప్ వైఫల్యంతో రైతులు గంటల తరబడి మొబైల్స్ ముందే పడిగాపులు కాసారు. యాప్ను వెంటనే రద్దు చేసి యూరియా అందించాలని డిమాండ్ చేసారు.

## యోగాను జీవితంలో

# భాగం చేసుకోవాలి

**- అపోలోలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం**

**- ముగింపు వేడుకల్లో వైస్ ఛాన్సలర్ డాక్టర్ హెచ్. వినోద్ భట్ పిలుపు**



**చిత్తూరు(భారత శక్తి)** యోగా అనేది కేవలం వ్యాయామం మాత్రమే కాదని, ఆరోగ్యవంతమైన జీవనశైలికి మార్గదర్శకమని ది అపోలో యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ హెచ్. వినోద్ భట్ అన్నారు. ప్రతి ఒక్కరూ యోగాను నిత్య జీవితంలో భాగంగా మార్చుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అపోలో నాలెడ్జ్ సిటీలో శనివారం నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవ ముగింపు వేడుకల్లో వైస్ ఛాన్సలర్ డిజిగ్నేట్ డాక్టర్ నితిన్ ఎం. నాగర్కర్‌తో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు.ప్రతిరోజూ సూర్యోదయానికి ముందు కొద్దిసేపైనా యోగాభ్యాసం ప్రారంభించి, క్రమంగా 45 నిమిషాల పాటు సాధన చేస్తే శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత కూడా లభిస్తుందని చెప్పారు. యోగా మనస్సు, శరీరం, ఆలోచనల మధ్య సమతుల్యతను పెంపొందిస్తుందని, క్రమశిక్షణతో కూడిన జీవన విధానాన్ని అలవర్చుతుందని వివరించారు.

ఆరోగ్య పరిరక్షణలో అపోలో సంస్థలు యోగాకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నాయని, ఈ కార్యక్రమాల్లో ఈషా ఫౌండేషన్ భాగస్వామ్యం కావడం సంతోషకరమన్నారు.అపోలో నాలెడ్జ్ సిటీ యోగా అండ్ మెడిటేషన్ క్లబ్ ఆధ్వర్యంలో జూన్ 10 నుంచి 20 వరకు నిర్వహించిన యోగా ఉత్సవాలు విజయవంతంగా ముగిశాయి. ముగింపు కార్యక్రమాన్ని యోగా యాంథమ్‌తో ప్రారంభించగా, స్కూల్ ఆఫ్ హెల్త్ సైన్సెస్ అసిస్టెంట్ డీన్, యోగా అండ్ మెడిటేషన్ క్లబ్ ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ డాక్టర్ కవిత గత పది రోజుల కార్యక్రమాలపై నివేదిక సమర్పించారు. యోగా అవగాహన కార్యక్రమాలు, సాధన శిబిరాలు, సూర్య నమస్కార ఛాలెంజ్, క్యాంపస్ యోగా రీల్ ఛాలెంజ్‌లలో విద్యార్థులు, అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొన్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా సూర్య నమస్కార ఛాలెంజ్?2026, క్యాంపస్ యోగా రీల్ ఛాలెంజ్?2026 విజేతలకు వైస్ ఛాన్సలర్ డాక్టర్ హెచ్. వినోద్ భట్, వైస్ ఛాన్సలర్ డిజిగ్నేట్ డాక్టర్ నితిన్ ఎం. నాగర్కర్‌లు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు.కార్యక్రమంలో రిజిస్ట్రార్ అనిల్‌కుమార్ ఎస్., ఈషా యోగా రిసోర్స్ పర్సన్లు నందకుమార్, ఐశ్వర్య, డీన్‌లు డా. రామయ్య ఇటుమల్ల, డా. డి. జగదీశన్, అపోలో నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపల్ డా. జయంతి, ఫిజికల్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ డైరెక్టర్లు దిలీప్, సుమలత, స్టూడెంట్ అఫైర్స్ అసిస్టెంట్ డైరెక్టర్ డేనియల్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతాంగ సమస్యలపై 30న చలో విజయవాడ

**- బద్వేలు రూరల్ కార్యదర్శి నాగదాసరి ఇమ్మానుయేలు (సిపిఐ)**



**బద్వేలు(భారత శక్తి)** రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమైందని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ రూరల్ కార్యదర్శి నాగ దాసరి ఇమ్మానియేల్ పేర్కొన్నారు శనివారం జేవిభవన్ లో ప్రెస్ మీట్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఇమ్మానియేలు మాట్లాడుతూ అన్ని పంటలకు గిట్టుబాటు ధర, చట్టబద్ధత కల్పించాలని, రైతులకు రెండు లక్షల పంట రుణమాఫీ చేయాలని, అలాగే కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, బ్యాంకు రుణాలు, అన్నదాత సుఖీభవ, పంట బీమా ఇన్పుట్ సబ్సిడీ బకాయలు వెంటనే విడుదల చేయాలన్నారు. ఎరువులు విత్తనాలు డిజిల్ ధరలు తగ్గించాలన్నారు. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా, మరియు, 50 ఏళ్ల పైబడిన రైతులకు 10000 వేలు, నెలసరి పెన్షన్ ఇవ్వాలని ఈనెల 30వ తేదీన విజయవాడ ధర్నా చౌక్ నందు రైతు సంఘం ఆధ్వర్యంలో మహాధర్నా కార్యక్రమం నిర్వహించబడుతున్నదని ఆత్మహత్యలనుండి రైతాంగాన్ని రక్షించుకొనుటకు, మన హక్కుల సాధన కొరకు, బద్వేలు రూరల్ ప్రాంతంలోని రైతులంతా తరలిరావాలని ఆయన రైతులకు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో రూరల్ రైతు నాయకులు, వెంకటరమణ, అబ్రహం, పార్టీ నాయకులు సుధాకర్ ,ప్రసాద్ పాల్గొన్నారు

## విజయవంతంగా రెండో వారంలోకి 'పోలీస్ కంప్లైంట్' చిత్రం




హారర్ థ్రిల్లర్, యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన 'పోలీస్ కంప్లైంట్' చిత్రం విజయవంతంగా రెండో వారంలోకి అడుగుపెట్టింది. సౌత్ ఇండియన్ టాలెంటెడ్ నటి వరలక్ష్మి శరత్‌కుమార్, నవీన్ చంద్ర, కృష్ణ సాయి, రాగిణి ద్వివేది ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రాన్ని ఎంఎస్‌కే ప్రమిద శ్రీ ఫిలిమ్స్ బ్యానర్‌పై బాలకృష్ణ మహారాణా నిర్మించారు. 'అఘోర', 'పౌరుషం', 'ఆప్త', 'దండు', 'రాఘవరెడ్డి', 'ఆదిపర్వం' వంటి చిత్రాలతో క్రియేటివ్ డైరెక్టర్‌గా గుర్తింపు పొందిన సంజీవ్ మేగోటి ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. వివాదాల నడుమ విడుదలైన 'పోలీస్ కంప్లైంట్' చిత్రం అన్ని కేంద్రాల్లో రెండో వారంలోనూ విజయవంతంగా ప్రదర్శించబడుతోందని చిత్రయూనిట్ ఆనందం వ్యక్తం చేసింది. ప్రేక్షకుల ఆదరణతో పలు ప్రాంతాల్లో థియేటర్ల సంఖ్యను కూడా పెంచినట్లు నిర్మాత బాలకృష్ణ మహారాణా తెలిపారు. ముఖ్యంగా దివంగత సూపర్ స్టార్ కృష్ణపై ప్రత్యేకంగా రూపొందించిన స్పెషల్ సాంగ్ అభిమానులను ఎంతగానో ఆకట్టుకుందని ఆయన పేర్కొన్నారు. 'చైన్ రియాక్షన్ ఆఫ్ కర్మ' అనే విభిన్న కాన్సెప్ట్ ఆధారంగా రూపొందిన ఈ చిత్రంలో యాక్షన్ ఎంటర్‌టైన్‌మెంట్‌కు హారర్ థ్రిల్లర్ అంశాలను జోడించామని దర్శకుడు సంజీవ్ మేగోటి తెలిపారు. ప్రేక్షకులకు మునుపెన్నడూ చూడని కొత్త అనుభూతిని అందించేలా కథను మలిచామని, పాత్రల రూపకల్పన కూడా ప్రత్యేకంగా ఉండటంతో అన్ని వర్గాల ప్రేక్షకులను సినిమా అలరిస్తోందని ఆయన అన్నారు. యాక్షన్, కామెడీ, రొమాన్స్, థ్రిల్లర్ అంశాల సమ్మేళనంగా రూపొందిన ఈ చిత్రంలో వరలక్ష్మి శరత్‌కుమార్, నవీన్ చంద్ర, కృష్ణ సాయి, రాగిణి ద్వివేది, ఆదిత్య ఓం, రవిశంకర్, పృథ్వీ, శ్రీనివాస్ రెడ్డి, సప్తగిరి, కృతివర్మ, ప్రీతీ సుందర్, శరత్ లోహితశ్వ, జెమినీ సురేష్, దిల్ రమేష్, సత్తెన్న, విజయభాస్కర్, మధు నంబియార్, అనిల్ రాజ్, శ్రీహర్ష, దేవేందర్, పుష్పారామ్, డీఎస్పీ తదితరులు నటించారు.

దాదాపు 52 మంది సీనియర్ ఆర్టిస్టులు నటించిన ఈ యాక్షన్ థ్రిల్లర్‌లో ఎస్.ఎన్. హరీష్ సొండెకొప్ప సినిమాటోగ్రఫీ, డ్రాగన్ ప్రకాష్‌రవితేజ రూపొందించిన యాక్షన్ సన్నివేశాలు ప్రధాన ఆకర్షణలుగా నిలిచాయని చిత్ర బృందం తెలిపింది. విభిన్నమైన కథా నేపథ్యం, బలమైన నటీనటుల సమాహారం, థ్రిల్లింగ్ అంశాలు ఈ చిత్ర విజయానికి ప్రధాన కారణాలుగా నిలిచాయని దర్శకుడు సంజీవ్ మేగోటి పేర్కొన్నారు.

## 'అథిరడి' మూవీ రివ్యూ!



'అథిరడి' ఓ మలయాళ సినిమా. బాసిల్ జోసెఫ్ .. టోవినో థామస్ ప్రధానమైన పాత్రలను పోషించిన ఈ సినిమాకి, అరుణ్ అనిరుద్ధన్ దర్శకత్వం వహించాడు. మే 14వ తేదీన థియేటర్లలో విడుదలైన సినిమా ఇది. 30 కోట్ల బడ్జెట్ తో నిర్మించిన ఈ సినిమా, 70 కోట్లకి పైగా వసూళ్లను రాబట్టింది. అలాంటి ఈ సినిమా, ఈ నెల 19వ తేదీ నుంచి 'సోనీ లివ్'లో స్ట్రీమింగ్ అవుతోంది. యాక్షన్ కామెడీ జోనర్లో రూపొందిన ఈ సినిమా, ఐదు భాషల్లో అందుబాటులో ఉంది. సామ్ కుట్టి (బాసిల్ జోసెఫ్) ఇంజనీరింగ్ కాలేజ్ లో జాయిన్ అవుతాడు. ప్రశాంత్ తో కలుపుకుని తన కంటూ ఒక గ్యాంగ్ ను రెడీ చేసుకుంటాడు. గతంలో సామ్ కుట్టి అన్నయ్య 'జోసెఫ్' (సుకుమార్) కూడా అదే కాలేజ్ లో చదువుతాడు. ఆ సమయంలో 'ఆరోహణ్' అనే పేరుతో ప్రతి ఏడాది ఒక ఫెస్ట్ ను నిర్వహిస్తూ వస్తారు.ఒకసారి నిర్వహించిన ఫెస్ట్ లో తొక్కిసలాట జరగడంతో ముగ్గురు స్టూడెంట్స్ చనిపోతారు. అందుకు కారకుడు జోసెఫ్ అనే ముద్ర పడిపోతుంది. కాలేజ్ లో ఆ ఏడాది నుంచి ఆ ఫెస్ట్ ను నిషేదిస్తారు. తన గురించి ఆ కాలేజ్ లో ఒక చేదు అభిప్రాయం ఉండిపోవడం జోసెఫ్ ను మానసికంగా కుంగదీస్తుంది. ఆ కాలేజ్ లో ఆ ఫెస్ట్ ను మళ్లీ జరిపించి, తన అన్నయ్యతో పాటు అప్పటి బ్యాచ్ ను ఆహ్వానించాలనే ఒక బలమైన అభిప్రాయంతో సామ్ కుట్టి ఉంటాడు. అందుకు సంబంధించిన అతని ప్రయత్నాలను, స్వాతి ఆర్ కృష్ణ (రియా శిబూ) సపోర్ట్ చేస్తుంటుంది. కాలేజ్ లో నిర్వహించే ఫెస్ట్ లో పాడటానికిగాను, సింగర్ 'వినీత్ శ్రీనివాసన్' ను సామ్ కుట్టి ఒప్పిస్తాడు. అయితే ఆ సమయంలోనే స్ట్రీట్ సింగర్ అయిన కుట్టన్ (టోవినో థామస్)తో సామ్ కుట్టీ మిత్ర బృందం గొడవ పడుతుంది. వాళ్ల కారణంగా కుట్టన్ భార్య గాయపడుతుంది. కుట్టన్ పెద్ద గూండా అనీ, అతని పేరుపై చాలా కేసులున్నాయనే విషయం సామ్ కుట్టీకి ఆ తరువాతనే తెలుస్తుంది. అప్పుడు సామ్ కుట్టి ఏం చేస్తాడు? కాలేజ్ ఫెస్ట్ విషయంలో అతని ప్రయత్నం ఫలిస్తుందా? అనేది మిగతా కథ. ఒక ఇంజనీరింగ్ కాలేజ్ లో నిర్వహించిన ఫెస్ట్ లో కొంతమంది స్టూడెంట్స్ చనిపోతారు. దాంతో అప్పటి నుంచి ఆ కాలేజ్ లో ఆ ఫెస్ట్ ను నిషేధిస్తారు. అందుకు కారకుడు జోసెఫ్ అనే ముద్రపడిపోతుంది. తన అన్నయ్యపై పడిన ఆ ముద్రను చెరిపేయడం కోసం అదే కాలేజ్ లో సామ్ కుట్టి చేరతాడు. ఆ ఫెస్ట్ ను మళ్లీ జరిపించడం కోసం అతను చేసే ప్రయత్నమే ఈ సినిమాలోని ప్రధానమైన కథాంశం. హీరో ఒక ఇంజనీరింగ్ కాలేజ్ లో చేరడం .. అతని స్టైల్ .. యాటిట్యూడ్ .. తన అన్నయ్య విషయంలో తాను అనుకున్నది సాధించాలనే ఒక ఆరాటం తాలూకు సన్నివేశాలతో ఫస్టాఫ్ నడుస్తుంది. ఫ్రెండ్షిప్ .. లవ్ .. అల్లర్లు .. ఆకతాయి వేషాలతో సరదాగా సాగిపోతుంది. ఇక టోవినో థామస్ ఎంట్రీతో సెకండాఫ్ కొనసాగుతుంది. హీరో ప్రయత్నాలకు కుట్టన్ అడ్డుపడటం .. అతణ్ణి దాటుకుని హీరో ముందుకు వెళ్లడం వంటి సన్నివేశాలు సెకండాఫ్ ను ముందుకు తీసుకుని వెళతాయి. ఇక కథ ప్రీ క్లైమాక్స్ కి చేరుకునే సరికి, సింగర్ వినీత్ శ్రీనివాస్ కిడ్నాప్ డ్రామా మొదలవుతుంది. కాలేజ్ ఫెస్ట్ జరగకుండా కుట్టన్ గ్యాంగ్ అతణ్ణి కిడ్నాప్ చేయడం, ఆ గ్యాంగ్ బారి నుంచి అతణ్ణి విడిపించి తీసుకుని రావడానికి సామ్ కుట్టి బ్యాచ్ రంగంలోకి దిగడంతో ఈ డ్రామా పీక్ స్టేజ్ కి చేరుకుంటుంది. కాలేజ్ నేపథ్యంలో లవ్ .. కామెడీ .. యాక్షన్ .. ఎమోషన్స్ ను కలుపుకుంటూ దర్శకుడు ఈ కథను తయారు చేసుకున్నాడు. ప్రధానంగా యూత్ ను దృష్టిలో పెట్టుకుని సన్నివేశాలను నడిపించాడు. సాధారణంగా కాలేజ్ క్యాంపస్ కథలు అనగానే లవ్ కీ .. ఫ్రెండ్ షిప్ కీ ఎక్కువ ప్రాధాన్యతను ఇస్తారు. కానీ ఈ కథలో దర్శకుడు వాటిని పెద్దగా పట్టించుకోకపోవడం అసంతృప్తిని కలిగిస్తుంది. ఇక హీరోకి కాలేజ్ క్యాంపస్ లో కాకుండా బయటి నుంచి విలనిజం ఎదురవుతుంది. టోవినో థామస్ పాత్ర ఎంట్రీ .. తన ప్రమేయం లేకుండానే హీరో అతనికి శత్రువు కావడం వంటి సీన్స్ బాగున్నాయి. కుట్టన్ పేరుగల ఆ పాత్రకి ఇచ్చిన బిల్డప్ కూడా ఆసక్తికరంగా ఉంటుంది. కాకపోతే ఆ తరువాత కథ మాత్రం ఆడియన్స్ అంచనాలకి తగినట్టుగా సాగదు. పేలవమైన సన్నివేశాలకు సరైన కామెడీ తోడు లేక తేలిపోతుంటాయి. చివరివరకూ అదే పరిస్థితి కొనసాగడమే విచారించదగిన విషయం. బాసిల్ జోసెఫ్ లుక్ .. అతని యాటిట్యూడ్ .. నటనకి వంక బెట్టవలసిన పనిలేదు. కామెడీ పరంగా ఆయన ఆల్రెడీ ప్రూవ్ చేసుకున్నాడు. అయితే ఈ సినిమా విషయంలో ఆయన పాత్రను బాగానే డిజైన్ చేశారుగానీ, కథాపరమైన బలం లేకపోవడం నిరాశను కలిగిస్తుంది. ఇక టోవినో పాత్రలోను ఆడియన్స్ ఆశించే పవర్ కనిపించలేదు. హీరోయిన్ పేరుకే తప్ప, ఆ పాత్ర వైపు నుంచి ఎలాంటి ప్రయోజనం జరగలేదు. సామ్యూల్ హెన్రీ ఫొటోగ్రఫీ బాగుంది. విష్ణు విజయ్ నేపథ్య సంగీతం ఫరవాలేదు. ఛమన్ చాకో ఎడిటింగ్ ఓ మాదిరిగా అనిపిస్తుంది. బాసిల్ జోసెఫ్ సినిమా అనగానే ఆడియన్స్ ఆశించేది బలమైన కామెడీ. కానీ అది ఈ సినిమాలో మనకి కనిపించదు. అక్కడక్కడా కాస్త నవ్వు ముఖం పెడతాం గానీ, బాసిల్ సినిమా నుంచి ఊహించినదానికి అది చాలా తక్కువనే చెప్పాలి. లుక్ పరంగా .. బాడీ లాంగ్వేజ్ పరంగా బాసిల్ నవ్వించగలిగాడు గానీ, కథాకథనాల పరంగా మెప్పించలేకపోయాడని చెప్పాలి.

## సమంత 'మా ఇంటి బంగారం' ఫస్ట్ డే కలెక్షన్స్.. తెలుగులో దుమ్మురేపిన ఓపెనింగ్!



సమంత రూత్ ప్రభు ప్రధాన పాత్రలో నటించిన లేటెస్ట్ యాక్షన్ డ్రామా 'మా ఇంటి బంగారం' థియేటర్లలో సాలిడ్ ఓపెనింగ్ సాధించింది. ట్రేడ్ వర్గాల ప్రకారం ఈ చిత్రం తొలిరోజు భారతదేశంలో రూ.5.35 కోట్ల నెట్ వసూళ్లను రాబట్టినట్లు తెలుస్తుంది. దీంతో ఇండియా గ్రాస్ కలెక్షన్ సుమారు రూ.8.20 కోట్లుగా నమోదుకాగా. దేశవ్యాప్తంగా 2,658 షోలలో ఈ సినిమా ప్రదర్శితమైంది. ఓవర్సీస్ మార్కెట్ నుంచి మరో రూ.6.50 కోట్ల గ్రాస్ రావడంతో తొలిరోజు వరల్డ్‌వైడ్ గ్రాస్ కలెక్షన్ రూ.13.25 కోట్లకు చేరింది.రిజియన్ వారీగా చూస్తే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ కలిపి రూ.4.75 కోట్ల గ్రాస్‌తో టాప్‌లో నిలిచాయి. కర్ణాటకలో రూ.90 లక్షలు, తమిళనాడులో రూ.38 లక్షల గ్రాస్ వసూళ్లు నమోదయ్యాయి. తెలుగు 2డి వెర్షన్‌కు ఆక్యుపెన్సీ రోజంతా పెరుగుతూ వచ్చింది. ఉదయం షోలకు 26.15 శాతం ఉన్న ఆక్యుపెన్సీ, రాత్రి షోలకు 51.38 శాతానికి చేరింది. ప్రీమియం తెలుగు ఐమాక్స్ ఫార్మాట్‌కు 96 శాతం ఓవరాల్ ఆక్యుపెన్సీ నమోదైంది. హైదరాబాద్‌లో దాదాపు హౌస్‌ఫుల్స్ పడగా, రాత్రి షోలకు 100 శాతం ఆక్యుపెన్సీ వచ్చింది.'కుషి' 2023 తర్వాత సమంత తెలుగు సినిమాలో లీడ్ రోల్‌లో నటించిన చిత్రం ఇదే కావడంతో ఈ సినిమాపై విడుదలకు ముందు నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే ఆ అంచనాలను నిజం చేస్తూ ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతుంది. నందిని రెడ్డి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో దిగంత్, గుల్షన్ దేవయ్య, గౌతమి, మంజుష, శ్రీముఖి కీలక పాత్రల్లో నటించారు.

## గతాన్ని పూర్తిగా మర్చిపోవాలి

**– శోభిత ధూళిపాళ**



అక్కినేని నాగచైతన్యతో వివాహం జరిగిన తర్వాత సినిమాలకు కాస్త బ్రేక్ ఇచ్చిన శోభిత ధూళిపాళ.. రీసెంట్‌గా 'చీకటిలో' వెబ్‌సిరీస్‌తో డిజిటల్ స్క్రీన్‌పై మంచి థ్రిల్ ఇచ్చారు. ప్రస్తుతం కోలీవుడ్ క్రేజీ డైరెక్టర్ పా రంజిత్ తెరకెక్కిస్తున్న సైన్స్ ఫిక్షన్ డ్రామా 'వెట్టువం' షూటింగ్‌తో బిజీగా ఉన్న ఈ బ్యూటీ... తాజాగా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో చేసిన కొన్ని పర్సనల్ కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతమైన చర్చకు దారితీశాయి. ఇంటర్వ్యూలో భాగంగా యాంకర్ శోభితను ఒక పర్సనల్ క్వశ్చన్ అడిగారు. "మీ లైఫ్‌లో ఏ విషయాన్ని పూర్తిగా మర్చిపోవాలని అనుకుంటున్నారు?" అని ప్రశ్నించగా... దానికి శోభిత ఏమాత్రం తడబడకుండా.. "నిన్నటి వరకు నా జీవితంలో జరిగిన ప్రతి సంఘటనను, జ్ఞాపకాన్ని పూర్తిగా మర్చిపోవాలని అనుకుంటున్నాను" అని ఆన్సర్ ఇచ్చి అందరినీ ఆశ్చర్యపరిచారు. తన సమాధానానికి గల కారణాన్ని వివరిస్తూ.. "సాధారణంగా లోకం మతిమరుపును ఒక జబ్బుగా చూస్తుంది. కానీ నా దృష్టిలో కొన్నిసార్లు మతిమరుపు అనేది మనిషికి దొరికే ఒక గొప్ప వరం. ఎందుకంటే లైఫ్‌లో వేరే వాళ్లు మన పట్ల చేసిన బాధాకరమైన పనులు, మన మనసును గాయపరిచిన చేదు జ్ఞాపకాలను మనం మర్చిపోయినప్పుడే జీవితంలో ఫ్రీగా ముందుకు సాగడం సాధ్యమవుతుంది" అని చెప్పుకొచ్చారు. పాత జ్ఞాపకాలలోనే ఎప్పుడూ కూరుకుపోకుండా, వాటన్నింటినీ డిలీట్ చేసేసి రేపటి భవిష్యత్తు గురించి పాజిటివ్‌గా ఆలోచించడమే నేటి అవసరమని శోభిత క్లారిటీ ఇచ్చారు.

## నాగదుర్గ నాయికగా తెలంగాణ నేపథ్య చిత్రం



తెలంగాణ జానపద గీతాల్లో అద్భుత నాట్యాభినయాన్ని ప్రదర్శిస్తూ మంచి పేరు సంపాదించుకుంది నాగదుర్గ. ఆమె పాటలు, ప్రైవేట్ ఆల్బమ్స్ సోషల్‌మీడియాలో రికార్డు స్థాయి వీక్షణలతో ప్రేక్షకుల్ని అలరించాయి. తాజాగా ఆమె కథానాయికగా అరంగేట్రం చేస్తున్నది. ప్రియదర్శి హీరోగా నటిస్తున్న ఈ చిత్రాన్ని ప్రముఖ దర్శకుడు సుకుమార్, నిర్మాత బన్నీ వాసు తెరకెక్కిస్తుండటం విశేషం. తెలంగాణ నేపథ్య కుటుంబ కథాంశంతో రూపొందనున్న ఈ చిత్రానికి వంశీ రెడ్డి దర్శకత్వం వహించనున్నారు. ఈ నెల 25న లాంఛనంగా సినిమాను ప్రారంభించి, వచ్చే నెలలో రెగ్యులర్ షూటింగ్ మొదలుపెడతామని, ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలో వెల్లడిస్తామని మేకర్స్ పేర్కొన్నారు. బన్నీ వాస్ వర్క్స్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించనున్నాయి.

## 'సేవ్ ద టైగర్స్ 3' సిరీస్ రివ్యూ!



'సేవ్ ద టైగర్' సిరీస్ నుంచి గతంలో రెండు భాగాలు వచ్చాయి. ప్రియదర్శి .. కృష్ణ చైతన్య .. అభినవ్ గౌతమ్ ప్రధానమైన పాత్రలను పోషించిన ఈ సిరీస్ నుంచి వచ్చిన రెండు భాగాలకి కూడా అనూహ్యమైన రెస్పాన్స్ లభించింది. ఈ నేపథ్యంలో ఈ సిరీస్ నుంచి మూడో భాగాన్ని వదిలారు. ఈ నెల 19వ తేదీ నుంచి ఈ సిరీస్ స్ట్రీమింగ్ అవుతోంది. ఫాంటసీ టచ్ ఇచ్చిన మూడో సీజన్ ఎలా ఉందనేది ఇప్పుడు చూద్దాం. గంటా రవి ( ప్రియదర్శి) తన భార్య హైమా (సుజాత) పోరు పడలేక గేటెడ్ కమ్యూనిటీకి మారిపోతాడు. అయితే అక్కడి వాతావరణంలో ఇమడలేక నానా ఇబ్బందులు పడుతూనే రాజకీయాలలో ఎదుగుతూ ఎమ్మెల్యే అవుతాడు. ఇక రాహుల్ (అభినవ్ గౌతమ్) రైటర్ గా బిజీ అవుతాడు. అవార్డులతో పాటు విమర్శలు వచ్చి పడుతుంటాయి. విక్రమ్ ( చైతన్య కృష్ణ) హారిక అనే అమ్మాయితో చనువుగా ఉండటం చూసిన అతని భార్య రేఖ విడాకుల నోటీసు పంపిస్తుంది. ఒక వైపున కోర్టు చుట్టూ తిరుగుతున్నప్పటికీ, విక్రమ్ తన పద్ధతి మాత్రం మార్చుకోడు. గంటా రవి తన పదవిని అడ్డుపెట్టుకుని భూ కబ్జాలకు పాల్పడుతూ ఉంటాడు. రాహుల్ కొత్త కథల కోసం ప్రయత్నించకుండా వేరొకరి కథలను కాపీ చేస్తుంటాడు. భార్యకి దూరమైన విక్రమ్ వేరే అమ్మాయిలను వేధించడం మొదలు పెడతాడు. ఈ క్రమంలోనే ఈ ముగ్గురిపై పోలీస్ లకు ఫిర్యాదులు అందుతాయి. పోలీస్ కేసు ముగ్గురినీ భయపెడుతుంది. ఈ గండం నుంచి ఎలా గట్టెక్కాలా అనే విషయంపై ఒక క్లబ్ లో సమావేశమవుతారు. తమ పట్ల భార్యలు ప్రవర్తిస్తున్న తీరును గురించి ప్రస్తావిస్తారు. తమని ఈ స్థితికి తీసికొచ్చింది 'పెళ్లి' అనే రెండు అక్షరాలేనని భావిస్తారు. పెళ్లిళ్లు స్వర్గంలో జరుగుతాయని చెప్పినదెవరంటూ దేవతలను తిట్టడం మొదలు పెడతారు. తమని శాపనార్థాలు పెట్టే ఆ దృశ్యాన్ని ఇంద్రుడు నేరుగా చూస్తాడు. అప్పుడు ఆయన ఏం చేస్తాడు? పర్యవసానంగా ఈ ముగ్గురికి ఎలాంటి పరిస్థితులు ఎదురవుతాయి? అనేది మిగతా కథ. గంట రవి .. రాహుల్ .. విక్రమ్ అనే ముగ్గురు స్నేహితులచుట్టూ తిరిగే కథ ఇది. ఈ ముగ్గురి కుటుంబాలు .. భార్యాభర్తల సంబంధాలు .. బంధాలు .. అలకలు .. ఆవేశాల చుట్టూ ఈ కథను అల్లుకుంటూ వెళ్లారు. మద్యానికి అలవాటు పడటం వలన ఎలాంటి సమస్యలను ఎదుర్కోవలసి వస్తుందనేది అనుభవపూర్వకంగా తెలుసుకుంటారు. అందుకు సంబంధించిన సన్నివేశాలతో మొదటి రెండు భాగాలు ప్రేక్షకులను అలరిస్తూ వచ్చాయి. ఇక ఈ సారి ఈ ముగ్గురు మిత్రులు పెళ్లి అనే కాన్సెప్ట్ తో తమని ఒక ఆట ఆడిస్తున్న దేవుడిని నిందిస్తారు. ఇక్కడి నుంచి ఈ కథ ఫాంటసీని టచ్ చేస్తుంది. దేవేంద్రుడు .. చిత్రగుప్తుడు వంటి పాత్రలు ఎంట్రీ ఇస్తాయి. మనుషులను పోలిన మనుషులు అంటూ మరో అంశం కూడా ఇక్కడి నుంచి ఈ కథకి తోడవుతుంది. ఇక ఇక్కడి నుంచి కథ కొత్త మలుపు తీసుకుని ముందుకు వెళుతుంది. అయితే ఈ డ్రామా కాస్త కన్ఫ్యూజింగ్ గానే ఉంటుంది. కన్ఫ్యూజింగ్ డ్రామా అంటూ వాళ్లు ముందుగానే చెప్పేశారు కూడా. ముగ్గురు స్నేహితులు దేవుళ్లను తిట్టడం .. చిత్రగుప్తుడు వంటి పాత్రలు దిగిరావడం వరకూ బాగానే ఉందిగానీ,మనుషులను పోలిన మనుషులు అంటూ అవే మూడు పాత్రలను ప్రవేశపెట్టడం అయోమయాన్ని కలిగిస్తుంది. ఈ కాన్సెప్ట్ ఆడియన్స్ అర్థం చేసుకోవడానికీ .. అర్థం కావడానికి కొంత సమయం పడుతుంది. కొంతమందికి ఆ అయోమయం అలా ఉండిపోవచ్చు కూడా. పెళ్లి అనేది ఒక బరువు కాదు .. బాధ్యత. పెళ్లి అనేది ఒక పంజరం కాదు .. అందమైన అనుబంధం. స్వేచ్ఛ పేరుతో బాధ్యతల నుంచి దూరంగా పారిపోవడం కరెక్టు కాదని చెప్పే ఒక సందేశం బాగుంది. అయితే ఆ విషయాన్ని చెప్పడానికి మనుషులను పోలిన మనుషులు అంటూ రెండేసి ప్రధానమైన పాత్రలను చూపించడం కాస్త గందరగోళంగానే అనిపిస్తుంది. లాజిక్ కి అందకుండా .. క్లారిటీ లోపించి కనిపిస్తుంది. దేవేంద్రుడిగా వెన్నెల కిశోర్ కనిపించడం .. హుక్ స్టెప్ ప్రాక్టీస్ అంటూ సందడి చేయడం బాగుంది. 'గొడవపడితే మాట్లాడదేమోనని భయపడేవాడు ప్రేమికుడు. మాట్లాడితే గొడవ పడుతుందేమోనని భయపడేవాడు మొగుడు' వంటి డైలాగ్స్ అక్కడక్కడా మెరుస్తాయి. ఫొటోగ్రఫీ .. నేపథ్య సంగీతం .. ఎడిటింగ్ కథకు తమవంతు సపోర్టును అందించాయి. 'సేవ్ ద టైగర్స్' సిరీస్ కామెడీ ప్రధానంగా రూపొందుతూ వస్తున్న సిరీస్ అనే విషయం అందరికీ తెలిసిందే. అలాగే ఈ సారి కూడా కామెడీ దిశగా కంటెంట్ ను పరిగెత్తించే ప్రయత్నమే చేశారు. కాకపోతే ఫాంటసీ టచ్ కారణంగా కాస్త క్లారిటీ లోపించినట్టుగా అనిపిస్తుంది.

# ఎలాంటి లక్షణాల ద్వారా మన ‘మూత్ర నాళల్లో ‘రాళ్ళు మరియు మూత్రం ఇన్ఫెక్షన్ ఉన్నాయని తెలుసుకోవచ్చు

**- డాక్టర్. ఎండి డిసి. తిరుపతిరావు సీనియర్ వైద్యులు: చైతన్య హాస్పిటల్**

**కరీంనగర్ (భారత శక్తి)** డాక్టర్. ఎండి డిసి. తిరుపతిరావు సీనియర్ వైద్యులు: చైతన్య హాస్పిటల్ కరీంనగర్ మాట్లాడుతూ ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వాటిని త్వరగా తగ్గించుకోగలుగుతాము అవగాహనా కోసం:ఇది చాల కామన్ గా ఉండే సమస్య కానీ దీన్ని మనం అంతగా పట్టించుకోము. బట్ ఈ సమస్య చిన్నదే కావొచ్చు కానీ మొదట్లో గుర్తిస్తే అంతగా సమస్య ఉండదు కానీ నిర్లక్ష్యం చేస్తే కొన్ని విపరీత పరిణామాలు ఉంటాయి.మొదట ఈ సమస్య వచ్చే కారణాలు తెలుసు కుందాం.మనం తగినన్ని నీళ్లు తాగక పోవడం.కార్బోనేటేడ్ వాటర్, పెప్సీ, కోకో కోల అలాంటివి ఎక్కువగా సేవించడం.మనం మూత్రంని ఎక్కువ సేపు ఆపుకోవడం ఈ విషయం మనం ఎక్కువగా స్త్రీ లలో ఉంటుంది.అపరిశుభ్రమైన నీటితో శుభ్రం చేసుకోవడం వలన ఇది కూడా స్త్రీ లలో ఉంటుంది.ఇవి మచ్చుకు కొన్ని:ఇంకా పరిష్కారానికి వస్తే మనం రోజుకు మినిమం 4 నుంచి 5 లీటర్లు నీళ్లు తాగాలి. మన శరీరంలో నీటి శాతం ‘కరెక్ట్ గా’ఉంటేనే అన్ని అవయవాలు సరిగ్గా పని చేస్తాయి. కానీ మనం తినే టప్పుడు తప్ప మళ్ళీ నీళ్లను తాగం. ఇదే మనం చేసే పొరపాటు, తినేటప్పుడు కాకుండా మిగతా సమయం లో రెండు నుంచి మూడు లీటర్లు నీటిని మనం తాగాలి.( మేము తాగలేము అనే వారికి నేను ఇచ్చే సలహా ఏమిటంటే, మీరు ఉదయం లేస్తూనే హాఫ్ నుంచి ఒక లీటర్ గోరువెచ్చని నీళ్లు తాగండి. పరగడుపునే(బ్రేక్ ఫాస్ట్ అయ్యాక ఒక హాఫ్ లీటర్, లంచ్ టైం లో హాఫ్ లీటర్, డిన్నర్ టైంలో హాఫ్ లీటర్,ఈవినింగ్ టైంలో లేదా మిగతా టైం లో హాఫ్ లీటర్ మొత్తం త్రీ నుంచీ ఫోర్ లీటర్లు లెక్క పెట్టుకొని తాగాలి. మేము గుర్తు పెట్టుకోలేము అనే వాళ్లకు గూగుల్ ప్లే స్టోర్ లో ఆప్స్ కూడా ఉన్నాయి.ఈ లింక్ సందర్శించండి: మొబైల్ ఇన్స్టాల్ చేసుకోండి అదే గుర్తు చేస్తుంది.జంక్ ఫుడ్ బాగా తగ్గించాలి కార్బోనేటేడ్ వాటర్ కోలాస్ మానేస్తే మంచిది, దాని బదులు ఒక కొబ్బరి బొండం తాగితే ఆరోగ్యానికి చాల మంచిది.ఇంకా మూత్రం ఆపుకోవడం ఈ సమస్య ముఖ్యంగా స్త్రీ లలో ఉత్పన్నం అవుతుంది. దీనికి చాల కారణాలు, సరి అయిన ఫెసిలిటీస్ లేకపోవడం,ఎక్కువ గా జర్నీ చేయడం ఇలా చేయడం వలన మన శరీరం నుండి బయటకి వెళ్ళవలసిన వేస్ట్ అలాగే మన శరీరం లో ఉండటం వలన ఇన్ఫెక్షన్స్ వచ్చే అవకాశం ఎక్కువ. కావున ఎక్కువ సేపు మూత్రం ఆపుకోకుండా చూసుకోవాలి. అపరిశుభ్రమైన నీటిని వాడటం వలన ఈ సమస్య ఆడవాళ్ళలో ఎక్కువగా వస్తుంది ముఖ్యంగా పబ్లిక్ బాత్రూం లో,చాల రోజులు నిలువ వున్న నీటిని వాడటం వలన అక్కడి నుంచి ఇన్ఫెక్షన్ సోకే అవకాశం వుంది.యూరిన్ ఇన్ఫెక్షన్ ముదరడం వలన చాల సమస్యలు వచ్చే అవకాశం ఉంది కావున ఈ సమస్య మనం తగినన్ని నీళ్లు తాగడం వలన దీనిని మనం



నివారించొచ్చు..డాక్టర్. ఎండి డిసి. తిరుపతిరావు సీనియర్ వైద్యులు: చైతన్య హాస్పిటల్ కరీంనగర్ తెలిపారు.

## తెలంగాణ రైతులకు దారుణంగా వెన్ను పోటు పొడిచిన కాంగ్రెస్ సర్కారు

**- మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్**



**హుస్నాబాద్(భారత శక్తి)** మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ మాట్లాడుతూ అన్నపూర్ణగా ఎదిగిన రాష్ట్రంలో అన్నదాతలను అనాథగా మార్చే దుర్మా ర్గానికి తెగబడిందని అన్నారు, కేంద్రం చెప్పిన కోటా వరకు మాత్రమే పంటలు కొంటాం తప్ప రాష్ట్ర ప్రభుత్వం వైపు నుంచి అదనంగా ఒక్క గింజ కొనే ప్రసక్తే లేదని చెప్పడం రైతులకు మరణ శాసనమే. వ్యవసాయాన్ని ఇప్పటికే సంక్షోభంలోకి నెట్టి రైతు బతుకును ఛిద్రంచేశారు సీఎం రేవంత్. పదేళ్లపాటు ధీమాగా ధైర్యంగా బతికిన రైతును మళ్లీ సమైక్య రాష్ట్రం నాటి కష్టాల్లోకి నెట్టారు. చరిత్రచూస్తే సమైక్య రాష్ట్రంలో అరవైఏళ్లపాటు తెలంగాణ రైతులు అరిగోస పడ్డారు. పక్కనే గోదారి, కృష్ణా పారుతున్నా,సాగునీటి వసతి లేదు. కరెంట్ కు దిక్కు లేదు. కాలిపోయేమోటర్లు, పేలిపోయే ట్రాన్స ఫార్మర్లతో తల్లడిల్లని రోజు లేదు. 60 ఏళ్లు తెలంగాణలో వ్యవసాయం కన్నీటి సేద్యంగానే సాగింది. దేశంలోనే అత్యధిక రైతుల ఆత్మహత్యలతో తల్లడిల్లిన నేల తెలంగాణ కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ ఉద్యమానికి పునాది కూడా రైతుల కష్టాలు, కన్నీళ్లే. అందుకే నీళ్లు నిధులు నియామకాలు అనే ఉద్యమ నినాదాన్నే కేసీఆర్ తెలంగాణ తొలి ప్రభుత్వ విధంగా మార్చారు. వ్యవసాయ సంక్షోభానికి చిరునామగా మార్చే కుట్రలపై 70 లక్షల మంది రైతులు 4 కోట్ల తెలంగాణ ప్రజలతో కలిసి బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జంగ్ సైరన్మోగిస్తాం.

## మెహదీపట్నం డిపోలో టీజేఎంయూలో భారీ చేరికలు

**(భారత శక్తి)**హైదరాబాద్‌లోని మెహదీపట్నం డిపోలో తెలంగాణ జర్నీ మెన్ యూనియన్ (ఎఏఓజ)లో భారీ సంఖ్యలో కార్మికులు చేరారు. టీఎంయూ, ఎంప్లాయీస్ యూనియన్‌తో పాటు పలు ఇతర యూనియన్లకు చెందిన ఉద్యోగులు స్వచ్ఛందంగా టీజేఎంయూలో చేరి సంఘానికి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు కొత్తగా చేరిన సభ్యులకు స్వాగతం పలికి సంఘం లక్ష్యాలు, కార్యక్రమాల గురించి వివరించారు.కార్మికుల సమస్యల పరిష్కారం, ఉద్యోగ భద్రత, హక్కుల పరిరక్షణ, సంక్షేమ చర్యల కోసం టీజేఎంయూ నిరంతరం పోరాటం చేస్తోందని నాయకులు పేర్కొన్నారు.

ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడడంలో యూనియన్ కీలక పాత్ర పోషిస్తోందనే నమ్మకంతోనే పలువురు ఉద్యోగులు టీజేఎంయూలో చేరారని తెలిపారు.ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు, కార్మికుల సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని, ఉద్యోగుల సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. మెహదీపట్నం డిపోలో జరిగిన ఈ భారీ చేరికలు టీజేఎంయూ బలోపేతానికి నిదర్శనమని, భవిష్యత్తులో మరింత మంది కార్మికులు సంఘంలో చేరే అవకాశాలు ఉన్నాయని అభిప్రాయపడ్డారు. కార్మికుల ఐక్యతతోనే హక్కుల సాధన సాధ్యమవుతుందని వారు పిలుపునిచ్చారు.

## జూబ్లీహిల్స్‌లో బంగారు ఆభరణాల చోరీ..

**- నలుగురు ఉద్యోగులపై కేసు**

**(భారత శక్తి)**జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ ప్రముఖ జ్యువెలరీ షోరూంలో బంగారు ఆభరణాల చోరీ ఘటన వెలుగులోకి వచ్చింది. షోరూం యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు నలుగురు ఉద్యోగులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గండిపేట రోడ్డులోని విస్లింగ్ వుడ్స్ అపార్ట్‌మెంట్‌కు చెందిన దోసపాటి కార్తీక్ (39), జూబ్లీహిల్స్‌లోని ఎస్‌కేటీ గోల్డ్ అండ్ డైమండ్స్ (మాజీ విశిష్ట గోల్డ్ అండ్ డైమండ్స్) షోరూం యజమాని. షోరూంలో స్టాక్ వెరిఫికేషన్ నిర్వహించగా, మరమ్మతుల కోసం ఉంచిన బంగారు ఆభరణాల్లో 8.2 గ్రాముల బంగారం కనిపించకుండా పోయినట్లు గుర్తించారు. అనంతరం జూన్ 10న కస్టమర్‌కు చెందిన నమూనా బంగారు గొలుసుతో పాటు మరో రెండు బంగారు వస్తువులు కూడా మాయమైనట్లు తేలింది.

సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించగా అనుమానాస్పద కదలికలు కనిపించడంతో ఉద్యోగులపై అనుమానం వ్యక్తమైంది. గత ఏడాది జూలై 13న కూడా 38.020 గ్రాముల బంగారు గొలుసు షోరూం నుంచి కనిపించకుండా పోయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే ఆ ఘటనకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజీ తొలగించబడినట్లు తెలిపారు.

మొత్తం 76.385 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయని, వాటి విలువ సుమారు రూ.1.52 లక్షలుగా ఉంటుందని ఫిర్యాదుదారు పేర్కొన్నారు. షోరూం ఉద్యోగులు శివకుమార్ భూక్యా, చలపతిరావు, ప్రకాష్, గోవర్ధన్ కలిసి ఈ చోరీలకు పాల్పడి ఉంటారని అనుమానిస్తూ ఫిర్యాదు చేశారు.ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు న్యాయ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ప్రైవేటు బస్సు సీజ్

**- ప్రయాణిలకు తిప్పలు**

**హైదరాబాద్ (భారత శక్తి)** ఖైరతాబాద్ ఆర్టిఏ అధికారుల నిర్వాకం ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులకు దారి తీసింది. శుక్రవారం రాత్రి రాత్రి హైదరాబాద్ నుండి రాజస్థాన్ వెళ్తున్న ఒక ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును ఆర్టిఏ అధికారులు సీజ్ చేసారు.

సీజ్ చేసిన సమయంలో బస్సులో 50 మంది ప్రయాణికులు వున్నారు. సీజ్ చేసిన బస్సుతోపాటు ప్రయాణికులను కూడా ఆర్టిఏ ఖైరతాబాద్కు తీసుకువచ్చారు. వారికి ప్రత్యామ్నాయ బస్సు ఏర్పాటు చేయటంలో ఆర్టిఏ అధికారుల విఫలం అయ్యారు. రాత్రంతా సీజ్ చేసిన బస్సులోనే 50 మంది ప్రయాణికులు వుండిపోయారు. తినడానికి తిండి లేక, వాష్రూమ్స్ కి కూడా లేక తీవ్ర ఇబ్బంది పడి అవస్థలు ప్యాసింజర్లు ఎదురుకున్నారు. 10 గంటలుగా ఖైరతాబాద్ ఆర్టిఏ లోనే ట్రావెల్స్ బస్సు వుండిపోయింది. ప్రయాణికులు అధికారులతో వాగ్వాదానికి దిగారు.

## ఎమ్మార్వో కార్యాలయాన్ని ముట్టడించిన బీఆర్ఎస్ నేతలు

**హైదరాబాద్ (భారత శక్తి)**రూ.800 కోట్ల ప్రభుత్వ భూమి కబ్జాదారుల నుంచి కాపాడాలని ఎమ్మార్వో కార్యాలయం కంటోన్మెంట్ బీఆర్ఎస్ నాయకులు ముట్టడించారు.

బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మన్నె క్రిశాంక్ మాట్లాడుతూకాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్ళలో ఒక్క డబల్ బెడ్ రూమ్ ఇంటికి పునాది కూడా వేయలేదు.. గత కేసీఆర్ ప్రభుత్వం ఒక కంటోన్మెంట్ నియోజకవర్గంలో ఎన్నో డబల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టించింది. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ రేవంత్ రెడ్డి ఆయన ఎమ్మెల్యేలు ఎక్కడ భూమి కనబడితే అక్కడ కబ్జా చేస్తున్నారు. ఇవాళ ఏకంగా రూ.800 కోట్ల ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తుంటే కాంగ్రెస్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ రూ.5 కోట్లు తీసుకొని గప్ చుప్ ఉన్నాడు. ఏ ఛానల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ చర్చకు వస్తారో రావాలి, రూ. 800 కోట్ల ప్రభుత్వ భూమిలో 6000 ఇందిరమ్మ ఇల్లు కట్టే బదులు, కమిషన్ల కోసం షాపింగ్ మాల్ కట్టడానికి కబ్జా ఎలా జరిగిందో చర్చిద్దాం . 2023 19 ఆగస్టులో కబ్జాదారులపై అప్పటి ప్రభుత్వం పోలీసు కేసులు కూడా నమోదు చేసిందని అన్నారు.

## చార్మినార్‌లో అనుమతి లేని ఫాస్ట్ ఫుడ్ గోదాముపై దాడి చేసిన హెచ్-ఫాస్ట్ బృందం

**- కల్తీ ఆహార పదార్థాలు స్వాధీనం**





**హైదరాబాద్ (భారత శక్తి)**ఆహార కల్తీ మరియు అసురక్షిత ఆహార పద్ధతులపై నిరంతర నిఘాలో భాగంగా, హెచ్-ఫాస్ట్ హైదరాబాద్ ఫుడ్ అడల్ట్రేషన్ సర్వైలెన్స్ టీమ్ బృందం, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ తో కలిసి చార్మినార్‌లోని హుస్సేనీఆలం పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా నిర్వహిస్తున్న ఒక ఫాస్ట్ ఫుడ్ గోదాముపై ఆకస్మిక దాడి నిర్వహించింది.నమ్మకమైన సమాచారం మేరకు, ఈ బృందం చార్మినార్‌లోని పంచ్ మొహల్లా, న్యూ లాడ్ బజార్‌లో ఉన్న మెసర్స్ అల్ అక్బర్ ఫాస్ట్ ఫుడ్ అండ్ గోడౌన్ ప్రాంగణాన్ని తనిఖీ చేసింది.ఈ తనిఖీలో, ప్రజారోగ్యానికి తీవ్ర ముప్పు కలిగించే విధంగా అత్యంత అపరిశుభ్రమైన మరియు ప్రమాదకరమైన పరిస్థితుల్లో ఆహార పదార్థాలను తయారు చేయడం మరియు నిల్వ చేయడం జరుగుతున్నట్లు గుర్తించారు.నిర్బంధ ఎఫ్ ఎస్ ఏఎస్ ఎల్ లైసెన్స్ లేకుండా నిర్వహించడం.నిషేధించబడిన-కృత్రిమ ఆహార రంగులను ఎంఎస్ కె లయన్ గ్రీన్ మరియు రాస్ప్బెర్రీ రెడ్, ఉపయోగించడం.పాడైపోయిన మరియు ప్రమాదకరమైన వంట నూనెను పదే పదే ఉపయోగించడం.నీటి విశ్లేషణ ధృవీకరణ మరియు నాణ్యత నియంత్రణ చర్యలు లేకపోవడం.విపరీతమైన అపరిశుభ్ర వాతావరణం, కీటకాల నియంత్రణ. స్వాధీనం చేసుకున్న వివరాలు:సుమారు 110 కిలోల తయారు చేసిన ఫ్రైడ్ చికెన్6 టిన్నుల వంట నూనె ఒక్కొక్కటి 15 లీటర్లు,కృత్రిమ రసాయన ఆహార రంగులుఈ అక్రమ కార్యకలాపాలను నిర్వహిస్తున్న ఇద్దరు బాధ్యులను అదుపులోకి తీసుకున్నారు.అసురక్షిత ఆహార పద్ధతులపై అధికారులకు ఫిర్యాదు చేయండి. ఫిర్యాదుల కొరకు టోల్-ఫ్రీ నంబర్: 8712661212 ను సంప్రదించండి.ఆహార భద్రత మరియు ప్రజారోగ్యాన్ని కాపాడటంలో ప్రజల సహకారం ఎంతో అవసరం.

## ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

**- మున్సిపల్ కమిషనర్ కు కార్మికుల వినతి పత్రం**

**- నరసరావుపేటలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ర్యాలీ, నిరసన**




**నరసరావుపేట(భారత శక్తి)** ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధ సంఘం రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా శనివారం నరసరావుపేట మున్సిపల్ ఆఫీస్ వద్ద ధర్నా చేయడం జరిగినది. తదనంతరం నరసరావుపేట మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కమిషనర్ కు వినతిపత్రం ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమం లో ఏఐటీయూసీ పల్నాడు జిల్లా కార్యదర్శి కాసా రాంబాబు మాట్లాడుతూ, మున్సిపల్ కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ కార్మికులందరిని రెగ్యులర్ చేయాలని, పెరుగుతున్న జనాభా ప్రకారం మునిసిపాలిటీ విస్తరణలో భాగంగా అదనంగా కార్మికులను నియమించి పని భారం తగ్గించాలి మున్సిపల్ కార్మికులందరికీ సంక్షేమ పథకాలన్నీ అమలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు ఉప్పలపాటి రంగయ్య మాట్లాడుతూ, పిఆర్సి కమిటీ వేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఎక్స్గ్రేషియా ఇవ్వాలని కోరారు. ఈ ధర్నా ను ఉద్దేశించి పట్టణ సిపిఐ కార్యదర్శి సత్యనారాయణ రాజు సంఘీభావం ప్రకటించి కార్మికులకు ఇవ్వవలసిన బెనిఫిట్స్ అన్ని ఇవ్వాలని వారి చేయి పోరాటాలకు, పార్టీ సంఘీభావంగా మద్దతుగా ఉంటుందని తెలియజేశారు. మున్సిపల్ యూనియన్ సెక్రటరీ చిరుగురి జక్రం మాట్లాడుతూ, కనీస వేతనం 36,000 ఇవ్వాలని, కార్మికులందరి కు కూడా ఐ.ఎస్.ఐ కార్డులు ఇవ్వాలని, కార్మికులందరికీ గ్రాడ్యుటి అమలు చేయాలని కోరారు. సమస్యలు అధికారులు ప్రభుత్వం అమలు చేయని ఎడల ఈనెల 22వ తారీఖున స్థానిక ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు, 24 వ తారీఖున చలో కలెక్టరేట్, అప్పటికి సమస్యలు పరిష్కారం కాని పక్షాన జులై 7 ఛలో విజయవాడ భారీ ప్రదర్శన ధర్నా నిర్వహించాలని రాష్ట్ర నాయకత్వం పిలుపు ఇచ్చింది. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రెసిడెంట్ దీనమ్మ, జాయింట్ సెక్రెటరీ డేవిడ్, వినుకొండ కొండమ్మ, దయామణి, కొండ్రు శీను, బోదాల యేసు, గల్లిపోగు శివ తదితరులు పాల్గొన్నారు.

## ఏసీబీ వలలో తహాశీల్దార్

**నెల్లూరు(భారత శక్తి)** ఏ.ఎస్.పేట తహసీల్దార్ శాంతిస్వరూప్ లంచం తీసుకుంటూ ఏసీబీ చిక్కాడు. రైతు కృష్ణారెడ్డి నుంచి రూ.20 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. తహసీల్దార్ శాంతిస్వరూప్, ఒక పాస్ పుస్తకంలో పేరు మార్చేందుకు రైతు నుంచి లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణ.

## శ్రీ సరస్వతీ శిశు మందిర్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు




**కరీంనగర్ (భారత శక్తి)** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో ఘనంగా యోగా కార్యక్రమం నిర్వహించారు. యోగా శిక్షకురాలు, శిశుమందిర్ పూర్వ విద్యార్థిని దండె ప్రియాంక విద్యార్థులు, ఆచార్యులతో కలిసి సూర్యనమస్కారాలు, వివిధ ఆసనాలు, ప్రాణాయామం చేయించారు.ఈ సందర్భంగా పాఠశాల కార్యదర్శి కోల అన్నారెడ్డి, సమితి కార్యదర్శి ఎలగందుల సత్యనారాయణ గార్లు మాట్లాడుతూ యోగా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతతను పెంపొందిస్తుందని తెలిపారు. నిత్య జీవితంలో యోగాను భాగంగా చేసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవచ్చని సూచించారు.మాతాజీలు, ఆచార్యులు విద్యార్థులకు యోగా ప్రాముఖ్యతను వివరించి, ప్రతిరోజూ యోగా సాధన చేయాలని ప్రోత్సహించారు. విద్యార్థులు ఉత్సాహంగా యోగా ప్రదర్శనలు నిర్వహించి అందరినీ ఆకట్టుకున్నారు. యోగా ద్వారా ఆరోగ్యవంతమైన, క్రమశిక్షణతో కూడిన జీవన విధానాన్ని పెంపొందించడమే ఈ దినోత్సవం లక్ష్యమని, పాఠశాలలో ప్రతిరోజూ విద్యార్థులతో యోగా, ధ్యాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ప్రధానాచార్యులు మోర రణధీర్ తెలిపారు.

## మాజీ సైనికుడి భూమిని అక్రమించారు

**- దగ్గుబాటి సురేష్ బాబుపై ఆరోపణ**

**హైదరాబాద్ (భారత శక్తి)** శేర్లింగంపల్లి,ఖానామెట్లోని తమ 5 ఎకరాల ప్రైమ్ ల్యాండ్ ని కబ్జా చేశారని దగ్గుబాటి సురేష్ బాబు, దగ్గుపాటి రామానాయుడు, దగ్గుపాటి వెంకటేష్,దగ్గుపాటి లక్ష్మి,లక్ష్మి లపై బాధితులు ఆరోపణులే చేసారు. తమ భూమి హద్దులతో కలిసి ఉన్న 21 ఎకరాల స్థలంతో పాటు అపర్ణ కన్స్ట్రక్షన్ కంపెనీ తమ 5 ఎకరాల ప్రైమ్ ల్యాండ్ ను సదరు దగ్గుపాటి కుటుంబంతో కలిసి కబ్జా చేసింది అంటూ ఆరోపించారు.ఖానామెట లో సర్వే నెంబర్ 49/1 లో 5 ఎకరాల భూమి ఉంది.. 1994 లో ఎక్స్ సర్వీస్ మెన్ కోటాలో షేక్ అహ్మద్ కు ఈ 5 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించింది.. ఈ స్థలాన్ని దగ్గుబాటి సురేష్ బాబు కబ్జా చేశారు. పక్కనే ఉన్న తన 21 తన ఎకరాల స్థలంతో పాటు మా 5 ఎకరాల స్థలాన్ని కబ్జా పెట్టి.. ఓ రియల్ ఎస్టేట్ సంస్థ కి డెవలప్మెంట్ కి ఇచ్చారు. అడిగితే.. అపర్ణ కన్స్ట్రక్షన్ కంపెనీ సెక్యూరిటీ అని చెప్తున్నారు. మా స్థలంలోకి మమ్మల్ని రానివ్వడం లేదు. కోర్టు పరిధిలో ఉన్నప్పుడు ఎలాంటి నిర్మాణాలు చేపట్టొద్దు అయినా అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని ఆరోపించారు.మాదాపూర్ పోలీసులకు, మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశాం.. మాపై బెదిరింపులకు పాల్పడుతున్నారు.. టోల్ గేట్ మాదిరిగా పెట్టి ఎవరినీ అనుమతించడం లేదు. కనీసం కోర్టు తీర్పు వచ్చేవరకు ఐనా వెయిట్ చేయాలి.. అలా కాకుండా నిర్మాణాలు చేపడుతున్నారని వాపోయారు.

## నారాయణ క్రషర్, క్వారీ అనుమతులపై విచారణ చేయాలి

**- తహసీల్దార్‌కు చక్రవర్తి ఫిర్యాదు**



**రంపచోడవరం(భారత శక్తి)** పోక్స్‌పేట పంచాయతీ నర్సాపురం, దిరిసినపల్లి వద్ద ఉన్న నారాయణ క్రషర్ మరియు క్వారీకి ప్రభుత్వ అనుమతులు ఉన్నాయా లేదా అనే దానిపై సమగ్ర విచారణ జరిపించాలని బీజేపీ పోలవరం జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ చక్రవర్తి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు.క్రషర్, క్వారీ నిర్వహణకు మైన్స్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, రెవెన్యూ శాఖల నుంచి తగిన లైసెన్సులు ఉన్నాయో లేదో తనిఖీ చేసి వాస్తవాలను వెల్లడించాలని ఫిర్యాదులో కోరారు.అనుమతులు లేకుండా నిర్వహిస్తుంటే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని చక్రవర్తి విజ్ఞప్తి చేశారు. తహసీల్దార్ ఫిర్యాదు స్వీకరించి సంబంధిత అధికారులతో విచారణ చేయిస్తామని హామీ ఇచ్చారు.

## ప్రభుత్వ రంగ పాడి పరిశ్రమ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి:జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.



నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 20 (భారత శక్తి)కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో విజయ డైరీ పురోగతిపై జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సంబంధిత శాఖల అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విజయ డైరీ ద్వారా పాడి రైతులకు అందుతున్న సేవలు, పాల సేకరణ సామర్థ్యం పెంపు, మార్కెటింగ్ లో చేపట్టాల్సిన మార్పులపై చర్చించారు. నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పాడి పరిశ్రమను లాభాల బాటలో నడిపించేందుకు క్షేత్రస్థాయిలో ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని ఆదేశించారు.పాల సేకరణ కేంద్రాల విస్తరణ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని పాడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించడమే ప్రధాన ధ్యేయంగా పనిచేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. విజయ డైరీ ఉత్పత్తులు ఎల్లప్పుడూ నాణ్యతను పాటిస్తూ, మార్కెట్లో వాటి లభ్యతను విస్తృతం చేయడం ద్వారా వినియోగదారుల నమ్మకాన్ని చూరగొనాలని సూచించారు. పాడి రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలు, రాయితీలను అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మహిళా సంఘాల ద్వారా పాడి పరిశ్రమ అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా పాడి పరిశ్రమ అభివృద్ధికి ఉన్న అవకాశాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని పేర్కొన్నారు. విజయ డైరీని మరింత బలోపేతం చేసేందుకు అవసరమైన సహకారం అందిస్తామన్నారు. ప్రభుత్వ రంగ పాడి పరిశ్రమ అభివృద్ధి వల్ల పాడి రైతులు ఆర్థికంగా లాభం పొందడమే కాకుండా, ప్రజలకు మెరుగైన పాలు, పాల ఉత్పత్తులు అందుతాయని తెలిపారు. అనంతరం కలెక్టర్ కు విజయ డైరీ ఉత్పత్తులు సంస్థ అధికారులు అందించారు. ఈ సమావేశంలో విజయ డైరీ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్, డిఆర్డీఓ విజయలక్ష్మి, పశుసంవర్ధక అధికారి బాలిగ్ అహ్మద్, వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, ఎల్డీఎం రాంగోపాల్, ఇతర అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

## బాయిల్డ్ రైస్ మిల్లింగ్ ప్రక్రియ పూర్తి చేయాలి

**- అదనపు కలెక్టర్ సి హెచ్ మహేందర్ జి**



**ములుగు జిల్లా ప్రతినిధి, జూన్ 20 (భారత శక్తి):** బాయిల్డ్ రైస్ మిల్లింగ్ ప్రక్రియను సమన్వయంతో వేగవంతంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి సంబంధిత అధికారులను, రైస్ మిల్లర్లను ఆదేశించారు.శనివారం జిల్లా కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ రెవెన్యూ సి హెచ్ మహేందర్ జి తన ఛాంబర్‌లో బాయిల్డ్ రైస్ మిల్లర్లతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా ధాన్యం సేకరణ, మిల్లింగ్ ప్రక్రియను ఎలాంటి ఆటంకాలు లేకుండా పూర్తి చేయాలని సూచించారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని మిల్లర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు.మిల్లింగ్ ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలను సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం, మిల్లర్లు, సంబంధిత శాఖల మధ్య సమన్వయం మెరుగ్గా ఉంటే ప్రక్రియ మరింత వేగవంతంగా పూర్తవుతుందని పేర్కొన్నారు.ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి ఫైజల్ హుస్సేన్, డి యం కృష్ణ వేణి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్,రైస్ మిల్లర్లు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్‌లో 3,909 కేసుల పరిష్కారం

**- రూ.2.27 కోట్లకు పైగా పరిహారం, జరిమానాల వసూలు: జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.నీరజ.**



**భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల, జూన్ 20:**రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం విజయవంతమైంది. జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.నీరజ ఆధ్వర్యంలో జరిగిన ఈ మెగా అదాలత్‌లో రికార్డు స్థాయిలో మొత్తం 3,909 కేసులను రాజీమార్గంలో పరిష్కరించినట్లు ఆమె వెల్లడించారు. ఈ కేసుల పరిష్కారం ద్వారా బాధితులకు నష్టపరిహారం, అలాగే వివిధ జరిమానాల రూపంలో మొత్తం రూ.2,27,71,225/- రెండు కోట్ల ఇరవై ఏడు లక్షల డెబ్బై ఒక్క వేల రెండు వందల ఇరవై ఐదు రూపాయలు వసూలైనట్లు న్యాయమూర్తి వివరించారు. దీర్ఘకాలికంగా కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న వివాదాలను ఉభయ పక్షాలు సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్ ఒక చక్కని వేదికగా నిలిచిందని ఆమె పేర్కొన్నారు. ఈ అదాలత్‌లో పరిష్కారమైన కేసుల వివరాలను పరిశీలిస్తే అత్యధికంగా ట్రాఫిక్ చలాన్ కేసులు 2419, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు 1028 పరిష్కారమయ్యాయి. వీటితో పాటు క్రిమినల్ కేసులు 246, బ్యాంకు ప్రీలిటిగేషన్ కేసులు 86, సైబర్ క్రైమ్ కేసులు 61, బీఎస్ఎన్ఎల్ బకాయిల కేసులు 23, మోటార్ వాహన ప్రమాద బీమా క్లెయిమ్ కేసులు 15 పరిష్కారమయ్యాయి. అలాగే సివిల్ తగాదాలు 10, ఎక్సైజ్ కేసులు 09, కుటుంబ నియంత్రణ/వైవాహిక తగాదాలు 08, మరియు చెక్ బౌన్స్ కేసులు 04 చొప్పున పరిష్కరించి కక్షిదారులకు ఊరటనిచ్చారు. ఈ సామరస్య పరిష్కార వేదికలో మొదటి అదనపు జిల్లా జడ్జి బి.పుష్పలత, పోక్సో కోర్టు న్యాయమూర్తి రాధిక జైస్వాల్, అదనపు ఎస్పీ డి.చంద్రయ్య, సీనియర్ సివిల్ జడ్జి, సిరిసిల్ల - కమ్ - ఎఫ్ఏసీ జిల్లా చట్టపరమైన సేవల అధికార సంస్థ కార్యదర్శి పి.లక్ష్మణాచారి పాల్గొన్నారు. వీరితో పాటు సిరిసిల్ల బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఆవునూరి రమాకాంతరావు, లోక్ అదాలత్ సభ్యులు చింతోజు భాస్కర్, పలువురు న్యాయవాదులు, పోలీస్ సిబ్బంది, వివిధ బ్యాంకుల అధికారులు, పెద్ద సంఖ్యలో కక్షిదారులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

# రెవెన్యూ దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలి

**- ప్రజల అర్జీలపై నిర్లక్ష్యం సహించేది లేదు:జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**





**నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 20 (భారత శక్తి)** ప్రజల నుంచి వచ్చే అన్ని రకాల రెవెన్యూ దరఖాస్తులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా రెవెన్యూ అధికారులను ఆదేశించారు.శనివారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పలు కీలక అంశాలపై సమీక్ష నిర్వహించారు. మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న భూభారతి, సాదా బైనామా, ప్రజావాణి అర్జీలు, పౌర సేవల ధ్రువీకరణ పత్రాల జారీ పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల నుంచి అందుతున్న అర్జీల పరిష్కారంలో జాప్యానికి తావివ్వకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ముఖ్యంగా భూభారతి, ప్రజావాణి, సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు. భూభారతి దరఖాస్తుల పరిష్కారానికి ప్రభుత్వం 60 రోజుల గడువు నిర్దేశించిందని, ఈ గడువులోపే ప్రక్రియ పూర్తయ్యేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.పౌర సేవల కింద జారీ చేసే కులం, ఆదాయం, నివాసం, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాలతో పాటు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి సంక్షేమ పథకాల దరఖాస్తులను సత్వరమే పరిశీలించి అర్హులైన వారికి వెంటనే ఆమోదం తెలపాలని తహసీల్దార్లకు స్పష్టం చేశారు. దరఖాస్తులను తిరస్కరించే పరిస్థితి ఏర్పడితే, సంబంధిత కారణాలను స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు.సాదా బైనామా దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను కూడా త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, డి ఆర్ ఓ రాథోడ్ రమేష్, ఆర్డీఓ దేవీదాస్, తహసీల్దార్లు, ఇతర రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## దుబ్బతండా ఉప సర్పంచ్ సోదరుడి వివాహ వేడుకకు హాజరైన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి



**జనగామ(భారత శక్తి)జూన్ 20:** దూల్మిట్ట మండలంలోని రెడ్యానాయక్ తండాలో శనివారం జరిగిన దుబ్బతండా ఉప సర్పంచ్ సుమన్ నాయక్ సోదరుడు సురేష్ నాయ క్-అఖిలల రిసిప్షన్ వేడుకకు జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి శనివారం హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూ వరులను ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆశీర్వదించి, వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఆనందంగా కొన సాగాలని ఆకాంక్షించారు.

## ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలను తనిఖీ చేసిన సివిల్ సప్లై అధికారులు

**- హాస్టల్ సిబ్బంది నాణ్యత ప్రామాణాలు పాటించాలి..**

**- సివిల్ సప్లై అధికారి షేక్ ఎప్రాన్..**



**రేగొండ, జూన్ 20 (భారత శక్తి):** తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యార్థుల సంక్షేమం, వసతి గృహాల్లో ఆహార నాణ్యత, మరియు మౌలిక వసతులను పర్యవేక్షించడానికి సివిల్ సప్లై అధికారులు, విద్యాశాఖ అధికారులతో కలిసి ఎంజేపీ గురుకుల పాఠశాలలను, జిల్లా పరిషత్ హై స్కూల్ ను తనిఖీ చేశారు.ప్రభుత్వ ఆదేశాల మేరకు సివిల్ సప్లై ఇన్స్ పిక్టర్గ అధికారి షేక్ ఎప్రాన్ సిబ్బందితో రేగొండ మండలం ఎం జి బి వి గురుకుల పాఠశాల, జిల్లా పరిషత్ పాఠశాల, రేగొండ మండల కేంద్రంలోని రెండవ రేషన్ షాప్ ను తనిఖీ చేశారు. విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనం నాణ్యతను స్వయంగా పరిశీలించారు.వంట గది, పరిసరాలు, కిచెన్ పరిశు భ్రత, మెనూ ప్రకారం భోజనం అందుతుందా లేదా అనేది తనిఖీ చేసారు .మౌలిక వసతులు: హాస్టల్ గదులు, త్రాగునీటి సౌకర్యం (ఆర్ ఓ ప్లాంట్లు), మరియు మరుగుదొడ్ల పరిశుభ్రతను పరిశీలించారు.రేగొండ మండల కేంద్రంలోని రెండవ రేషన్ షాప్ ను తనిఖీ చేసి పౌర సరఫరాల వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఎస్సై జంగయ్య, సివిల్ సప్లై ఇన్స్పెక్టర్ భాస్కర్ల రాజు, టెక్నికల్ అసిస్టెంట్ రాహుల్, అరవింద్ పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కల నెరవేర్చడమే ప్రజాపాలన లక్ష్యం

- **రాష్ట్రంలో నాలుగున్నర లక్షల ఇండ్లు నిర్మాణం**
- **విద్య, వైద్యానికి మొదటి ప్రాధాన్యమిస్తున్న ముఖ్యమంత్రి**
- **మహిళా సంఘ భవనం, తరగతి గది ప్రారంభించిన మంత్రి సీతక్క**
- **ఇందిరమ్మ ఇండ్ల పురోగతిలో ఆలేరుకు రెండవ స్థానం: బీర్ల అయిలయ్య**



**భారత శక్తి, జూన్ 20 (యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి):** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలోని నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశంతో పాటు గుండ్లపల్లిలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్మించిన తరగతి గదిని శనివారం మంత్రి సీతక్క స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో పేదవాడి సొంతింటి కల నెరవేర్చడమే ప్రజాపాలన లక్ష్యమని ఇప్పటికే మొదటి విడతలో నాలుగున్నర లక్షల ఇండ్లు పూర్తయ్యే దశలో ఉన్నాయని త్వరలో రెండవ విడతలో మరిన్ని ఇండ్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఆలేరు నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందుంచుతూ సోదరుడు బీర్ల అయిలయ్య ఎల్లపుడూ అనేక సమస్యలను నా ముందుకు తీసుకురావడంతో నాకు సంబంధించిన అన్ని శాఖల నుండి సాధ్యమైనంత వరకు సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో పేదలు ఇళ్లు లేక అనేక అవస్థలు పడుతుంటే పేదవాడి సొంతింటి కలను నేరవేర్చడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నాలుగున్నర లక్షల ఇండ్లు ఇవ్వడంతో అ కుటుంబాలు నేడు ఎంతో ఆనందంగా ఉన్నాయని అన్నారు. పేదలు కట్టుకునే ఇంటికోసం ఐదు లక్షల రూపాయలు సహాయం అందించడం అనేది చాలా గొప్ప విషయం అని అది కేవలం ఇందిరమ్మ రాజ్యం వల్లనే సాధ్యమని తెలిపారు. అదేవిధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్య, వైద్యం మీద ప్రత్యేక శ్రద్ధ పెట్టారని అందులో భాగంగా విద్యాలయాలను బాగు చేయడం, దుస్తులు, పుస్తకాలతో పాటు నాణ్యమైన ఆహారం అందిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ విద్యాలయాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో మొదటి మహిళా సంఘం భవనం మరియు అత్యధిక మహిళా సంఘాల భవనాలు ఆలేరు నియోజకవర్గంలో కావడం సంతోషకరమని తెలిపారు. అనంతరం బీర్ల అయిలయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే 310 కోట్లతో మిషన్ భగీరధ ప్రాజెక్ట్ ద్వారా మంచినీటికి కేటాయించిందని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిలో ఆలేరు నియోజకవర్గం రెండవ స్థానంలో ఉందంటే ప్రభుత్వ చలవే అని అన్నారు. మంత్రి సీతక్క చలవతో ఆలేరు నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేసుకుంటున్నామని వివో భవనాలు కూడా అన్ని గ్రామాలలో నిర్మించుకుంటున్నామని రాష్ట్రంలోనే మొదటి వివో భవనం ఆలేరు నియోజకవర్గంలో ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ అనురాగ్ జయంతి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, మహిళా సంక్షేమ శాఖ చైర్మన్ బజ్రు శోభారాణి, ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ ఎరుకల చైతన్య మహేందర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వాణి భరత్ గౌడ్, వైస్ చైర్మన్ బరిగె రమ్య రాంచందర్, కౌన్సిలర్లు ముక్కర్ల మల్లేష్ యాదవ్, బూడిద మధు, బిట్టు సరోజ హరీష్, కర్రె మాధవి ప్రవీణ్, పెలిమెల్లి లావణ్య శ్రీధర్ గౌడ్, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉమెన్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం

**ఆలమూరు, భారత శక్తి ప్రతినిధి, జూన్ 20:** మండలంలోని చింతలూరు గ్రామంలో నూకాంబిక అమ్మవారి ఆలయ ప్రాంగణము నందు శనివారం ఉమెన్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. ట్రస్ట్ చైర్మన్, ఏజిపి బూసి విద్య ప్రసన్న పర్యవేక్షణలో, గన్ని నారాయణరావు, గన్ని సూర్యలక్ష్మి, గన్ని వెంకటరావు సహకారంతో ఈ కార్యక్రమం జరిగింది. ఈ వైద్య శిబిరంలో ధరణి వాస్కులర్ అండ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, గౌతమి నేత్రాలయం, రమా దంత వైద్యశాల వైద్య బృందాలు పాల్గొని ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించాయి. సాధారణ ఆరోగ్య పరీక్షలతో పాటు కంటి, దంత మరియు ఇతర ప్రత్యేక వైద్య సేవలను అందించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వంటిపల్లి సతీష్, ఈదర నల్లబాబు, వైట్ల శేషబాబు, సలాది నాగేశ్వరరావు, ఎంపీడీఓ ఏ. రాజు, నూకాంబికా అమ్మవారి దేవస్థానం చైర్మన్ వీరి అప్పారావు పాల్గొని ప్రారంభించారు. అలాగే విద్యాభ్యాసంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న ఏఐ అండ్ ఎంఎల్ విద్యార్థి శశాంక్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో



నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు 350 మంది రోగులు పాల్గొని వైద్య సేవలు పొందారు. వైద్యుల సూచనలు మేరకు అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో బలుసు శ్రీను, ముప్పిరి వెర్రియ్య, దిడ్డి రాము, కాలా సాయిబాబు, గొడవర్తి కృష్ణమూర్తి, ఈవో వీర్రాజు చౌదరి, బూసి చిట్టికుమార్, తదితరులు పాల్గొన్నారు.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9550336688,94405 08078 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy,Executive Editor: M.Venugopal Reddy